సంపుటి: 42
సంచిక: 6

ఫోన్ నెం:
64843

అపరాధ పరిశోధన

సచిత్ర డిటెక్టివ్ మాస పత్రిక

ఏడాది చందా (పత్రిక లేదా సప్లిమెంట్) 84 రూపాయలు.
హోమ్ డెలివరీ (సభ్యత్వ రుసుము) 10 రూపాయలు.

జూలై, 1986

మేనేజింగ్ ఎడిటర్:
శ్యామ దామోదర రెడ్డి

అసిస్టెంట్ ఎడిటర్:
డి. రవికుమార్

సీనియర్ ఎడిటర్స్:
వి. ఎస్. చెన్నూరి
ఏ. పీ. మోహన్రావ్
ఆర్. ప్రభాకర్
బొమ్మిడి అచ్చారావు

అపరాధ పరిశోధన పోటీ-214

[ఫలితాలు]

మే '86 నెల "అపరాధ పరిశోధన పోటీ—214" కి సరియైన సమాధానాలు:

1. ఛార్లెస్ శోభరాజ్
2. సాధారణ శిక్షలు
3 డబ్బు వ్యామోహం
4. ఆంధ్రప్రదేశ్
5 అనాథలు

పై జవాబుల ప్రకారం ఒకే ఒక్కరు మాత్రమే ఆల్ కరెక్టుగా పంపారు. ఈ పాఠకుడికి ఆగస్టు '86 నెలనుండి ఒక ఏడాదిపాటు "అపరాధ పరిశోధన" మాసపత్రిక లేదా సప్లిమెంట్ (లేదా 6 నెలలపాటు పత్రిక మరియు సప్లిమెంట్) బహుమతిగా పంపబడుతుంది.

బహుమతి పొందిన విజేత.—

(1) శ్రీ టి యస్. శివప్రసాదరావు,
S/O తేల్కార్ శంకర్ రావు,
(జర్నలిస్ట్)
సౌకార్ పేట,
పామిడి—5 5 775.
(అనంతపురం జిల్లా)

ఈ నెలలో...

కథలు (మాస పత్రిక)

4. మిమిక్రీ దొంగ—ఎల్లేశ్వరరావు
23. అతనికంటె ఘనుడు—వసుంధర
44. టెంపోరావ్ జవాబులు
59. ఖెడ్డా—వి. యస్. రావ్
107. బ్లూ బేబీ —కె. వి. యస్. యన్. మూర్తి
124. నారాయణ మంత్రం—జొన్నలగడ్డ రాములక్ష్మి
145. చివరి మజిలీ—సుంకరి రాంప్రసాద్
173. నరసింహావతారం—(సీరియల్) వసుంధర

నవలలు (సప్లిమెంట్)

3. ఆరాధన—వసుంధర
49. టెంపోరావ్ జీవిత చరిత్ర — డాక్టర్ వి. సుభద్ర
89. రాకాశిచేతి— పీలూ
33. కుంభాకార కటకం—చంద్రశేఖర ఆజాద్
184. అన్వేషణ—వి. యస్. రావ్

ఇంకా — ముఖచిత్ర వ్యాఖ్యల పోటీ, అపరాధ పరిశోధన పోటీ, కార్టూన్లు, మరెన్నో ఆకర్షణలు!!!

మిమిక్రీ దొంగ

ఎల్లేశ్వరరావ్

శాంతి మరోసారి విసుక్కుంది భర్తమీద.

రామారావు రెవిన్యూ డిపార్టుమెంట్‌లో పనిచేస్తుంటాడు. అతడు ఇంచుమించు ప్రతిరోజూ ఇంటికి ఆలస్యంగా వస్తూంటాడు. దాదాపు రాత్రి పదిగంటలు దాటుతుంది ప్రతిరోజూ. ఆఫీస్ నుండి బార్‌కి, అక్కడ్నుండి

బస్‌స్టాప్‌కి, బస్ రాకుంటే ఆటోమీద ఇంటికి చేరుకుం టూంటాడు.

ఎంత ఆపుకుందామనుకున్నా మరోసారి వచ్చింది ఆవు లింత. అలా ఆవులింత వచ్చిన ప్రతిసారీ విసుక్కుంటుంది భర్తమీద. తనకసలే చీకటి పడితే ఒంటరిగా ఉండాలంటే భయం. తనొంటరిగా వున్నప్పుడు ఒకసారి దెయ్యాలు, మరోసారి బందిపోటు దొంగలు దాడిచేసినట్లుగా ఆమె తరచూ కలలు కంటుంది.

టప్....ప్....ప్ మని చప్పుడు.

ఆమె గుండె ఝల్లుమంది. చలికి కప్పుకున్న రగ్గును ఒంటినిండా మరింత బిగిస్తూ చప్పుడు వినవచ్చిన దిశగా చూసింది. గాలికి కాబోలు వెంటిలేటర్ ఊగుతుంది. దెయ్యాలు వచ్చేముందు వెంటిలేటర్‌లు వూగటం తను కొన్ని సినిమాల్లో చూసింది. ఆ విషయం గుర్తుకు రాగానే గొంతు తడారిపోయింది.

సరిగ్గా అప్పుడే, "టింగ్....టింగ్" కాలింగ్ బెల్ చప్పుడు.

హమ్మయ్య ఈయన వచ్చేశారు, అనుకుని వెంగున సోఫామీది నుండి దూకి, తలుపు దగ్గరికి పరుగెత్తి, ఏదో గుర్తుకివచ్చి ఉన్నచోటనే ఆగిపోయింది.

అసలే సిటీలో దొంగల బెడద ఎక్కువ. తలుపుల కవ తల వచ్చినదెవరో తెలుసుకోవటానికి తగిన ఏర్పాట్లు కానీ, కటకటాలు గానీ, తలుపులకి మరో చిన్న తలుపు వంటిది గానీ, ఏమీలేవు. అందువల్ల వచ్చినదెవరో తెల్సు కొని గానీ తలుపులు తీయవద్దని రామారావు చెప్పి వున్నాడు.

"ఎవరూ?" తలుపు గడియమీద చెయ్యివేస్తూ అడి

గింది.

"నేనే. తలుపుతియ్!"

"నేనే అంటే....?" ఇలాకూ్కడా అడగమని రామారావ్ చెప్పాడు.

"నీ మొగుణ్ణి. ఎన్నిసార్లు సమాధానం చెప్పాలి?తలుపుతియ్" దాదాపు అరిచాడు. ఇటు ఆరిళ్ళు అటు ఆరిళ్ళకు వినపడేలా.

భర్త గొంతు గుర్తుపట్టి కంగారుగా తలుపు తీసింది.

ఆ వెంటనే పిస్టల్‌తో లోపలికి దూసుకువచ్చిన ఆగంతకుని చూసి కెవ్వుమనబోయి...."ష్....ష్ .... నోరు పైకి లేచిందా యిప్పుడే నా చేతిలో చస్తావ్" అని అతడన్నందువల్ల బలవంతాన ఆపుకుంది. మనిషి బిర్రబిగుసుకుపోయింది. ఇప్పుడామెను యెవరైనా చూసినట్లయితే, ప్లాస్టిక్‌తో చేసిన విగ్రహమా లేక ప్లాస్టర్ అఫ్ పారిస్‌తో చేసిన విగ్రహమా అని సందేహపడతారు ఖచ్చితంగా.

"ఈ పిస్టల్ దీపావళి పిస్టల్ అనిగానీ, నాటకాల పిస్టల్ అనిగానీ. నీకు ధర్మసందేహం వుంటే నీ చెయ్యి ఒకటి గాలిలోకి సాచిపెట్టు. కాలుస్తాను. రక్తం వస్తేనే నిజమైనదని సమ్మొదుద్‌గానీ. సైలెన్సర్ వుంది గనుక శబ్దం రాదు. ఏం?"

అర్థమైనట్లు తలూపిందామె.

ఆమె రెప్పలార్పటం, పెదవులు కదిలించడం మానేసి దాదాపు నిముషం పూర్తికావొస్తోంది.

"అలా వెనక్కి వెళ్ళి సోఫాలో కూర్చో!"

బుద్ధిగా, భయంగా వెనక్కెళ్ళి కూర్చొంది. అప్పుడు మొదలుపెట్టాయి సరిగ్గా కళ్ళు ఏడ్వటం.

"చూడమ్మా! ఈ సమయంలో నీలాంటివారికి దుఃఖం రావడం సహజం. ఐతే నేను దొంగతనానికి వెళ్ళే యే ఇంట్లోనూ ఐదునిముషాలకన్నా ఎక్కువసేపు గడపటం నాకు ఇష్టం ఉండదు. సో, త్వరగా మీ యింట్లో ఉన్న డబ్బు, బంగారం, నీ వంటిమీద ఉన్నదాంతో సహా తీసిచ్చేస్తే త్వరగా వెళ్ళిపోతాను."

ఆమె యేం మాట్లాడలేదు. రెండు కాళ్ళనూ సోఫాపైకి లాక్కుని, మడిచి వాటిచుట్టూ గట్టిగా చేతులు బిగించి తల మోకాళ్ళమీద ఆనించి శబ్దం రాకుండా వెక్కుతూ ఏడుస్తుంది.

అతడి కాలు విసురుగా వచ్చి టీపాయ్‌ని తన్నింది. అంతే, ధన్.....న్ మనే శబ్దంతో టీపాయ్ గాల్లోకి లేచింది.

అదిరిపడి కెవ్వున అరవబోయి అతడు "ఊఁ" అని ఉరమడంతో ఆగిపోయింది.

"తాళాలెక్కడ?" ఈసారతని కంఠం వురిమినట్లుంది.

తడబడుతున్న కాళ్ళతో గబగబా వెళ్ళి తాళాలగుత్తి తెచ్చి అతడి దగ్గరగా కాళ్ళవైపు విసిరి తిరిగి సోఫా ఎక్కి కూర్చుందామె.

తర్వాత, అతడు గబ గబా బీరువా దగ్గరికి వెళ్ళి చక చకా పని ముగించుకొని వచ్చేసరికి, ఆమె, చేతిగాజులు, చెవి లోలకులూ క్రింద పెట్టి వాటివైపే చూస్తూ కూర్చుంది.

అవి తీసుకుంటూ, "గుడ్! నువ్ చాలా మంచిదానివి" చిన్నగా నవ్వుతూ తీక్షణంగా ఆమెవంక చూస్తూ అన్నాడు.

ఆమె భయంగా పైటను మెడపైకి మరింత బిగుతుగా

లాక్కుంది.

"భయపడకు. నీ తాళి నా కక్కరలేదు. నిన్ను నేను తాకకుండా వుండాలంటే కొన్ని పన్లు చెయ్యాలి, చేస్తావా?"

ఆమె చప్పున తల వూపింది అంగీకారంగా.

"గుడ్! ఈ గుడ్డను నీ నోటిలో పూర్తిగా కుక్కుకో."

గుడ్డ సగమే మారింది. ఆమె నిస్సహాయంగా చూసింది.

అతడు అసహనంగా "ఊఁ" అని ఉరిమి పిస్టల్ ఆమె నుదుటికి ఆనించాడు.

ఆమె కంగారుగా మొత్తం కూరుకుంది, అతి కష్టం మీద.

"గుడ్....ఈ తాడుతో నీ రెండుకాళ్ళనూ దగ్గరకు చేర్చి కట్టుకో."

ఆ తర్వాత, రెండు ముడులు వేసివున్న తాడులో ఆమె చేతుల్ని వెనక్కిపెట్టి అందులో దూర్చమన్నాడు. ఆమె అలా చేసిన తరువాత, ముడిని గట్టిగా బిగించి వదిలేశాడు. ఇప్పుడామె తన భర్త వచ్చేవరకూ ఏమీ చెయ్యలేదు.

అతడు గబ గబా బయటకు వచ్చి, తలుపుల్ని బయటి గొళ్ళెంపెట్టి చకచకా రోడ్డుమీదికి నడిచాడు.

2

ఉదయం 6-05 నిమిషాలవుతుంది.

రాత్రి రామారావ్ ఇంటికి వచ్చేసరికి అతడి భార్య దాదాపు స్పృహ తప్పే స్థితికి చేరుకుంది. తర్వాత ఆమె చెప్పింది వి.. పోలీసులకి ఫోన్ చేద్దామని బయల్దేరబోయాడు. ఐతే వంటరిగా ఒక్కక్షణం కూడా అత

ర్నాదిలి వుండటానికి ఆమె యిష్టపడకపోవటంతో,అతడా ప్రయత్నాన్ని వాయిదావేసి తెల్లవారగానే పోలీసులకి ఫోన్ చేసి వచ్చాడు.

ఎసైస్స వచ్చీరాగానే ప్రశ్నలు మొదలుపెట్టాడు.

"మీ పేరు?"

చెప్పాడు రామారావ్.

"దొంగతనం జరిగినప్పుడు ఎవరున్నారు?"

చెప్పిందామె.

"పోయిన డబ్బూ, నగల వివరాలు చెప్పండి."

చెప్పిందామె. వాటి ఖరీదు దాదాపు 50 వేలు.

"దొంగ లెంతమంది?"

"ఒకడే."

"ఎలా వచ్చేడు?"

"ముందు ద్వారం నుండే."

"తలుపులు తీసి ఉన్నాయా? వేసున్నాయా?"

"బోల్టు వేసే వున్నాయి."

"మరెలా వచ్చాడు?"

"నేను తీసాను."

"ఎందుకు తీసారు? పరాయివాళ్ళు రాత్రి సమయంలో వస్తే అలా తలుపులు తీస్తారా?"

"పరాయివాళ్ళు తలుపు తడితే నా భార్య తియ్యదు సర్. వచ్చినవాడు నా గొంతుతోనే బయటనుంచి సమాధానమిస్తే, ఆ వచ్చిందది నేనే ననుకొని తలుపు తీసింది నా భార్య."

"వ్వాట్ ...." అదిరిపడ్డాడు యసైస్స.

3

సరిగ్గా అలాంటి దొంగతనమే జరిగిన మరో ఇంటి

కెళ్ళి విచారణ చేస్తున్నాడు సిటీలోని మరో ప్రాంతపు యస్సై. ఇంటి యజమానురాలు దొంగ ఇంట్లో ప్రవేశించిన విధం చెప్పగానే యస్సైకి అర్థమైపోయింది దొంగ ఒక్కోచోట ఒకేలాగ గొంతు మార్చి ఇంట్లో ప్రవేశిస్తున్నాడనీ, ఇది కూడా గత 40 రోజుల వ్యవధిలో సిటీలో జరిగిన ఎనిమిది ఒకే రకమైన దొంగతనాల లిస్టులో చేరిపోయిందనీ. ఐనా ఏ మూలో కొంత క్లూ వదలకపోతాడా అనే ఆశతో అడిగాడు.

"అతడి చేతికి గ్లవ్స్ వున్నాయా?"

"ఉన్నాయి" చెప్పిందామె.

ఉస్సురన్నాడు యస్సై. గ్లవ్స్ లేకుంటే దొంగతనం చేసేప్పుడు వేలిముద్రలు పడే అవకాశం వుంది. గ్లవ్స్ వేసుకుంటే ఆ అవకాశం లేదు.

"అతడెలా ఉన్నాడో వర్ణించి చెప్పగలరా?"

"చూట్టానికి సన్నగా వున్నాడు. కళ్ళు మాత్రం కన్పడేలా ముఖానికి గుడ్డ కట్టుకున్నాడు. బట్టలు రెండూ ఒకే రంగువి. ముదురాకుపచ్చ రంగువి వేసుకున్నాడు."

"తలవెంట్రుక లెలా వున్నాయి? రంగు?"

చిరాగ్గా చూసిందామె, దొంగతనానికి తలవెంట్రుకలకి సంబంధమేమిటన్నట్లు.

ఓపిగ్గా తిరిగి అడిగాడు ఎస్సై. దొంగ వయసు తెల్సుకోవాలని అతడి ప్రయత్నం.

"వెంట్రుకలు వత్తుగా వున్నాయి. నల్లగా వున్నాయి."

"మీకు కుక్కలేమైనా వున్నాయా?"

"కొన్ని రోజుల క్రిందటివరకూ ఉండేవి. ఇప్పుడు లేవు."

"అలాగా...." గతంలో జరిగిన దొంగతనాలు ఓ

రెంటిలో ఈ దొంగే ఆ ఇండ్ల అల్షేషియన్ డాగ్స్‌ని విషం కల్పిన ఉండలువేసి చంపేసాడు. ఆ విషయం ఇప్పుడు వీరికి చెప్పి మరింత భయపెట్టడం యిష్టంలేక పైకి లేచి, "వస్తానండి" అని చెప్పి వెనుతిరిగాడు.

"ఎస్సైగారూ! మా డబ్బు మాకు తిరిగి దొరుకుతుందంటారా? ఆ దొంగ దొరుకుతాడంటారా?"

"తప్పకుండా దొరుకుతాడు కొద్దిరోజు లాగండి" చెప్పాడు యస్సై బింకంగా.

4

పరువు పోతుందనే భయంతో పోలీసులు జరిగిన ఎనిమిది దొంగతనాల గురించీ పత్రికలకి పొక్కకుండా దాచగలిగేరు. కానీ తొమ్మిదవ దొంగతనం ఈసారి పోలీస్ కాలనీలో ఓ చివర వున్న ఓ హెడ్ కాన్‌స్టబుల్ ఇంట్లో జరిగింది.

ఐతే దొంగతనం జరిగిన సమయంలో, దొంగచేత బంధింపబడ్డవారిలో ఓ ప్రముఖ పత్రికకు సంబంధించిన విలేఖరి కూడా వున్నాడు. అంతే, ఆ మర్నాడు ఆ పత్రికా సంస్థకు చెందిన తెలుగు, ఇంగ్లీషు ఎడిషన్స్‌లో, మొదటి పేజీలో బాక్స్ కాలంలో అచ్చయ్యిం దీ వార్త.

అది అంతటితో ఆగలేదు. ఉదయం ఆ వార్తను చదివిన వెంటనే మిగిలిన పత్రికలవారంతా నగరపోలీస్ కమిషనర్ కార్యాలయం మీదికి దాడి చేసారు, దొంగతనాలకి సంబంధించిన మిగతా వివరాల కోసం.

ఆ సాయంత్రపు ఎడిషన్స్‌లో ఒకో పత్రికా ఒకో హెడ్డింగ్ "గొంతు - మార్చిన దొంగ," "భర్త కాదు దొంగ" వంటివి పెట్టడమే కాక పోలీసుల అసమర్థతను దుయ్యబట్టారు.

12

మర్నాడు—

కమీషనర్ ఆఫ్ పోలీస్ కార్యాలయంలోని కాన్ఫరెన్స్‌హాల్‌లో నగరంలోని పోలీస్ అధికార్లందరూ హాజరై ఉన్నారు.

అధ్యక్షత వహించిన కమీషనర్ పట్నాయక్ మొదలు పెట్టాడు. "మై డియర్ ఆఫీసర్స్. గత కొన్ని వారాలుగా నగరంలో జరిగిన 9 దొంగతనాలకు కారణమై, నగరంలోనే కాక మొత్తం రాష్ట్రంలోనే కల్లోలానికి కారణమైన దొంగను పట్టే విషయం చర్చించడానికి మన మిక్కడ సమావేశమయ్యాం."

ఆగి, సిగరెట్ తీసి వెలిగించుకొంటూ అనుకున్నాడు ఈ దొంగను వెంటనే పట్టకుంటే తను మరో అప్రముఖ పోస్టుకి బదిలీ అయిపోవటమో లేక శెలవుమీద ఇంటి కెళ్ళిపోవడమో ఖచ్చితంగా జరుగుతుంది. తెల్లవారు ఝామున డి.జి.పి. తనను యింటికి పిలిపించి ప్రత్యేకంగా చివాట్లు పెట్టడమే కాకుండా, తానే ఈ కేసు పరిష్కరించదల్చుకున్నట్లు చెప్పాడు. అది ఈ నగర పోలీస్ కమీషనర్‌గా తనకెంత అవమానం. దొంగతనాలు ఈ నగరంలో మాత్రమే జరిగినట్లు రికార్డు కావటంచేత, ఈ నగర పోలీస్ కమీషనర్‌గా తనకు మాత్రమే బాధ్యత వుందనీ, రెండు రోజుల్లోగా దొంగను పట్టిపేయటం జరుగుతుందని నచ్చజెప్పేటప్పటికి తల ప్రాణం తోకకి వచ్చింది.

ఎర్రగా కందిపోయివున్న కమీషనర్ ముఖం చూసేటప్పటికి హాల్లో వున్న మిగతా అధికార్లందరికీ అర్థమైపోయింది ప్రొద్దుటే ఆయనకు అక్షింతలు పడి వుంటాయని. ఐతే అందుకు వారికి ఆనందంగా లేదు. దొంగను

పట్టుకోలేక పోయినందుకు ఆ అక్షింతలు తమమీదే పడ్డట్టుగా, అవమానంగా ఫీలవుతున్నారు.

"దొంగను మనమంతా సమిష్టిగా ప్లాన్‌చేసి పట్టుకోవాలి. జరిగిన అన్ని దొంగతనాలు దాదాపు ఒకేలా జరిగాయి. ఐనా వాటిలోని ముఖ్యాంశాలను ఒకసారి వినండి" అంటూ అసిస్టెంట్ కమీషనర్ ఆఫ్ పోలీస్ వైపు చూసాడు.

ఎ.సి.పి. లేచి కాగితం చూసి చదవటం ప్రారంభించాడు. వివరాలు చాలా క్లుప్తంగా వున్నాయి.

"దొంగతనం స్వరూపం: గొంతు మార్చి పిలవడం, ప్రవేశించడం, పిస్తోలుతో బెదిరించి, డబ్బూ నగలూ దొంగిలించి, కాళ్ళూ చేతులూ బంధించి పారిపోవటం.

దొంగ వయస్సు సుమారు 25 సంవత్సరాలుండవచ్చుని అంచనా.

గ్లవ్స్ వాడటంచేత వేలిముద్రలు దొరకలేదు.

బూట్స్ ముద్రల వాసన సాయంతో వేటకుక్కలను ప్రయోగించినా ఫలితం కనపడలేదు.

ధనవంతుల ఇండ్లేకాక, మధ్యతరగతివారి ఇండ్లను కూడా దోచుకుంటున్నాడు.

ఇంతవరకూ జరిగిన దొంగతనాల్లో ఎవరూ గాయపడలేదు. కానీ రెండుసార్లు రెండు అల్షేషియన్ డాగ్స్ చనిపోయాయి.

ఇంతవరకూ దొంగిలించిన నగలను ఎక్కడా అమ్మిన విషయం తెలియలేదు" ముగించి కూర్చున్నాడు.

కమీషనర్ గొంతు సర్దుకుని, "జాగ్రత్తగా విన్నారు కదా! ఇప్పుడు మీ అభిప్రాయాలు చెప్పండి. మీకొచ్చే ఆలచనలు, ఐడియాలు ఎలాంటివైనా చెప్పడానికి

సందేహించవద్దు. కమాన్ స్పీకప్" అన్నాడు ఎంకరేజింగ్‌గా.

దాదాపు ఒక నిముషం నిశ్శబ్దంగా గడిచింది.

ఇన్‌స్పెక్టర్ సతీష్ గొంతు సర్దుకున్నాడు సంకోచంగా.

"ఎస్. మై డియర్ సతీష్" చెప్పమన్నట్లు చూసాడు.

"సర్, అండ్ మైడియర్ ఆఫీసర్స్, దొంగ హైద్రాబాద్ ప్రాంతానికే చెందినవాడని నా ఉద్దేశ్యం" ఒక ఐదు సెకన్లు ఆగాడు.

కమీషనర్ క్రాస్ చెయ్యలేదు.

"ఎందుకంటే జరిగిన దొంగతనాలలో రెండు ముస్లింల ఇండ్లలో కూడా జరిగాయి. వాటిలో దొంగ హైద్రాబాద్ యాక్సెంట్‌లో ఉర్దూ కూడా మాట్లాడాడు. కనీసం కొన్ని సంవత్సరాలుగా హైద్రాబాద్‌ల నివసిస్తూంటేనే గానీ అలా మాట్లాడటం రాదుకదా!" అని చాలించాడు.

"గుడ్! సతీష్! నీ లాజిక్ వాస్తవానికి దగ్గరగా వుంది. ఇంకా...." అంటూ కమీషనర్ చూపు తన మీద పడటంతో ఎస్సై షరీఫ్ ఆలోచన నుండి బయటపడి మొదలు పెట్టాడు. "సర్, నా ఆలోచన నిజమైతే రేపు రాత్రికి పదవ దొంగతనం జరగబోతుంది."

"వ్హాట్" కమీషనర్ అదిరిపడ్డాడు. అక్కడున్న మిగిలిన అధికారులు కుతూహలంగా షరీఫ్ వంక చూసారు.

షరీఫ్ వారి వంక చూడటం లేదిప్పుడు. సీట్‌గా ఉన్న టేబుల్ అంచును చూపుడు వ్రేలితో రాస్తూ చెప్పుకుపోతున్నాడు. "ఎస్, మైడియర్ సర్స్, జరిగిన తొమ్మిది దొంగతనాల మధ్యా ఐదు రోజుల గాప్ ఖచ్చితంగా పాటించబడుతుంది. గత, చివరి దొంగతనం జరిగి ఈ రోజుకి నాలుగు రోజులు. అంటే రేపు దొంగతనం

జరగబోతుంది."

అతడి రీజనింగ్‌కి అక్కడి అధికారులందరి ముఖాలు ట్యూబ్‌లైట్లు మాదిరిగా వెలిగిపోయాయి. కమీషనర్ మెచ్చుకోలుగా చూసాడు.

ఆ తరువాత అరనిమిషం గడవకుండానే చటుక్కున స్ట్రయిక్ అయినట్లు ఇద్దరు ఎస్పైలు ఒకేసారి "సర్" అన్నారు.

"ఒన్ బై వన్" అని తన దగ్గరగా వున్న ఎస్పైని చెప్పమన్నట్లుగా తల పంకించాడు కమీషనర్.

"సర్, దొంగ ఇంటి యజమాని గొంతుని అనుకరించి కదా దొంగతనం చేస్తున్నాడు. అంటే మిమిక్రీ ఆర్టిస్టన్నమాట. మన నగరంలో సుమారు 25 సంవత్సరాల వయసున్న మిమిక్రీ ఆర్టిస్టుల నందర్నీ అరెస్టుచేసి ప్రశ్నిస్తే సర్?"

కమీషనర్ సాలోచనగా మిగిలిన అధికారుల వయిపు చూసాడు.

"అదంత ఈజీ టాస్క్ కాదనుకుంటా సర్" అన్నాడు ఎ. సి. పి. క్షణం ఆగి తర్వాత "నగరంలో మిమిక్రీ ఆర్టిస్టులు, ముఖ్యంగా ఆ వయస్సులో వారు ఎందరు, ఎక్కడెక్కడ ఉంటున్నారో వివరాలు సేకరించాలి. వారిలో ప్రముఖులయిన ఆర్టిస్టులతోపాటు యూనివర్శిటీ విద్యార్థులు కూడా ఉండవచ్చు. యూనివర్శిటీ విద్యార్థులను అరెస్టుచేస్తే పరిణామాలు ఊహించలేము. అదీగాక మనం నగరంలోని మిమిక్రీ ఆర్టిస్టులని అనుమానిస్తున్నామని తెల్సిన మరుక్షణంనుండీ ప్రజలు కూడా విపరీతంగా ఉద్రేకపడి, వారిమీద హింసకు పాల్పడవచ్చు.

అంతేగాక మనం ఎంత ప్రయత్నించినా నగరంలోని

చిన్నా చితకా మిమిక్రీ ఆర్టిస్టులందరి అడ్రస్‌లు సంపాదించడం అంత ఈజీకాదు. బయట ప్రదర్శన లివ్వని మిమిక్రీ తెల్సినవారు కూడా వుండవచ్చు. మరో ముఖ్య విషయమేమిటంటే దొంగకు తననొక మిమిక్రీ ఆర్టిస్టుగా మనం ఊహించగలమని తెల్సు. అటువంటప్పుడు అతడింకా మిమిక్రీ ప్రోగ్రాంలు ఇస్తూంటాడంటే, ఒకవేళ ఇంతకు మునుపు ఇచ్చి ఉన్నా ఇప్పుడదే నివాసంలో వుంటున్నాడంటే నాకు నమ్మకం లేదు."

"ఒకవేళ అతడు ఒకానొకప్పుడు ప్రదర్శనలిచ్చి ఇప్పుడు మానేసి, మకాం మార్చిన వ్యక్తి ఐతే, అతడ్ని మనం పట్టుకోగలమనుకుంటా సర్" ఒక సి. ఐ. అన్నాడు ఉత్సాహంగా.

"ఎలా?"

"సింపుల్. అతడి ఫోటో ఏదో ఒక పాంప్లెట్‌లో ప్రింట్ అయి ఉంటుంది. అది సంపాదించడం పెద్ద కష్టం కాదనుకుంటా సర్" అన్నాడు.

"అఫ్‌కోర్స్. కనీసం ఇందులో మూడు లోపాలున్నాయి. ఒకటి ఇంతా కష్టపడి అతడి ఆచూకీ తెల్సుకొని అతడ్ని పట్టుకొన్న తర్వాత అతడు దొంగ కాదని తేలితే? రెండవది ప్రస్తుతం అతడు మారువేషంలో వుండివుంటే! మూడవది అతి ముఖ్యమైనది" అని కొంచెం ఆగి ఒక గుక్క మంచినీళ్ళు త్రాగి "మన షరీఫ్ చెప్పినట్లు పదవ దొంగతనం రేపు రాత్రికే జరగబోతుంది. అది జరిగే లోపుగా మనం అతడ్ని పట్టుకోగలమా?"

అది అసాధ్యం. ఇంత తక్కువ వ్యవధిలో హైద్రాబాద్ వంటి మహానగరంలో ప్రక్కవాడి గురించి పట్టించుకోకుండా తిరిగే ఈ మనుష్యుల మధ్య అతడి ఆచూకీ

తెల్సుకోవటం దాదాపు అసాధ్యం. ఆ విషయం అక్కడున్న వారందరికీ తెలుసు.

"ఆల్ రైట్, దాన్లోని సాధ్యాసాధ్యాల గురించి తర్వాత ఆలోచిద్దాం" తర్వాత, "నువ్వు" అన్నట్లు ఇందాకటి రెండవ ఎస్సై వయిపు చూసాడు కమీషనర్.

"సర్, నా రీజనింగ్ తప్పు కాకుంటే ఈసారి దొంగతనం నగర పడమటి ప్రాంతంలో జరుగుతుంది సార్" అన్నాడు ఎస్సై రాజు.

"ఈజిట్! ఎలా?" కుతూహలంగా వంగాడు కమీషనర్.

"ఇంతవరకూ జరిగిన తొమ్మిది దొంగతనాల్లో అతడు ఒక సీక్వెన్సియల్ ఆర్డర్ ఫాలో అవుతున్నాడు. అంటే, మొదటి మూడు ఉత్తరంగా, తర్వాత మూడూ తూర్పున, ఆ తర్వాత మూడూ దక్షిణప్రాంతంలోనూ చేశాడు. సో, ఇప్పుడు అతడి దృష్టి పడమటి ప్రాంతంపై పడి ఉంటుంది."

"ఏం. చేసిన ప్రాంతంలోనే మరోసారి ఎందుకని చేయకూడదు?" క్రాస్ చేసాడు కమీషనర్ కుతూహలంగా.

"చేయడు సార్. ఎందుకంటే వెరీ సింపుల్ రీజన్. సాధారణంగా ఎక్కడయినా దొంగతనం జరిగిన తర్వాత ఆ ప్రాంతంలో ప్రజలు అప్రమత్తంగా వుంటారు."

"సర్" పిలిచాడు ఇన్స్పెక్టర్ విక్రమ్. "ఇంతవరకూ మనం ఒక ముఖ్యమయిన పాయింటును అసలు పట్టించుకోలేదు సర్" అన్నాడు.

"షూట్ ఆన్ మై డియర్ బాయ్" అన్నాడు కమీష

నర్ ఉత్సాహంగా. దొంగతనం ఎక్కడ జరిగినప్పటికీ, అతడు అది 'ఎలా' చేయగలిగేడు అన్నది అతి ముఖ్యం.

"కారీ ఆన్" అరిచాడు కమీషనర్ ఉత్సాహంగా.

"ప్రతి దొంగతనానికీ 5 రోజుల గాప్ అతడు తీసుకుంటున్నాడంటే దానర్థం అతడు ఒక ప్రత్యేకమైన ఇంటిలో దొంగతనం చేయటాన్కి ఆ 5 రోజుల్లో ప్రిపేర్ అవుతున్నాడన్నమాట!"

"యూ డామ్, అర్థమయ్యేట్లు చెప్పు" అరిచాడు కమీషనర్. అతడు దాదాపు బరస్టు అయిపోయేట్లున్నాడు.

"అంటే దొంగతనం చేసేది ఒక మిమిక్రీ ఆర్టిస్ట్ అని మనం అనుకుంటే అతడు దొంగతనం చేయబోయే ఇంటి యజమాని గొంతు అనుకరించడాన్కి అతడుపయోగించే మాటలు ప్రాక్టీస్ చేయడాన్కి, ఇంకా ఆ ఇంటికి సంబంధించిన వివరాలు తెల్సుకోడాన్కి ఆ సమయం తీసుకొంటున్నాడన్న మాట!"

"అంటే ఆ ఐదు రోజులూ ఆ ఇంటికి దగ్గరలో ఉండి ప్రతి సాయంత్రం ఆ యజమాని మాటలు వింటున్నాడంటావా?" సాలోచనగా అడిగాడు కమీషనర్.

"సర్టెన్లీ సర్."

"విక్రమ్! వరుసగా ఐదు రోజులు ఒకే సమయంలో, ఒకే ఇంటి దగ్గరగా వుండి, ఆ ఇంటి యజమాని మాటలు వినే అవకాశం ఆ ఇంటికి సంబంధించిన బంధువులకో, స్నేహితులకో తప్ప మరొకరికి లేదు. ఒకవేళ ఒక ఇంట్లో దొంగతనం ఆ ఇంటికి తెల్సినవారివల్లనే జరిగి వుంటే మరి మిగిలిన ఇండ్లలో జరిగిన దొంగతనాల సంగతేమిటి? ఒకే ఇంటికి సంబంధించినవారివల్లనే మిగిలిన ఇండ్లలో దొంగతనాలు జరిగేయంటావా?"

"నో, సర్!"

"కాకపోతే ఎవరు? ఎవరికా అవకాశం వుంది? కమాన్ టెల్ మీ?" కమీషనర్ కండ్లలోకి చూసిన విక్రమ్‌కి, కమీషనర్ తనను కండ్లతోనే గార్డన్ చేసినట్లనిపించింది. ఆ ప్రశ్నకి తనే సమాధానం చెప్పాలి. అవును, ఎవరికి ఆ అవకాశం వుంది? తను అంతవరకూ ఇంకా ఆలోచించలేదు?

చెప్పే అవకాశం అతడికే ఇస్తూ ఓపిగ్గా చూస్తున్నాడు కమీషనర్.

దాదాపు ఒక నిముషం పూర్తవుతుండగా, ఏదో ఫ్లాష్ వెలిగినట్లు వెలిగినట్లయి ఉలిక్కిపడ్డాడు విక్రమ్.

"సర్. అలాంటి అవకాశం వుంటే ఒక్క ముష్టి వాడికే వుంది సార్."

"అంటే దొంగ ముష్టివాడి వేషంలో తిరుగుతున్నాడన్న మాట! గుడ్, కానీ వీధికో ముష్టివాడు చొప్పున వున్న ఈ నగరంలో ఎవర్నని అనుమానించడం?"

"దాన్దేముంది. సర్ ఈసారి నగర పడమటి ప్రాంతంలోనే దొంగతనం జరుగుతుందని వూహిస్తున్నాం కదా. ఇవ్వాళ ఆ ప్రాంతంలో తిరిగే భిక్షగాళ్ళందరినీ అరెస్ట్ చేసి ప్రశ్నిస్తే సరి" ఒక ఎస్సై అన్నాడు.

"నో....నో....అది చాల తప్పు. ఒకవేళ వాళ్ళను అరెస్టు చేస్తుండగా దొంగ చూసినా లేక వాడికి తెల్సినా ఈజీగా తప్పించుకుంటాడు. ఇక మనం భవిష్యత్తులో వాడ్ని పట్టుకోలేం కూడా."

"సర్," సతీష్ అరిచాడు దాదాపు. "నాకో ఐడియా వచ్చింది. అపాయం అస్సల్లేదు."

"షూట్ నవ్."

చెప్పుకుపోతున్నాడు సతీష్.

5

సమయం, సాయంత్రం దాదాపు 7 గంటలవుతూంది.

"అమ్మా, నా దగ్గిర అన్నం వుంది, కొంచెం చారు పొయ్యమ్మా....ఈ పూట గడిచిపోద్ది...."

"ఇంకా చీకటి పడలేదు, అప్పుడే తయారు" విసుక్కుంటూ చారు తెచ్చిందా ఇల్లాలు.

ముష్టివాడు గిన్నెపట్టి, ఆమె పోస్తున్న చారువంక చూడకుండా చూపుల్ని ఇంట్లోకి చొప్పించి ఎంతమంది వున్నారో చక చకా అంచనా వేస్తున్నాడు. ఇద్దరు చిన్న పిల్లలు లోపల కొట్టుకుంటున్నారు.

గిన్నెతో సహా ఇంటి కెదురుగా నున్న చెట్టు కింద కూర్చొని, నెమ్మదిగా భోజనం చేస్తున్నట్లు నటిస్తూ చుట్టూ పరిసరాల్ని గమనిస్తున్నాడు.

ఒక పోలీస్ పెట్రోల్ వాన్ అతడి ప్రక్కనుండి దూసుకుపోయింది.

రోడ్డు మీద అటూ ఇటూ తిరుగుతున్న జనం పల్చబడుతున్నారు.

దాదాపు గంట గడిచింది. ఈ మధ్య దొంగ భయంతో చాలా ఇండ్ల యజమాన్లు ఇంటికి త్వరగా వచ్చి తలుపులు బిగించుకోవటం జరుగుతూండటంతో బయట సాయంత్రం ఎనిమిది తర్వాత పెద్ద ట్రాఫిక్ ఉండటం లేదు.

దాదాపు తొమ్మిది గంటల ప్రాంతంలో తూలుకుంటూ వచ్చాడా ఇంటి యజమాని. తలుపు కొట్టాడు.

"ఎవరూ?" లోపల్నుండి ప్రశ్న.

"నీ మొగుణ్ని."

"అలాగా. మొన్న మధ్యాహ్నం మనింట్లో ఏం జరి

గిందో చెప్పూ?"

"నీ శార్ధం జరిగింది. నేను దొంగలా కనబడుతున్నా నటే? షంపేత్తా!"

చటుక్కున తలుపు తీసిందా ఇల్లాలు. లోపలి కెళ్ళి పోయాడా యజమాని. తల పంకించి నవ్వుకుంటూ అక్క డ్నుంచి లేచి చక చకా వెళ్ళిపోయాడా ముష్టివాడు.

ఆ మర్నాడు—

రాత్రి ఎనిమిది గంటల పదిహేను నిమిషాల సమయం. ఆ ఇంటి తలుపు తట్టాడు ముష్టివాడు కాని దొంగ.

"ఎవరూ?" లోపల్నుంచి ప్రశ్న.

"నీ మొగుణ్ణి" తనలో తను నవ్వుకుంటూ చెప్పాడు.

తలుపు గడియ తీస్తున్న చప్పుడు—

పిస్టల్ కుడి అరచేతితో బిగించి చటుక్కున లోపలికి జొరబడ్డాడతడు.

ఆశ్చర్యం! ఎదురుగా ఎవరూ లేరు.

అంతలో ఫట్....ట్ మని చేతికి ఏదో తగిలి పిస్టల్ ఎగిరిపోయింది.

చటుక్కున కదలబోయేంతలో...."నో మూమెంట్ మై డియర్ దొంగగారూ" పిస్టల్ దొంగ కణతకి తగి లిస్తూ అన్నాడు ఇన్స్పెక్టర్ సతీష్.

* * *

అంతా వివరించిన కమీషనర్ని ఒక విలేఖరి చటు క్కున ప్రశ్నించాడు. "సర్ ఆ ముష్టివాడే దొంగని మీ రెలా భావించారు?"

"ఎందుకంటే ఆ ప్రాంతంలో మరెవ్వరూ ముష్టి

వాళ్ళుండే అవకాశం లేదు గనక.”

“ఎందుకని?”

“ఎందుకనంటే నిన్న ఉదయమే నగర పడమటి ప్రాంత భిక్షగాళ్ళందరికీ పంచభక్ష పరమాన్నంతో భోజనం కొన్నిచోట్ల రెండు పూటలా పెట్టబడుతుందని మెసేజ్ పాస్ చేయించాం. ఆ మెసేజ్ భిక్షగాళ్ళందరి మధ్యా చకచకా పాకిపోయింది. మధ్యాహ్నం పెట్టిన మంచి భోజనం సాయంత్రం కూడా పెట్టబడుతుందని తెలిసేసరికి, ఎవ్వరూ ఆ రోజు అడుక్కోడానికి ఇండ్లకు పోలేదు. మరి మన దొంగగారు నిజమైన భిక్షగాడు కాదు గదా!....అందువల్ల....” అర్థమైందా? అన్నట్లు చూసాడు నగర పోలీస్ కమీషనర్ పట్నాయక్. □

పై చేయి?

అతనికంటె ఘనుడు

వసుంధర

రాత్రి తొమ్మిది గంటల సమయం.

ఇనస్పెక్టరు మోహనరావు గంభీరంగా ఏదో ఫైలు తిరగేస్తున్నాడు. అప్పుడే బల్లమీద ఫోన్ మ్రోగింది.

"హలో!" అన్నాడతడు రిసీవర్ తీసి.

"అరగంట క్రితం ఫోన్ చేశాను. పది నిముషాల్లో

వస్తున్నానన్నారు. మా నాన్నగా రొచ్చారని చెప్పాను కదండీ' అం దతడి భార్య లీల.

"సారీ లీలా! కావాలని ఆలస్యం చేయడం లేదు. చిన్న పనొకటుండిపోయింది. ఇంకో పది నిముషాల్లో నిజంగానే బయల్దేరుతున్నాను...." అన్నాడు మోహనరావు.

"ఇందాకా పది నిముషాలన్నారు. అయినా అరగంట దాకా ఆగి ఫోన్ చేశాను. ఈసారి పదినిముషాల్లోనే మళ్ళీ ఫోన్ చేస్తాను" అంది లీల.

"ఇంక ఫోన్ చేయాల్సిన అవసరముండదు" అన్నాడు మోహనరావు.

"ఏమో-మరి మా నాన్నెప్పు డొచ్చినా మీరింతే! ఆయనేమో నిద్రకాగలేరు-మీరొచ్చేదాకా ఫోంచేయనంటారు" అని ఫోన్ పెట్టేసిందామె.

మోహనరావు ఫోన్ పెట్టేసి మళ్ళీ ఫైల్లోకి చూడసాగాడు.

అతడి క్కావలసిన పాయింటందులో దొరుకుతున్నట్లు లేదు. పేజీలు నెమ్మదిగా తిరగేస్తున్నాడు.

మళ్ళీ బల్లమీద ఫోన్ మ్రోగింది.

మోహనరావు విసుగ్గా ఫైలు టప్పున మూసేశాడు.

ఫోన్ ఇంకా మ్రోగుతూనే ఉంది.

అతడు టైము చూసుకున్నాడు.

భార్య ఫోన్‌చేసి అప్పటికి సరిగ్గా పదినిముషాలయింది.

"ఎక్కడికయినా ప్రయాణాలంటే ఈ పంక్చ్యుయాలిటీ ఉండదు. నాకేమైనా ఇక్కడ కూర్చోడం సరదానా" అని విసుగ్గా అనుకుంటూ ఫోన్ తీశాడతడు.

"హలో—లీలా! ఇప్పుడే వచ్చేస్తున్నాను...."

అన్నాడతడు.

"నా పేరు లీల కాదు" అందవతలి గొంతు.

అది పురుష కంఠం.

"ఎవరు మీరు?" అన్నాడు మోహనరావు. లీల బదులు మామగారే మాట్లాడుతున్నారా అని అతడి కనుమానం కలిగింది కానీ ఆ గొంతు కాస్త కొత్తగా ఉంది.

"ద్వారకా నగర్ - అప్పల నరసయ్య వీధి - ఆకుపచ్చ రంగు డాబాలో ఓ హత్య జరిగింది. అర్జంటుగా బయల్దేరి రండి."

మోహనరావు వులిక్కిపడి "హలో - మీ రెవరు?" అన్నాడు.

అవతల క్లిక్‌మంది.

అప్రయత్నంగా మరో రెండుసార్లు 'హలో హలో' అని ఫోన్ పెట్టేసి "మిస్టర్ కుమార్ - గెట్ రెడీ" అన్నాడు.

సబిన్‌స్పెక్టర్ కుమార్ ఆత్రుతగా అక్కడకు వచ్చి "ఏం జరిగింది సార్?" అనడిగాడు.

"ద్వారకా నగర్‌లో హత్య జరిగిందిట!"

మరికొద్ది క్షణాల్లో పోలీసు జీపు ఇనస్పెక్టర్నీ, సబిన స్పెక్టర్నీ, మరో నలుగురు కానిస్టేబుల్సునీ మోసుకుంటూ ద్వారకానగర్ వైపు పరుగు తీసింది.

జీపిలా కదలగానే అలా వచ్చింది ఫోన్.

హెడ్ కానిస్టేబుల్ కొండల్రావు ఫోన్ తీశాడు.

"మీరెప్పుడూ యింతే! మా నాన్నగారొచ్చారనే కదా కావాలని పోలీస్‌స్టేషన్‌లో కూర్చున్నారు. ఇంకెవరికీ ఉద్యోగాలు లేవా మీ రొక్కరే చేస్తున్నారా...."

ఆ గొంతును కొండల్రావు గుర్తించి "అమ్మా! నేను కొండల్రావుని మాట్లాడుతున్నాను. అయ్యగా

రిప్పుడే ద్వారకా నగర్ వెళ్లారు. ఇంటి కొచ్చేసరికి బాగా ఆలస్యం కావచ్చు" అన్నాడు.

"ద్వారకానగర్ ఎందుకు?"

"హత్య జరిగిందమ్మా ...."

"హత్యా?" ఆ గొంతులో ఆశ్చర్యం, భయం ధ్వనించాయి. తర్వాత క్లిక్‌మన్న చప్పుడు వినపడింది.

"ఈ ప్రపంచంలో పెళ్ళాలందరూ ఒకటే రకం-" అనుకుంటూ ఫోన్ పెట్టేశాడు కొండల్రావు.

2

అది ఆకుపచ్చరంగు డాబా.

డాబా ముందు పోలీసు జీపాగింది.

అప్పటికే వీధి నిర్మానుష్యంగా ఉంది.

ఇనస్పెక్టర్ మోహనరావు, సబినస్పెక్టర్ కుమార్, నలుగురు కానిస్టేబుల్సు ఇంట్లో ప్రవేశించారు.

తలుపులు దగ్గిరగా వేసివున్నాయి.

తీయగానే పెద్దహాలు.

హాల్లో సోఫాలు. మధ్యగా ఖరీదయిన కార్పెట్.

కార్పెట్ మీద వెల్లకిలా పడివుంది శవం. గుండెల్లో పిడివరకూ కత్తి దిగి ఉంది.

హాల్లో దీపం వెలుగుతోంది.

కానిస్టేబుల్సు చకచకా ఇల్లంతా తిరిగారు.

ఇంట్లో ఎవ్వరూ లేరు.

మోహనరావు, కుమార్ - శవాన్ని సమీపించారు.

అతడు నడివయసు వ్యక్తి. పాంటు, బుష్‌షర్టు వేసుకుని ఉన్నాడు. బహుశా ఆ యింటి యజమాని అయుండవచ్చును.

ఇంట్లో జనాలేమైపోయారు?

చుట్టు ప్రక్కల కూడా పెద్దగా జన సంచార మేమీ లేదు.

మోహనరావు కానిస్టేబుల్సుతో - "పక్కిళ్ళలో ఎవ రయినా మెలకువగా ఉంటే చూసి పిల్చుకుని రండి" అన్నాడు. తర్వాత అతడు ఫోన్ దగ్గిరకు వెళ్ళి ఫోన్ తీయబోయి ఆగిపోయాడు.

హంతకుడు హత్యానంతరం ఆ ఫోన్ వాడి వుండ వచ్చు. దానిపై వేలిముద్రలు తనకు చాలా విలువైనవి.

అతడు కుమార్ వంక తిరిగి "హత్య నిజమే కదా! మన కిప్పుడు ఫోటోగ్రాఫర్, వేలిముద్రల నిపుణుడు, డాక్టరు కావాలి. దగ్గిరలో ఏదయినా ఫోనుందేమో...." అన్నాడు.

"వీధి చివర ఓ హోటలుంది సార్. అక్కణ్నించి ఫోన్ చేసి వస్తాను" అన్నాడు కుమార్.

"గుడ్" అన్నాడు మోహనరావు.

కుమార్ వెళ్ళిపోయాడు.

మోహనరావు అక్కడే వుండి పరిసరాలను శ్రద్ధగా గమనిస్తున్నాడు. హంతకుడికి సంబంధించిన ఇతర వస్తువులేమైనా దొరుకుతాయేమోనని అతడి ఆశ.

శ్రద్ధగా చూడగా అతడికి సోఫా కింద ఓ సిగర్ లైటర్ కనబడింది. జాగ్రత్తగా రుమాలుతో తీశాడు దాన్ని.

టీపాయ్‌లో కాల్చిన సిగరెట్ వుంది. సగం కూడా పూర్తిగా కాలలేదది. చూడగానే బ్రాండ్ తెలుసుకోవచ్చు. ట్రిబుల్ ఫైవ్!

మోహనరావింకా శోధిస్తూండగా కానిస్టేబుల్స్ నలు గుర్ని వెంటబెట్టుకుని వచ్చారు. వచ్చినవాళ్ళలో చిరాకు,

భయం వున్నాయి.

వాళ్ళు ఆ యింటికి ఇరుగు పొరుగులు. అంతా మగాళ్ళు! ఓ ముసలాయన, ఇద్దరు నడివయస్కులు, ఓ యువకుడు.

మోహనరావు వాళ్ళని ప్రశ్నలు వేశాడు.

చనిపోయిన వ్యక్తిని వారు గుర్తు పట్టారు.

అతడి పేరు రంగరాజు. స్టాక్ ఎక్స్చేంజిలో బాగా డబ్బు సంపాదించాడు. అట్టే కష్టపడేరకం కాదు. కానీ ఎవరితోనూ గొడవ తెచ్చుకోడు.

అతడి భార్య, ముసలి తల్లి, ముగ్గురు పిల్లలు ఉన్నారు. పిల్లలు ముగ్గురూ చదువుకుంటున్నారు. ఒక్కరు కూడా ఇంట్లో లేరిప్పుడు.

అంతా పెళ్ళికి వెళ్ళారు. రంగరాజెందుకు వెళ్ళలేదో ఎవరికీ తెలియదు.

ఆ యింట్లో హత్య జరిగినట్లు చుట్టుపక్కల వాళ్ళకు తెలియదు.

సాధారణంగా ఎనిమిది దాటేసరికి ఆ వీధి నిర్మానుష్య మైపోతుంది.

టీవీ లొచ్చాక రాత్రిళ్ళు జనాలు వీధుల్లో మసలడం మానేస్తున్నారు. పూర్వం పదకొండుదాకా మనుషులు మసిలేవారు. ఇప్పుడెనిమిదయ్యేసరి కెవరూ ఉండడం లేదు.

రంగరాజింట్లో కెవరయినా వెళ్ళడం చూడడంగానీ - ఆ యింట్లోంచి కేకలు వినడంకానీ - ఎవరూ చేయలేదు. చూసినవాళ్ళెవరూ ఉండరని కూడా వచ్చినవాళ్ళన్నారు.

మోహనరావుకు వాళ్ళనుంచి పెద్దగా సమాచారం లభించలేదు. అతడు వారిని పంపించేశాడు.

ఈలోగా కుమార్ ఫోన్ చేసి వచ్చాడు. ఇద్దరూ హత్య గురించి చర్చించారు.

"మనకు ఫోన్ చేసిందెవరో తెలిస్తే బాగుండేది?" అన్నాడు కుమార్.

"అవును-నిజమే!" అన్నాడు మోహనరావు.

ఫోన్ చేసిన దెవరు?

హంతకుడా....హంతకుడే అయితే ఆ యింట్లో ఫోనే అయుండాలి.

కానీ ఫోన్ చేసి హత్య గురించి చెప్పాల్సిన అవసరం హంతకుడికేముంటుంది? హత్య గురించి ఎంత లేటుగా లీకయితే అతడి కంత మంచిది.

మరెవరో అయితే అతడికి హత్య గురించి ఎలా తెలిసింది?

బహుశా రంగరాజింటి కేదో పనిమీద వచ్చి శవాన్ని చూసి వుంటాడు. అతడు రంగరాజు శ్రేయోభిలాషే అయుంటాడు. కానీ పోలీసులతో వ్యవహారమని భయపడి అజ్ఞాతంగా వుండి ఫోన్ చేశాడు.

అతడా వీధిలోనివాడే అయినా ఆశ్చర్యం లేదు.

అయితే ఫోన్ ఎక్కణ్ణించి చేశాడు?

మోహనరావు తనకీ విషయం ముందే స్ఫురించలేదని తన్ను తాను నిందించుకున్నాడు. ఇందాకా వచ్చినవాళ్ళని ఈ వీధిలో ఫోన్ లెవరెవరికి వున్నాయని అడిగి తెలుసుకో వలసింది.

కాసేపట్లో డాక్టరు, ఫోటోగ్రాఫరు, వేలిముద్రల నిపుణుడు వచ్చారు.

పరీక్షలు ప్రారంభమయ్యాయి.

"హత్య బహుశా తొమ్మిది తర్వాతనే జరిగివుంటుంది"

అన్నాడు డాక్టరు.

మోహనరావు వులిక్కిపడ్డాడు.

అంటే తనకు ఫోన్ చేసినవాడు-హత్య చేసినవాడో, చూసినవాడో అయుండాలి. హత్యకీ ఫోన్‌కీ ఎంతో వ్యవధి లేదు.

"కత్తి పిడిమీదా, ఫోన్ మీదా వేలిముద్రలు స్పష్టంగా ఉన్నాయి...." అన్నాడు వేలిముద్రల నిపుణుడు.

మోహనరావు ఆశలన్నీ ఆ వేలిముద్రల మీదనే వున్నాయి.

3

హత్య తొమ్మిదికీ-తొమ్మిదిం పావుకీ మధ్య జరిగిందని నిర్ధారించాడు డాక్టరు. హతుడికి పెనుగులాడే అవకాశ మాత్రం రాలేదు. మాటల్లో మభ్యపెట్టి హఠాత్తుగా పొడిచేసి వుండాలి హంతకుడు. ఎక్కడా శవాన్నీడ్చిన లక్షణాలు లేవు.

అంటే యిద్దరూ కార్పెట్ మీద కూర్చుని కబుర్లు చెప్పుకుని వుండాలి. కత్తిపోటు తినగానే హతుడు వెనక్కి పడిపోయుంటాడు. ప్రాణం వెంటనే పోయింది.

డాక్టరు చెప్పింది విని - హంతకుడు హతుడికి బాగా దగ్గర బంధువో, స్నేహితుడో అయుండాలని మోహన రావు అనుకున్నాడు.

కానీ వేలిముద్రలతడికి తెలిసిన వారెవ్వరితోనూ సరి పడలేదు.

టెలిగ్రాం మీద రంగరాజు భార్యాబిడ్డలు రప్పించ బడ్డారు.

వాళ్ళు ముందు ఏడ్చారు. తర్వాత దహనసంస్కా రాలు జరిపించారు శవానికి.

కాస్త స్థిమితపడినాక మోహనరావు వారిని తన ప్రశ్నలతో ఎదుర్కొన్నాడు.

భార్యా బిడ్డలు, ముసలితల్లి-ఏక కంఠంతో రంగరాజు అజాతశత్రువనీ, అపర ధర్మరాజనీ పొగిడారు.

"రంగరాజుగారు హత్య చేయబడ్డారు కాబట్టి ఆయనకు కనీసం ఒక శత్రువున్నాడు. వాడెవరో తెలుసుకునేందుకు మీరు నాకు సాయపడాలి" అన్నాడు మోహనరావు.

అప్పుడు రంగరాజు పెద్దకొడుకు కాసేపాలోచించి "రెండు వారాల క్రితం నాన్నగారో మనిషితో తగవు పడ్డారు" అన్నాడు.

"ఎవరు వాడు?" అన్నాడు మోహనరావాత్రుతగా.

"అతడి పేరు జ్వాలానాధ్" అన్నాడు రంగరాజు పెద్ద కొడుకు.

జ్వాలానాధ్ పేరు విని ఉలిక్కిపడ్డాడు మోహనరావు.

అతడొక అంతర్జాతీయ స్మగ్లరు. ఆ విషయం తెలిసినా అతడిని పట్టుకునేందుకాధారాలు దొరకటం లేదు పోలీసులకు.

జ్వాలానాధ్ స్నేహితుల్లో మంత్రులు, పోలీసాఫీసర్లు కూడా ఉన్నారు.

ఈ మధ్యనే అతడు పట్టుబడ్డాడు.

"మీనాన్నకూ అతడికీ ఏమిటి సంబంధం?"

"ఏమో—అతడు మా యింటికొచ్చాడు. షేర్ల విషయంలో నాన్న తనను మోసం చేశారని అతడంటాడు. అంతు చూస్తానని కూడా బెదిరించాడు. నాన్న చలించకుండా - నా అంతెలా చూడాలో జైలు కటకటాలు లెక్క పెట్టుకుంటూ ఆలోచిద్దువుగానిలే - అన్నారు...."

మోహనరావతడు చెప్పిన వివరాలన్నీ శ్రద్ధగా నోట్

చేసుకున్నాడు.

అప్పటికే జ్వాలానాధ్ పట్టుబడ్డాడు. బెయిల్‌కోసం చూస్తున్నాడు. తాత్కాలికంగా అతణ్ణి వదిలిపెట్టారు. రెండు రోజుల్లో జైల్లో కెళ్ళడం అతడికి తప్పనిసరి. ఆ పరిస్థితుల్లోనే అతడు, రంగరాజు గొడవపడ్డారు.

ఏ ఆధారమూ లేక నిరుత్సాహంగా ఉన్న మోహనరావుకిది ఆశాకిరణంలా తోచింది. అతడు వెంటనే తన దగ్గరున్న వేలిముద్రలను జ్వాలానాధ్ వేలిముద్రలతో సరిపోల్చాడు.

జ్వాలానాధ్ వేలిముద్రలు - ఇంచుమించు అన్ని పోలీస్ స్టేషన్స్‌లోనూ ఉంటాయి.

కేసు ఇట్టే తేలిపోయింది.

వేలిముద్రలు సరిపోయాయి.

మోహనరావు వెంటనే జ్వాలానాధ్ ఆచూకీ తీశాడు.

జ్వాలానాధ్ ప్రస్తుతం జైల్లో ఉన్నాడు.

మోహనరావు జైలుకు వెళ్ళాడ ర్జెంటుగా.

జైలు సూపరింటెండెంట్ సోమేశ్వర్‌ని కలుసుకున్నాడు.

"జ్వాలానాధ్‌తో మీకేమిటి పని?" అన్నాడు సోమేశ్వర్.

"అతడు హత్యచేశాడు...." అన్నాడు మోహనరావు.

"జైల్లోనే ఉన్నాడుగా - అతణ్ణి కలుసుకుందు కింత అర్జెన్సీ ఏముంది?" అన్నాడు సోమేశ్వర్.

"ఆ కేసు పరిశోధిస్తున్న ఇన్‌స్పెక్టరుగా నేనతణ్ణి ప్రశ్నించాల్సి ఉంది - " అన్నాడు మోహనరావు.

"అయితే మీరు కాసేపు వేచి ఉండాలి" అన్నాడు సోమేశ్వర్.

"ఎందుకు?"

"ప్రస్తుతం అతడితో అతడి భార్య మాట్లాడుతోంది."

"నేను వెళ్ళేక ఆమె మళ్ళీ మాట్లాడవచ్చు...."

"నేరస్థులూ మనుషులే - మనం వాళ్ళపట్ల అమానుషంగా ప్రవర్తించకూడదు"

"ఇందులో అమానుషమేముంది?"

సోమేశ్వర్ నవ్వి - "భార్యాభర్తలిద్దరూ ఏకాంతంలో ఉండగా డిస్టర్బ్ చేయడం అమానుషంకదూ...." అన్నాడు.

మోహనరావుకేమీ అర్థంకాలేదు. అతడక్కడ జ్వాలానాథ్‌ను కలుసుకునేందుకు గంటకుపైగా వెయిట్ చేశాడు. ఆ తర్వాత ఒక సెంట్రీ అతడిదగ్గరకువచ్చి - "మీరు జ్వాలానాథ్ గారిని కలుసుకోవచ్చు సార్!" అన్నాడు.

మోహనరావు బయల్దేరగానే అతడికొక యువతి ఎదురయింది.

సన్నగా పొడుగ్గా నాజూగ్గా ఉన్న ఆ యువతి నలిగిన మల్లెలా వాడినా గుబాళిస్తూనే ఉంది. ఆమె జ్వాలానాథ్ భార్య అయుండవచ్చునని అతడనుకున్నాడు.

సెంట్రీ అతడినొక గదిలోనికి తీసుకుని వెళ్లాడు.

అది జైలులా లేదు.

విశాలంగా ఉన్న ఆ గదిలో టెలివిజను, స్టీరియో సిస్టంతోపాటు ఓ కుషన్ బెడ్ కూడా ఉంది. విజిటర్సుకోసం సోఫా సెట్టుంది.

ఎదురెదురు సోఫాల్లో జ్వాలానాథ్, మోహనరావు కూర్చున్నారు.

మోహనరావు జ్వాలానాథ్ వంక ఆశ్చర్యంగా చూశాడు.

అతడు జైల్లో నేరస్థుడిలా లేడు.

మన దేశాన్ని చూడ్డానికొచ్చిన విదేశీ అతిథిలాగున్నాడు.

ఎండ కన్నెరుగని వాడిలా మిసమిసలాడి పోతున్నాడు.

మనిషి అందంగా ఉన్నాడు.

గదిలో గుప్పుమనే విదేశీ సుగంధం....

"ఇనస్పెక్టర్లంటే నాకు గౌరవం. లేకపోతే నా భార్యను కలుసుకున్నాక - కాసేపు విశ్రాంతి తీసుకుంటే తప్ప వేరెవర్నీ కలుసుకోను నేను...." అన్నాడు జ్వాలానాథ్.

కాసేపు మోహనరావు అతడు నేరస్థుడన్న విషయం కూడా మరిచిపోయి అతడు చెప్పింది వినయంగా విన్నాడు.

జ్వాలానాథ్ తనకు చక్కని సదుపాయాలు చేసిన జైలు అధికారుల్నీ - ఇలాంటి జైళ్ళేర్పాటుచేసిన ప్రభుత్వాన్నీ మెచ్చుకుని- "అయినా మనదేశం బాగుపడడం లేదంటే లోపం ప్రభుత్వానిదికాదు - ప్రజలది - ఏమంటారు?" అన్నాడు.

"అవునవును." అన్నాడు మోహనరావు వినయంగా.

"ఇంతకీ మీరెందుకువచ్చారు? అసలువిషయం అడక్కుండా అంతా నా గురించే చెప్పుకు పోతున్నాను-" అన్నాడు జ్వాలానాథ్ నొచ్చుకొంటున్నట్లు....

అప్పుడు మోహనరావుకు గుర్తొచ్చింది తనొచ్చినపని.

జ్వాలానాథ్ నేరస్థుడేకాదు - హంతకుడు!

అయితే వెంటనే ఆ విషయం చెప్పడానికతడికి మొహమాటం వేసింది.

తటపటాయిస్తూనే నెమ్మదిగా విషయం చెప్పాడు.

"ఏమిటీ - రంగరాజు చచ్చిపోయాడా? థాంక్యూ - వెరీమచ్ - చెయ్యిలాపారేయండి...." అన్నాడు జ్వాలానాథ్.

అప్రయత్నంగా అతడితో కరచాలనం చేశాడు మోహన రావు. అతడి చేయి చల్లగా ఉంది.

"కోల్డ్‌బ్లడెడ్ ఫెలో !" అనుకుంటూ - "మాకు లభించిన ఆధారాలన్నీ మీకు వ్యతిరేకంగా ఉన్నాయి-" అన్నాడు మోహనరావు.

"ఏమిటవి?" అన్నాడు జ్వాలానాథ్.

మోహనరావు సిగర్‌లైటర్ కూడా తెచ్చాడు.

చూస్తూనే - "ఇది నాదే!" అన్నాడు జ్వాలానాథ్. తానెక్కువగా ట్రిబుల్ ఫైవ్ కాలుస్తానని కూడా అతడంగీక రించాడు - "అసలు మీకూ ఆఫర్ చేసేవాణ్ణి. నా భార్యకు సిగరెట్ వాసనపడదు. ఆమె నన్ను కలుసుకుందుకు వచ్చే రోజున నేను సిగరెట్ తాగకూడదని నియమం. ఆమె నియమానికి నేనూ కట్టుబడ్డాను. ఎంతవారలైనా కాంతా దాసులేకదా-" అన్నాడతడు నవ్వుతూ.

"నేను సిగరెట్లు తాగన్లెండి"-అని- "లభించిన ఆధారా లనుబట్టి హత్య మీరు చేశారని నిర్ధారించడం తప్పనిసరి-" అన్నాడు మోహనరావు సంజాయిషీ యిచ్చుకుంటున్నట్లు.

"రంగరాజు నన్ను బాగా మోసం చేశాడు. అతడు చచ్చినందుకు నాకు చాలా సంతోషంగా ఉంది. అయితే నేనతణ్ణి చంపలేదు...." అన్నాడు జ్వాలానాథ్.

మోహనరావు మరోసారతడికి వేలిముద్రల గురించీ లైటరు గురించీ చెప్పి "హత్యకు మోటివ్ ఉంది. హత్య చేసినట్లు తిరుగులేని సాక్ష్యాలున్నాయి. హంతకుడు మీరు కాదని ఋజువు చేసుకొనడం చాలా కష్టం...." అన్నాడు.

"ఇదంతా రామిరెడ్డి చేయించుంటాడు...." అన్నాడు జ్వాలానాథ్.

అప్పుడు మోహనరావు రామిరెడ్డి గురించి తెలుసు

కున్నాడు.

రామిరెడ్డి జ్వాలానాధ్ కలిసి వ్యాపారంచేశారు. ఏడాది క్రితం ఏవో గొడవలొచ్చి విడిపోయారు. విడిపోయాక రామిరెడ్డి వ్యాపారం డౌనయింది. జ్వాలానాధ్, మంచి రైజులో ఉన్నాడు. రామిరెడ్డి జ్వాలానాధ్‌తో కలవాలని ప్రయత్నించాడు. జ్వాలానాధ్ ఒప్పుకోలేదు. రామిరెడ్డి అతడిమీద పగబట్టాడు.

"నిన్ను పైకి రానివ్వను. జైలుపాలు చేస్తాను. హత్య కేసుల్లో ఇరికిస్తాను-" అని రామిరెడ్డి జ్వాలానాధ్‌తో అన్నాడు.

"కత్తిపిడిమీద నా వేలిముద్ర యున్నంతమాత్రాన నేను హంతకుణ్ణి కాను. అలాగే ఫోన్ విషయమూను...." అన్నాడు జ్వాలానాధ్, మోహనరావుతో.

"అలాగని కోర్టును నమ్మించడం కష్టం...."

"ఎందుకు నమ్మించలేరు? ఒకే మనిషి ఒకే సమయంలో రెండు ప్రదేశాల్లో ఉండలేడుగా...." అన్నాడు జ్వాలానాధ్.

మోహనరావుకు అతడేం చెబుతున్నదీ అర్థముంది - "మీరు ఎలిబీ గురించి మాట్లాడుతున్నా రనుకుంటాను. వేలిముద్రల సాక్ష్యం ముందు ఏ ఎలిబీ అయినా పని చేయదు...."

"ఈ ఎలిబీ నేను సృష్టించుకున్నదికాదు. భగవద్దత్తంగా నాకు వచ్చినది. అప్పుడు....అనగా హత్య జరిగిందని మీరంటున్న సమయానికి....రెండురోజుల ముందునించీ నేను జైల్లో ఉన్నాను...." అన్నాడు జ్వాలానాధ్.

మోహనరావు తెల్లబోయాడు.

"నా మాట విని మీరు రామిరెడ్డి గురించి ఆలో

చించండి. అతడు సన్నీ హత్యలో ఎలా ఇరికించినదీ తెలుసుకోండి...." అన్నాడు జ్వాలానాధ్.

మోహనరావక్కణ్ణించి లేచాడు. సూపరింటెండెంట్ వద్దకు వెళ్ళాడు. ఆయన కూడా మోహనరావు చెప్పింది విన్నాక - "అరే-హత్యాసమయం గురించి మీరు నాకు ముందే చెప్పివుంటే - అప్పుడే చెప్పి ఉండేవాణ్ణి. జ్వాలానాధ్ ఈ హత్య చేయడం అసంభవం. మా జైలు కున్న సెక్యూరిటీ పటిష్టమైనది-" అన్నాడు.

మోహనరావు ఉసూరుమంటూ లేచాడక్కణ్ణించి.

సింపుల్‌గా తేలిపోయిందనుకున్న కేసు కాంప్లికేటెడ్ అయింది.

4

మోహనరావు వెంటనే రామిరెడ్డిని గురించి ఆచూకీ తీయలేదు.

ముందుగా రంగరాజు కుటుంబంతో రామిరెడ్డికున్న సంబంధాల గురించి తెలుసుకున్నాడు.

రంగరాజుదీ, రామిరెడ్డిదీ మంచి స్నేహం.

హత్యకు పదిరోజులముందు రామిరెడ్డి రంగరాజుకు వెండితో చేసిన శ్రీరామచంద్రుడి విగ్రహాన్ని బహూకరించాడు.

మోహనరావెన్ని ప్రశ్నలు వేసినా ఇద్దరికీ విరోధాన్ని సూచించే వివరాలేమీ బయటపడలేదు.

ఈలోగా ఒకరోజున ఓ యువకుడు మోహనరావును కలుసుకుని- "అయ్యా! తమరే నన్ను రక్షించాలి" - అన్నాడు.

"ఏమయింది?" అన్నాడు మోహనరావు.

"రామిరెడ్డి నన్ను హంతకుణ్ణి చేయాలని చూస్తున్నాడు...."

"హత్యచేసిన వాడే హంతకుడౌతాడు. ఎవరూ ఒకరు చేస్తే హంతకులుకారు-" అన్నాడు మోహనరావు గంభీరంగా.

"అతడిపద్ద నా వేలి ముద్రలున్న కత్తిఉంది-" అన్నాడా యువకుడు.

మోహనరా వులిక్కిపడి వివరాలడిగాడు.

ఆ యువకుడి పేరు సురేష్. అతడు పనిగురించి వెతుకుతూ రామిరెడ్డిపద్దకు వెళ్ళాడు. రామిరెడ్డి అతణ్ణి స్మగ్లింగులోకి దింపాలని చూశాడు. సురేష్ అంగీకరించలేదు. రామిరెడ్డి - అతడికి తెలియకుండానే అతడిచేత కొంత స్మగ్లింగుపని చేయించాడు. నాలుగురోజుల క్రితం దాకా తను గౌరవంగా బ్రతుకుతున్నానని సురేష్ అనుకున్నాడు. రామిరెడ్డి తన నెలా ఉపయోగించుకుంటున్నదీ తెలియగానే సురేష్ తిరగబడి అతడి రహస్యాలన్నీ బట్టబయలు చేస్తానన్నాడు.

రామిరెడ్డి మండిపడి- "నన్నొదిలి వెళ్ళావో - నా జోలికి వచ్చావో హంతకుడివై ఉరికంబాని కెక్కుతావు-" అన్నాడు.

సరిగ్గా అంతకు నాలుగు రోజులకుముందే రామిరెడ్డి యింట్లో ఓ కత్తికి పదును పెట్టడానికి సురేష్ సహాయం తీసుకున్నాడు.

"ఆ కత్తిమీద నీ వేలిముద్రలున్నాయి. దాంతో హత్య జరుగుతుంది...." అని రామిరెడ్డి అతడిని బెదిరించాడు.

ముందు సురేష్ భయపడలేదు. కానీ ఇటీవల రంగ

రాజు హత్య గురించిన వివరాలు చదవగానే భయంతో అతడికి కాళ్ళూ చేతులూ ఆడలేదు.

సురేష్ చెప్పిన వివరాలన్నీ శ్రద్ధగా నోట్ చేసుకున్నాడు మోహనరావు.

"హత్య ఎవరిదైనా ఉండవచ్చు...."

"ఏం చెప్పను సార్? నేను కాస్త దుడుకుమనిషిని. కోపంవస్తే చంపేస్తానంటాను. కానీ కోపంలో కూడా ఎవరినీ చెంపదెబ్బ కూడా కొట్టలేదు. నా దంతా ఉత్త మాటల వ్యవహారం....అలా మా వీధిలోనే ఒకరిద్దరితో గొడవపడ్డాను...." అన్నాడు సురేష్.

అతడింకా మాట్లాడుతూండగానే - బల్లమీద ఫోన్ మ్రోగింది.

ఫోన్ తీశాడు మోహనరావు.

"హలో - ఇనస్పెక్టర్ మోహనరావుగారా?"

"అవును...."

"సీతంపేట - రామాయమ్మ వీధిలో శివుడి గుడి పక్కయింట్లో ఇప్పుడే హత్య జరిగింది...." అందో గొంతు.

"హలో - ఎవరు మీరు?"

అవతల క్లిక్ మంది.

మోహనరావు హలో హలో అంటూ కేకలు పెట్టాడు. తర్వాత ఫోన్ రిసీవరు మీదుంచి నిట్టూర్చాడు.

"ఏమయింది సార్?"

మోహనరావు జరిగింది చెప్పాడు.

సురేష్ గుండెలు బాదుకుంటూ "అయ్యబాబోయ్ -

అంటే పరమశివాన్ని చంపేశాడన్న మాట రామిరెడ్డి. ఓ అరగంట క్రితమే నేనాయనింట్లోంచి ఫోన్ కూడా చేశాను. రెండ్రోజుల క్రితం ఏదో కోపంలో ఆయన్ని చంపుతానని అన్నాను. క్షమార్పణ చెప్పుకుందుకు వాళ్ళింటికి వెళ్లాను" అన్నాడు.

మోహనరావు తెల్లబోయినా ముందుగా సురేష్ వేలి ముద్రలు తీసుకున్నాడు.

తర్వాత సీతంపేట వెళ్ళాడు.

హత్య జరిగిన ఇంటిచుట్టూ బాగా జనం మూగి వున్నారు.

ఇంట్లోంచి పెద్దగా కేక వినపడిందిట. ఇరుగు పొరుగులు వచ్చేసరికి పరమశివం చచ్చిపడి వున్నాడు.

ఇంట్లో పరమశివం ఒక్కడే వున్నాడు.

హంతకుడు హత్యచేసి దొడ్డిదారిన పారిపోయాడు.

హత్య రంగరాజు విషయంలో లాగే జరిగింది.

శవం వెల్లకిలా పడివుంది. గుండెల్లో పిడిదాకా కత్తి దిగి వుంది.

మోహనరావు తన మామూలు పరిశోధన పూర్తి గావించాడు.

వివరాలన్నీ తెలిశాక అతడికి మతి లేదు.

రామిరెడ్డికీ, పరమశివానికీ ఏ విధమైన గొడవలూ లేవు. ఇద్దరూ మంచి స్నేహితులు. పరమశివానికి రామిరెడ్డి హత్యకు ముందు వెండితో చేసిన శ్రీరాముడి విగ్రహాన్ని బహూకరించాడు కూడా.

జ్వాలానాథ్‌కీ పరమశివానికీ చాలా గొడవలున్నాయి. అతడు పరమశివాన్ని చంపుతానని అన్నాడు. తన అను

చరుడు సురేష్‌ద్వారా ఆ పని చేయించగలనని అతడు జైల్లో వుండగానే హెచ్చరించినట్లాధారాలున్నాయి.

కత్తి పిడిమీద, పరమశివం ఇంటి ఫోన్‌మీద - సురేష్ వేలిముద్రలున్నాయి. అయితే హత్య జరిగిన సమయంలో సురేష్ మోహనరావుతో మాట్లాడుతున్నాడు.

సురేష్ నిర్దోషి అనడానికదే తిరుగులేని సాక్ష్యం!

మోహనరావుకు రామిరెడ్డిని కలుసుకోవడం తప్పనిసరి అయింది.

రామిరెడ్డి అంతా విని "నాకేమీ తెలియదు" అన్నాడు.

"సురేష్ మాటలు నమ్మడానికి నా కాధారాలున్నాయి" అన్నాడు మోహనరావు.

రామిరెడ్డి ఇనస్పెక్టరుకు రెండు చేతులూ జోడించి - "అయ్యా! పరమశివం నాకు మంచి స్నేహితుడు. అతణ్ణి చంపుకోవడంవల్ల నాకు కలిగిన నష్టమింతా అంతాకాదు. సురేష్ మీకు చెప్పినదంతా అబద్ధం. అతడు నా వద్ద పని చేసినట్లు మీకు ఋజువుండదు. ఈ కేసు విషయం మరిచి పోవడం మీకు మంచిది...." అన్నాడు.

మోహనరావు తనపట్టు విడవలేదు.

చివరికి రామిరెడ్డి - "జ్వాలానాథ్‌ని నేను సామాన్యుడిగా భావించాను. వ్యాపారంలో లాభాలు పెంచుకోవచ్చునని ఆశించానుగానీ - అతడి అవినీతి దేశపు ఎల్లలు దాటిపోతోందని గ్రహించి విడిపోయాను. అప్పటికీ అతడి గొప్పతనాన్ని తెలుసుకోకపోవడం నేను చేసిన తప్పు. మిత్రుడిగా కాక శత్రువుగా అతడితో విడిపోయాను. అనుభవిస్తున్నాను...." అన్నాడు.

"ఏమిటి మీ అనుభవం?" అన్నాడు మోహనరావు.

"అతితక్కువ వ్యవధిలో ఇద్దరు మంచి మిత్రులను కోల్పోయాను. జ్వాలానాథ్ నా మీద తన పగ ఇలా తీర్చుకుంటున్నాడు...." అన్నాడు రామిరెడ్డి.

"అయితే ఈ హత్యలు జ్వాలానాథ్ చేయించాడంటారు...."

"చేయించలేదు....చేశాడు...."

"మీరు తెలివిలో ఉండే మాట్లాడుతున్నారా?" అన్నాడు మోహనరావు.

రామిరెడ్డి నవ్వి - "ఊఁ" అన్నాడు.

"మీ మాటలకు ఆధారం?"

"రెండు హత్యలూ జరగేక అతడు నన్ను హెచ్చరించి కూడా వెళ్ళాడు...."

"వ్హాట్!" అని - "అయితే మీరు వెంటనే పోలీసుల కెందుకు చెప్పలేదు-?" అన్నాడు మోహనరావు.

"అతడి హెచ్చరిక వింటున్నప్పుడు నా పక్కన అటూ యిటూ అతడి మనుషులున్నారు...." అన్నాడు రామిరెడ్డి.

"ఏమని హెచ్చరించాడతడు?"

"రామిరెడ్డీ - నా గురించి నీకు తెలిసిన రహస్యాలు బయటపెట్టి నన్ను శాశ్వతంగా జైల్లో ఉంచాలనుకుంటున్నావు. జైలంటే నా కతిథిగృహం. అక్కడ నేను నా స్నేహితులను కలుసుకోగలను. భార్యతో వినోదించగలను. అన్ని సదుపాయలూ పొందగలను. అన్నింటికీ మించి అనుమతి తీసుకుని బయటకు వచ్చి - ఓ హత్య చేసి వెళ్ళగలను. నేను జైల్లో ఉండడం నీకు మరింత ప్రమాదకరం. నిన్ను హెచ్చరించడానికే రంగరాజుని చంపాను.

రెండో హత్య నిన్ను హెచ్చరించడానికి మాత్రమే కాదు - నే నమాయకుణ్ణని మోహనరావును నమ్మించ డానికి, నమ్మినా నమ్మకపోయినా రంగరాజు హత్యకేసు ఫైలు నాకు అనుకూలంగా మూసివేయడానికి రెండో హత్య అతడికి సహకరిస్తుంది....మూడో హత్యకు నువ్వు నన్ను పురిగొల్పవనే నా విశ్వాసం - అని హెచ్చరించాడు...." అన్నాడు రామిరెడ్డి.

మోహనరావు తెల్లబోయాడు.

ఇది నిజమా? నిజంగా ఇలా జరుగుతుందా?

గజిబిజిగా ఉన్న మనసుతో అతడిల్లు చేరాడు.

ఇంట్లో భార్య ఆసక్తికరంగా పేపరు చదువుతోంది.

"ఏమిటి లీలా! నువ్వంత శ్రద్ధగా పేపరు చదువుతున్నావు?" అన్నాడతడు.

తను చదువుతున్న వార్తనామె అతడికి చూపించింది.

ఛార్లెస్ శోభరాజ్ - ఢిల్లీ తిహార్ జైల్నించి తప్పించుకుని పారిపోయాడు.

ఆ వివరాలు చదువుతూంటే మోహనరావుకి మతి పోయినట్లయింది.

జ్వాలానాథ్ కూడా శోభరాజ్‌వంటి వాడేనా?

అతడి సందేహాలకు బదులు రాలేదు. ఎందుకంటే జ్వాలానాథ్ శోభరాజ్‌లా జైల్నించి పారిపోలేదు.

అతడిమీద సరైన నేరం ఒక్కటీ ఋజువుకాక మరో మూడు మాసాల్లో జైల్నించి విడుదలయ్యాడు. జైల్లో ఉండగానే అతడు తన శత్రువులందరిమీదా పగ తీర్చుకున్నాడు.

జ్వాలానాథ్ శోభరాజ్ కంటె గొప్పవాడు. □

పాఠకుల ప్రశ్నలకు

టెంపోరావ్ జవాబులు

[ప్రఖ్యాత డిటెక్టివ్ రచయిత, ఆంధ్ర డిటెక్టివ్ సాహిత్య పితామహులు కీ. శే. టెంపోరావ్ గారు పరమపదించి జులై 24 వ తేదీకి ఏడాది పూర్తవుతున్నది. ఆయన ప్రథమ వర్ధంతి సందర్భంగా, 21 యేళ్ళ క్రితం 'అపన' లో పాఠకుల ప్రశ్నలకు ఆయన ఇచ్చిన జవాబులను యధాతథంగా ప్రచురిస్తున్నాము—సం.]

కొత్త నాగేశ్వరరావు, వేజెండ్ల

మీరు సమాధానము ఇవ్వలేని ప్రశ్న ఏది?

మీరు అడగలేని ప్రశ్నేమో!

బస్వా చిట్టిబాబు, ముక్కొల్లు

టెంపోరావ్‌గారూ, ఈనాడు వెలువడుతున్న డిటెక్టివ్ సాహిత్యాన్ని కొందరు - చౌకబారు సాహిత్యమని విమర్శిస్తున్నారు. మరి అయితే డిటెక్టివ్ నవలలు మాత్రమే ఎక్కువగా ప్రజాభిమానాన్ని చూరగొంటున్నాయి ఎందు చేతనంటారు-? అని అడిగితే-నూనె సరుకు బాగా అమ్ముడుపోతుందని ఆరోగ్యమంటామా? అలాగే ఇదీనూ అంటున్నారు. ఈ విమర్శలకు తగిన సమాధానం మీ రివ్వగలరనుకొంటాను?

ఇటువైన విమర్శకుల మాటలను వినడం మానేయండి. ప్రజలు చదివి ఆనందంతో ఆదరించేదే సాహిత్యము. ప్రజలకు దూరమైన సాహిత్యం ఎందుకూ పనికిరాదు.

సి. రమాదేవి, కాకినాడ

మీనుంచి ఎన్నో ప్రశ్నలు అడిగి తెలుసుకోవాలని వుంది. ఈ ఒక్క ప్రశ్నకు జవాబియ్యండి. అన్నయ్యా! మనిషి విలువ ఎంత?

ఆకాశమంత విశాలమైనది. ఆలిచిప్పంత చిన్నది. విలువ కట్టేవారిమీద ఆధారపడి వుంటుంది.

కుమారి సుజాత & భారతి, నల్లగొండ

రావుగారూ! హత్య జరిగిందంటే తప్పకుండా ఆ కేసు కోర్టుకు వెళ్ళాల్సి వుంటుంది గదా, మరి మన డిటెక్టివ్ కథలలో చాలావరకు ఈ కేసులు కోర్టుకు పోనీయకుండ డిటెక్టివ్‌లతోనే పరిసమాప్తి చేస్తూంటారు మన రచయితలు. ఇదెక్కడి న్యాయమండీ?

దోషి దొరికేవరకూ సస్పెన్స్‌తో కథ సాగుతుంది. దోషి దొరికేక కేసు కోర్టుకి తప్పకుండా వెళ్తుంది. కోర్టు విచారణ ముక్కుసూటిగా సాగిపోతూ వుంటుంది. అదంతా చిత్రించి పాఠకులకు విసుగు కలిగించడం ఇష్టంలేక రచయితలు మానేస్తున్నారనుకుంటాను.

హెచ్. కృష్ణమూర్తి, సికింద్రాబాద్

మన దేశము - రష్యా, అమెరికా దేశాలతో సమానంగా నిలబడాలంటే కనీసము ఎన్ని పంచవర్ష ప్రణాళికలు అవసరము? అసలు మన దేశము ఏ నాటికైనా వాటితో సమానంగా నిలబడగలదని నమ్మకము వుందా? మన దేశంలో వున్న నిజమైన లోపాలేమిటి?

రష్యా అమెరికా దేశాలతో సమానంగా నిలబడాలంటే కావలసినవి పంచవర్ష ప్రణాళికలు కావు. శక్తిసామర్థ్యాలు,

ఆశయాలు, ఉన్నతాదర్శాలు ప్రజల్లో శాశ్వతంగా ఏర్పడాలి. ప్రతి భారత పౌరుడూ - దీక్షపూనితే ఈ లోకంలోని దేశాలన్నిటినీ అధిగమించే అంతర్గతా శక్తులు మనవాళ్ళల్లో వున్నాయి. మనదేశంలో ఏ లోపమూ లేదు. మనుష్యులలో లోపాలు వుండొచ్చు.

బొర్రా పాండురంగశాస్త్రి, ఏలూరు

డిటెక్టివ్ సాహిత్యము చదుటకు ప్రతివారూ ఎంతో ఆసక్తి చూపుతారు. ఈ సాహిత్యం నిత్యజీవితంలో ఎంత వరకు ఉపయోగపడుతుంది? దాన్ని గూర్చి మీరు పరిశోధన జరిపినారా?

సాంఘిక నవలా సాహిత్యం యెంత వుపయోగిస్తుందో డిటెక్టివ్‌నవలా సాహిత్యం అంతకంటె ఎక్కువ ఉపయోగిస్తుంది. ఈనాటి ప్రపంచంలో మానవుడిని అనేక సమస్యలు ఎదుర్కొంటున్నాయి. ప్రతి మనిషీ తప్పనిసరిగా డిటెక్టివ్ కావలసి వస్తోంది. కొన్ని ఉదాహరణలు ఇస్తున్నాను. వాటిని గురించి జాగ్రత్తగా ఆలోచించండి.

పంచదార దొరకని రోజుల్లో - అదెక్కడ రహస్యంగా దొరుకుతుందో మనం పరిశోధించి కనుక్కుంటూ ఉండాలి.

నిరుద్యోగులు 24 గంటలూ ఎక్కడ ఖాళీలు ఉన్నాయా అని పరిశోధన సాగిస్తూ ఉంటారు.

ఆడపిల్లల తండ్రి పెళ్ళికొడుకు కోసం డిటెక్టివ్‌లా అనేకచోట్ల అన్వేషిస్తూ ఉంటాడు.

ఇంట్లో కూర్చొని-కిలో ఉప్పు పనిమనిషిచేత కొని తెప్పించుకున్న ముసలమ్మ, తన అనుభవంతో పరిశోధన సాగించి పనిమనిషి తెచ్చిన ఉప్పు తక్కువుందని క్షణంలో గుర్తిస్తుంది.

ఐస్‌క్రీమ్ కొనుక్కోడానికి డబ్బులేదని నాన్న అంటే ఎనిమిదేళ్ళ కొడుకు తండ్రి కోటు జేబులు వెతికి విజయవంతంగా రూపాయి కాసుని గాలిలో పైకి ఎగరవేస్తాడు. డిటెక్టివ్ కాని మనిషి ఎవరేనా ఉన్నారేమో - ఇటుపైన మీరే పరిశోధించండి.

కాకర్ల మాధవరావు, ప్రకాశరావుపాలెం

అపరాధ పరిశోధన నవల - మానవుల మన స్తత్వాలను తరచి చూస్తుంది. అయినా కొందరు దానిని సాహిత్యంగా పరిగణించరు. వారి ఉద్దేశమేమిటి?

అన్ని విధములైన రచనలకూ సాహిత్యంలో స్థానం వుంది. డిటెక్టివ్ నవలలు సాహిత్యం కాదనేవారిని గురించి మనం అంతగా పట్టించుకోనక్కర్లేదు. నిజం చెప్పాలంటే - మంచితరహా డిటెక్టివ్ నవలలు, కథలు రాయడం చాల కష్టం. రచయితకు సస్పెన్స్ టెక్నిక్ తెలియాలి. కథలోని సన్నివేశాలు గబగబా సాగిపోవాలి. సాంఘిక నవలలు రాసే రచయితలకు ఈ బాధలుండవు. సస్పెన్స్ అనవసరం. ముక్కు సూటిగా కథ చెప్పుకు పోవచ్చు. సాంఘిక నవలలు బాగా రాయగలిగినవాళ్ళు యెందరో వున్నారు. కాని అద్భుతమైన డిటెక్టివ్ నవలలు రాయగలిగిన వాళ్ళను వేళ్ళమీద లెక్కపెట్టవచ్చు.

రమ, మచిలీపట్నం

స్త్రీ పుట్టినప్పటినుంచీ వుండే బొట్టూ, పువ్వులూ, కాటుక భర్త చనిపోగానే విసర్జించడంలో అంతగా న్యాయం కనిపించడంలేదు. పెళ్ళి అయిన తరువాత వచ్చిన నల్లపూసలూ, మంగళసూత్రం తీసేయడంలో న్యాయముంది.

మీరేమంటారు?

మీరు చెప్పినది అక్షరాలా నిజం. పెళ్ళికి ముందునుంచీ వున్న బొట్టు, కాటుక, పువ్వులు, గాజులు భర్త పోయేక స్త్రీ వదిలేయవలసిన అవసరం నాకేమీ కనపడ్డంలేదు. స్త్రీని అందవిహీనంగా రూపొందించాలని ఈ సంప్రదాయం వుద్దేశమేమో.

వి. అరుణ, మద్రాసు

మనదేశంలోవుండే తెలివైన యువకులు పైచదువుల నెపంతో అమెరికాలాంటి విదేశాలకు వెళ్తున్నారు. అక్కడి అలవాట్లకి, అంతస్థులకి బానిసలయి ఇండియా వస్తే అవి తమకు లభిస్తాయాలేదో అనే భయంతో తిరిగి రావడానికి వెనుకంజ వేస్తున్నారు. మనదేశంలో మేధా సంపత్తి అంతా అలా పై దేశాలకిపోతే, మనదేశం గతేమిటి?

దీన్నిగురించి తీవ్రంగా ఆలోచించవలసిన అవసరం ప్రభుత్వానికి ఎంతైనావుంది. ఏ దేశంలోని తెలివైనవారైనాసరే అమెరికావెళ్తే ఆ దేశం వాళ్ళని ఎంతో ఆదరించి, అక్కడే ఉద్యోగాలిచ్చి ఉంచేస్తోంది. మన ప్రభుత్వం మేల్కోవాలి. ప్రస్తుతం విదేశాలలో వుండే భారతీయ యువకులకు స్వదేశానికి రావాలని వుంటుంది. కాని ఈ దేశంలో మంచి వుద్యోగాలు, అవకాశాలు దొరకవనే అనుమానంతో, వాళ్లు విదేశాల్లోనే వుండిపోతున్నారు. వారికి అనుగుణమైన వుద్యోగాలిచ్చి వాళ్ళను మనదేశానికి రప్పిస్తే, వాళ్ళు ఎన్నో విధాల మన దేశాభివృద్ధికి తోడ్పడతారు.

ఎమ్. ప్రసాదరావు, ఖమ్మం

నేరస్తునికి శిక్ష విధించడంలో ఉద్దేశమేమిటి?

శిక్ష మూలంగా పరివర్తన చెందుతాడని కొందరి నమ్మకం!

జాస్తి శివప్రసాద్, కాకినాడ-3

మానవులందరూ భగవంతుడిచేతిలో కీలుబొమ్మలయి నపుడు ఒకడు పాపి. మరొకడు పుణ్యాత్ముడు అనే గుణ నిర్ణయం ఎందుకు చేయాలి?

గుణ నిర్ణయం చేసేది దైవంకాదు - మానవులు!

కె. అంబదాస్, హైదరాబాదు

పరమపావనులైన గాంధిజీ, నెహ్రూజీ శాంతి, ధర్మ న్యాయసూత్రాలను, నేటి మంత్రులు ఎంతవరకూ ఆచ రిస్తున్నారండీ?

మన మంత్రుల ఉపన్యాసాలలో, రోజూ ఆ సూత్రాలే అనర్గళంగా బయటకు దొర్లుతూవుంటాయి!

మల్లిడి సత్యనారాయణరెడ్డి, కాంతేరు

నేటి క్లిష్టపరిస్థితులలో డిటెక్టివ్ నవలా రచయితగా మీ కర్తవ్యం ఏమిటి?

యుద్ధ బాక్‌గ్రవుండ్‌లో మన జవాన్ల దేశభక్తిని ధైర్య సాహసాలను చిత్రించే కథలను రాయడం!

మారంరెడ్డి రామిరెడ్డి, ఇనుమడుగు

డిటెక్టివ్ సాహిత్యము విజ్ఞానాన్ని పెంచడానికా, వినోదాన్ని కలిగించడానికా?

వినోదాన్ని ఇస్తూ-విజ్ఞానాన్ని కూడా చేకూర్చడానికి.

డా॥ పాండు రంగశాస్త్రి, ఏలూరు

టెంపోరావ్ అను పేరు మీకు సార్థకమయిందనుటకు మీ రచనలే ప్రత్యక్ష నిదర్శనములు. మీ రచనలు మాకు ఆసక్తిని కల్గించి ఆనందం ఇస్తున్నాయి. అట్టిశక్తి మీ స్వయంకృషి ఫలితమా లేక భగవంతుని ప్రసాదమా? మీ అసలు పేరేమిటి? దయతో వివరాలు చెప్పండి?

నా రచనలు మీకు ఆనందాన్ని ఇస్తున్నందుకు నాకెంతో ఆనందంగా ఉంది. నాలో ఏదేనా రచనా శక్తి ఉంటే అదంతా భగవంతుని ప్రభావమే. ప్రస్తుతం నా అసలు పేరు టెంపో రావ్. చాలా ఏళ్ళ క్రితం మరోపేరుండేది. ఆ పేరు నేనే మరచిపోయాను.

సి. బి. రావు, హైదరాబాదు

అపరాధ పరిశోధక నవలా, రచనా రీతి తెలుగుభాషలో నూతన సాహిత్య మనవచ్చునా?

ఈ నాడు వెలువడే హేతువాదంతో కూడిన డిటెక్టివ్ నవలలు తెలుగు సాహిత్యానికి-చెప్పలేనంత సేవచేశాయి. పది ఏళ్ళ క్రితం పుస్తకాలు ఎక్కువగా అమ్ముడయ్యేవి కాదు. కొందరు ప్రముఖ డిటెక్టివ్ రచయితలు రాసిన నవలల మూలంగా చదవాలనే ఆసక్తి ప్రజల్లో దృఢంగా యేర్పడింది. ఈ డిటెక్టివ్ నవలల మూలంగా పాఠకులు ఎక్కువయ్యారు. అది సేవని ఒప్పుకోక తప్పదు. అందు వలన ఇది నూతన సాహిత్యమే.

ఎమ్. రంగదొరై మద్రాసు

పెర్ఫెక్టుగా హత్యచెయ్యడం అసాధ్యమంటారు. అది

సాధ్యమని డిటెక్టివ్ వాలి, డిటెక్టివ్ అశ్వద్ధామ హత్య చేసి నిరూపించగలరా?

పెర్ఫెక్టుగా హత్య చెయ్యడం సాధ్యం కాదని నేనూ ఒప్పుకుంటున్నాను. హంతకుడు ఎంత జాగ్రత్తపడినా ఏదో క్లూ డిటెక్టివ్‌లకు చిక్కుతూ వుంటుంది. హంతకులకు సింహస్వప్నాలయిన డిటెక్టివ్ వాలి, డిటెక్టివ్ అశ్వద్ధామలు మీకోసం నిజాన్ని నిరూపించడానికి హత్యలు చేయడం లోకం సహించదేమో!

కె. అరవింద్‌కుమార్ మద్రాసు

ప్రస్తుతం పాకిస్తాన్‌తో జరుగుతూన్న యుద్ధంలో పదేళ్ళలోపు పిల్లలు చెయ్యగలిగిన సేవ ఏమిటి?

పెద్దవాళ్ళ పనులకు అడ్డుపడకుండా ఆడుకుంటూ వుండడం.

ఎ. నారాయణరావు, ఆదోని

టెంపోరావ్‌గారూ, మీ నవలల్లో అశ్వద్ధామ, పరశురామ్ పరిశోధనలకంటె, డిటెక్టివ్ వాలి పరిశోధనలు అద్భుతంగా వుంటాయి. అది మీ రచనామహిమా లేక వాలిగారి మహిమా?

ఇది ఎవరి మహిమో కనుక్కోడానికి డిటెక్టివ్ వాలి పరిశోధన సాగిస్తూనే వున్నాడు!

వి. శివరామయ్య, మన్నేటికోట

తెలుగు సాహిత్యంలో డిటెక్టివ్ రచనలకు స్థానం లేదని చెప్పిన ఆరుద్రగారు 'డిటెక్టివ్' మాస పత్రికలో ఒక ప్రత్యేక సీరియల్ వ్రాస్తున్నారు. అంటే వారి మన

స్తత్వం మారిందా?

ఆరుద్రగారు అలా ఎప్పుడన్నారో నాకు తెలీదు. ఈ నాటి డిటెక్టివ్ సాహిత్యం ప్రాముఖ్యంలోకి రావడంలో ఆయన రచనలు ఎంతో తోడ్పడ్డాయి. ప్రప్రథమంగా హేతువాదంతో చక్కటి డిటెక్టివ్ నవల "పలకల వెండి గ్లాసు" ఆయనే రాశారు. ఆయన సృష్టించిన ఇన్‌స్పెక్టరు వేణుని పాఠకులు మరచిపోలేరు.

పేరి రామలక్ష్మి, ఖర్గపూర్

సామాజిక జీవితానికి అపరాధపరిశోధన వృత్తి ఎంత వరకు ఉపయోగిస్తుంది? ఇది వృత్తిగా వుంచుకుని బ్రతక గలమా?

నిత్యజీవితంలో ప్రయివేట్ డిటెక్టివ్‌లుగా పనిచేసే వారు మన దేశంలో ఇప్పుడిప్పుడే వస్తున్నారు. విదేశాలలో అనేకమంది ప్రయివేట్ డిటెక్టివ్‌లు వున్నారు. ఆ వృత్తి మూలంగానే వారు జీవిస్తున్నారు.

న్యాయపతి వి. యస్. యన్. మూర్తి, బరంపురం

టెంపోరావ్‌గారూ, ఏ డిటెక్టివ్ అయినా, ఏ పరిస్థితుల్లోనైనా హంతకుడుగా మారే అవకాశం వుందా?

డిటెక్టివ్ హంతకుడుగా మారవలసిన అవసరం లేదు. అనుక్షణం డిటెక్టివ్ అసత్యాలనూ, అబద్ధాలనూ, నేరస్థులనూ, అవినీతినీ హతమారుస్తూనే వుంటాడు. దాని దృష్ట్యా డిటెక్టివ్ కూడా ఒక విధంగా హంతకుడే!

సి. హెచ్. మన్మోహన్‌దాస్, మచిలీపట్నం

నేటి సాహిత్యంలో డిటెక్టివ్ రచనలకు బాగా ప్రాధాన్యత ఏర్పడింది. అయినా కొందరు సాహిత్యవేత్తలు,

డిటెక్టివ్ నవలలను—చదవకూడదని అంటున్నారు. శరత్ రచనలు, టాగూర్ రచనలు చదవాలంటున్నారు. మీరేమంటారు?

ఒకవైపున డిటెక్టివ్ నవలలు—మరోవైపున శరత్ టాగూర్‌ల నవలలు చదవమని నా సలహా. డిటెక్టివ్ సాహిత్యం మూలంగా ఏ నష్టం రాదని నేను హామీ ఇవ్వగలను. శరత్ టాగూర్‌ల రచనలు చదివితే ఎంతవరకు లాభిస్తుందో నేను చెప్పలేను.

వి. సుజాత, మద్రాసు

మీ కొత్త నవల "మాయమైన మగువలు" చదివాను. అశ్వద్ధామ, సురేఖలు అంత ప్రేమించుకుంటారు కదా. వారిద్దరికీ ఎందుకు పెళ్ళికాలేదు?

పురోహితుడు దొరక్క అయివుండదు. 24 గంటలూ ప్రేమలో మునిగి తేలుతున్న అశ్వద్ధామ—సురేఖలకు పెళ్ళాడడానికి టైము చిక్కడంలేదేమో!

వి. పద్మ మద్రాసు

టెంపోరావ్‌గారూ, మనిషి పుట్టిన తరువాత మారనిది ఏది?

పుట్టినరోజు తేదీ.

యస్. ఎ. సత్తార్, ఏలూరు

ప్రతి డిటెక్టివ్ పుస్తకము మొదటి పేజీలో—ఈ నవలలోని సంఘటనలు కేవలం కల్పితాలు. ఎవర్నీ వుద్దేశించి రాసినవి కావు. ఏ వ్యక్తికీ సంబంధించినవి కావు— అని వ్రాస్తారు? ఎందుకు?

సాధారణంగా రచయితలు కొన్ని జరిగిన సంఘటన

లను ఆధారంగా పెట్టుకొని ఊహాగానంతో కొంత అల్లి రచనలు చేస్తూవుంటారు. అందువలన ఏ వ్యక్తినించీ డామేజస్ ప్రమాదం లేకుండా ఉండేందుకు పై వాక్యాలు రాస్తూవుంటారు.

ఇ. సీతారామశాస్త్రి హిందూపూరు

మన సైనికుల మూలంగా దేశానికి రక్షణ చేకూరు తోంది. ఈ మిస్టరీ. సైంటిఫిక్ రచయితల నుంచి దేశా నికి లభించే దేమిటి?

శత్రువులనుంచి రక్షించుకునే కొత్త మార్గాలు ఈ రచయితలు చూపించవచ్చు.

ఎన్. బాలామణి, శ్రీకాకుళం

నవీన సాహిత్య వీధుల్లో నేడు పురుషులతోపాటు మహిళలు కూడా రచయిత్రులయి తారల్లా ప్రకాశిస్తు న్నారు. మీరేమంటారు?

మంచిదంటాను. మన దేశం ముందుకు వెళ్తోంది.

పి. లక్ష్మీనారాయణ, దోర్నకల్

నేటి చిత్రాల్లో శృంగార రసాన్ని ధారాళంగా నిర్మా తలు ఇస్తున్నారు. ఎందువలన?

శృంగార సన్నివేశాలు—ప్రేక్షకులను గుంపులుగా థియేటర్లకు రప్పిస్తాయని నిర్మాతల నమ్మకం.

జి. రాజకుమార్, దోర్నకల్

బ్రిటన్, అమెరికా దేశాలు అయూబ్‌ఖాన్ని ఖండించ డానికి బదులు సమర్థించుటకు కారణం?

బ్రిటన్, అమెరికాలకు పాకిస్తానంటే ఇష్టం. పాకి

స్తాను వాళ్ళు చెప్పినట్లు తై తక్కలాడుతుంది. ఇండియా వాళ్ళకు తలొంచదు. అందువలన ఎలాగైనా పాకిస్తాన్ని నిలబెట్టాలని వాళ్ళ ఆత్రుత.

జి. శ్రీనివాసరావు, దోర్నకల్

నాకు నవలంటే మహా సరద. ముఖ్యంగా మీవి, కొమ్మూరివారి రచనలంటే మహా ఇష్టం. నా కూ్కడా నవలలు రాయాలని వుంది. ఎలా రాయాల నేర్పుతారా?

పత్రికలు, నవలలు బాగా చదవండి. రాయడం ప్రారంభించండి. చిన్న కథలు రాసి పత్రికలకు పంపుతూ వుండండి. మొదట్లో కథలు ప్రచురణ కాకిపోతే నిరుత్సాహపడకండి. మీలో ఏమాత్రం రచనాశక్తి వున్నా తప్పక జయిస్తారు.

సున్నా అచ్యుతరావు, ఏలూరు

నేటి ఆధునిక ఆంధ్ర సాహిత్యం కొత్త పుంతల్ని తొక్కుతూ, వసంతరంగుల్ని సంతరించుకుంటూ ఉరక లేస్తూ పరుగులు తీస్తోంది. కొందరా అభివృద్ధిని మెచ్చు కోరు సరిగదా నొచ్చుకుంటారెందుకో?

సాహిత్య విప్లవాలను ఎదిరించేవాళ్ళు చరిత్రలో తర తరాలనుంచీ వుంటూనే వున్నారు. వారెంత నొచ్చుకున్నా ఎదిరించినా సాహిత్యం నూతన పంథాల్లో సాగుతూనే వుంటుంది.

ఎన్. హేమగిరిబాబు, తిరుపతి

కన్నతల్లికి, అగ్నిసాక్షిగా పెళ్ళాడిన భార్యకూ గల తేడా యేమిటి?

తల్లి బిడ్డను యే పరిస్థితుల్లోనూ వదలదు; భార్య వదల గలదు.

కె. ఎమ్. నందాని, రాజమండ్రి

నిరపరాధికి శిక్ష విధించినప్పుడు ప్రాసిక్యూటర్ని శిక్షించే విధానం ఏదైనా అమలులో వుందా?

నిరపరాధని తెలిశాక, అంటే అసలు అపరాధి దొరి కాక, నిరపరాధిని వదిలేస్తారు. ప్రాసిక్యూటర్‌కి, తీర్పు ఇచ్చిన జడ్జికి శిక్షవిధించడం అమలులో లేదనుకుంటాను.

బస్వా అప్పారావు, ముక్కొల్లు

ప్రముఖనటుడు. మీ స్నేహితుడు అయిన జగ్గయ్య గారిమీద మీ అభిప్రాయం ఏమిటి? జగ్గయ్యగారు ఒక్క డిటెక్టివ్ నవలమాత్రం రాసి విరమించే రెందువలన?

ఆత్మతృప్తి కోసం. గొప్పనటుడు, కథకుడు-కవి. ఉత్సాహంతో రాశారు ఒక్క నవల. నవలలు రాయడం ఆయన వృత్తి కాదు.

ఎన్. రవీంద్రరెడ్డి, కంచుపాడ్

మీ మొట్టమొదటి నవల ఏది?

ఆంగ్లంలో "None shall Live". తెలుగులో "విందుకు వెళ్ళిన విమల."

పి. శాంత, విజయవాడ

మిమ్మల్ని అందరూ డిటెక్టివ్ రచయిత అంటారు. మీ "నాలో ఏముంది?" నాలుగుసార్లు చదివిన నేను మీరొక గొప్ప సాంఘిక నవలా రచయిత అంటాను. ఏమంటారు?

ఎవరు ఏమన్నా, ఏలా పిల్చినా పల్కుతాను. ఒకే రూపం అనేకమందికి పలువిధాల గోచరిస్తుంది.

ఆర్. ఆర్. ఎల్. స్వామి, వడ్డాది

1. ఇంతవరకూ వెలువడిన మీ డిటెక్టివ్ నవలా సాహిత్యం రచనలలో మీకు పూర్తిగా సంతృప్తినిచ్చిన నవల ఏది? ఎప్పుడు వెలువడింది?

2. మీ అభిమాన డిటెక్టివ్ నవలా రచయితలు ఎవరు?

1. నేనింతవరకూ రాసిన నవలలన్నీ నాకెంతో తృప్తి నిచ్చాయి. ప్రత్యేకంగా ఏ ఒక నవలనూ గురించి నేను చెప్పలేను.

2. అగాథా క్రిస్టి, ఎర్ల్‌స్టేన్లీ గార్డెనర్, జార్జిహార్మన్ కాక్స్. పీటర్‌షినీ. ఎడ్గార్‌వాలస్, ఎల్లరీక్వీన్, కార్టర్ బ్రౌన్, జేమ్స్‌హాడ్లీచేస్, జాన్‌డిక్సనీకార్. మికిస్టిలేన్, కానన్‌డయిల్, బ్రెట్‌హాలీడే, రెక్స్‌స్టౌట్ ఇంకా వున్నారు మరికొందరు.

డి. రామక్రిష్ణరావు, సీతానగరం

మొదటి అపరాధ పరిశోధన నవల తెలుగులో ఎప్పుడు ఎవరిచే రాయబడిందో తెల్పుతారా?

"సమగ్ర ఆంధ్ర సాహిత్యం" శ్రీ ఆరుద్ర రాస్తు న్నారు. అందులో ఎక్కడో మీ ప్రశ్నకు జవాబుంటుం దని నా నమ్మకం.

ఎస్. జి. హరిశ్చంద్రరావు, నైహాటీ

మీరు రాసే నవలల్లో ఊహాగానం ఎక్కువా? లేక వ్యక్తుల జీవిత విషయాలను సేకరించి రాస్తారా?

నిరాడంబరంగా సాగిపోయే వాస్తవిక జీవితాన్ని

యధాతథంగా చిత్రిస్తే హృదయంగమంగా వుండక పోవచ్చు. కళ్ళతో చూసే సంఘటనలను ఇమాజినేషన్‌తో కలిపితే పాఠకులను కవ్వించి, చలింపజేస్తాయి.

జి. జి. ఎల్. రెడ్డి, వెల్దుర్తి

మీ నవలలంటే నాకు మక్కువ ఎక్కువ. ముఖాముఖి మిమ్మల్ని నేను చూడలేదు. మీ నవలల్లోని డిటెక్టివ్‌ల గుణ గణాలనుబట్టి మీరు ఎటువంటి వారో మేము ఊహించుకోడం సమంజసంగా వుంటుందా?

సరదాకి అలా వూహించుకోవచ్చు. కాని రచయిత వ్యక్తిత్వం సంపూర్ణంగా ఏ పాత్రలోనూ వుండక పోవచ్చు.

పి. శాంత, విజయవాడ

మీరు బ్రహ్మచారిగా ఎందుకుండిపోయారు?

ఏ యువతీ నన్ను పెళ్ళిపీటలవరకూ వెళ్ళేంత ఆకర్షించలేక పోయిందనుకుంటాను! □

అల్లరికొండ!



వి.యస్. రావ్

ఖేడ్డా

రొటేంటింగ్ కుర్చీలో వెనక్కివాలి, కాళ్ళని టేబుల్‌మీద వుంచుకుని ఆలోచిస్తూ కళ్ళు మూసుకున్నాడు డిటెక్టివ్ టెంపో. అతని పెదవుల మధ్య ఇరుక్కున్న సిగరెట్ నుంచీ పొగ తీగలా సాగుతోంది. తలుపు తట్టిన చప్పుడు. కళ్ళుతెరిచి, కాళ్ళుదించి సిగరెట్‌ని వేళ్ళతో పట్టుకుని

తలుపువైపు ప్రశ్నార్థకంగా చూశాడు.

"కమిన్!" అన్నాడు టెంపో.

మధ్యవయసులో వున్న బట్టతల వ్యక్తి గదిలో ప్రత్యక్ష మయ్యాడు. ఖరీదైన సఫారీ సూట్‌లో హుందాగా వున్నా డతను. గోల్డ్‌రిమ్డ్ అద్దాలగుండా చూస్తూ అడుగులేశా డతను.

"నమస్తే. మిస్టర్ టెంపో. అయామ్ తిరపతిరావ్, ఇన్‌కమ్‌టాక్స్ ఆఫీసరుగా పనిచేస్తున్నా" అంటూ టేబుల్ ముందు ఆగాడతను.

"కూచోండి" టెంపో అతన్ని పరీక్షగా చూస్తూ అన్నాడు. తిరపతిరావు కుర్చీలో కూలబడ్డాడు. జేబు రుమాలుతీసి బట్టతలమీద బొబ్బల్లా వున్న చెమట బిందు వుల్ని అద్దుకున్నాడు.

"మీ డిపార్ట్‌మెంట్‌కి నేనెప్పుడూ టోపీ వేయలేదు!" టెంపో నవ్వుతూ అన్నాడు. తిరపతిరావు చిన్నగా నవ్వాడు.

"వ్యక్తిగతమైన పనిమీద వచ్చాను!" అన్నాడతను.

"చెప్పండి!"

తిరపతిరావు ఒకసారి బరువుగా నిట్టూర్చి ప్రారంభిం చాడు. "ఆర్నెల్లక్రితం నా కూతురు రాధికకి పెళ్ళిచేశాను. అమ్మాయికి డెబ్భై అయిదువేల రూపాయల నగలు పెట్టాను. వారంరోజుల క్రిందట, ఆ నగలన్నీ గిల్టువని తేలింది...."

టెంపో కనుబొమలు నుదుర్ని పైకితోస్తూ లేచాయి.

"అసలు నగల స్థానంలో గిల్టునగల్ని నేనే పెట్టానని అల్లుడు గోపీ, అమ్మాయీ అనుకుంటున్నారు!"

"నగలు ఎక్కడకొన్నారు?" టెంపో సిగరెట్

ముట్టించి, అడిగాడు.

"వజ్రవేల్ చెట్టి షాపులో. అతను నా మిత్రుడు. చాలా పెద్ద వ్యాపారస్థుడు. అతను నకిలీ నగల్ని అమ్మే వ్యక్తి కాడు...."

"నగలు మీరే సెలెక్టు చేశారా?" ఔంపో అడ్డొస్తూ అడిగాడు.

"నేనూ, రాధికా, దయానంద్ వెళ్ళి కొన్నాం...."

"దయానంద్ ఎవరు?"

తిరపతిరావు మళ్ళీ నిట్టూర్చాడు. "మిస్టర్ ఔంపో, ఈ సందర్భంలో కుటుంబ విషయాలు కొన్ని చెప్పాలి. దయానంద్ అమెరికాలో వుంటున్నాడు. అదృష్టవశాత్తూ అతను మా సంబంధాన్ని వెతుక్కుంటూ వచ్చాడు. అతనితో పెళ్ళి నిశ్చయం చేశాను. కానీ, మంగళసూత్ర ధారణ జరిగే ముందు కథంతా అడ్డం తిరిగింది. రాధిక గోపీని ప్రేమించింది. కారణాంతరాలవల్ల వాళ్ళ పెళ్ళికి నేను అంగీకరించలేదు. గోపీ పోలీస్ ఇన్‌స్పెక్టర్స్‌ని తోడుగా తీసుకుని పెళ్ళిపందిట్లో జొరబడ్డాడు. రాధిక తన ప్రేయసి అనీ, తనవల్ల ఆమెకి నెల తప్పిందనీ బొబ్బ లెట్టాడు. తాళి కట్టబోతున్న అమెరికా పెళ్ళికొడుకు-దయానంద్-పీటలమీంచీ లేచేశాడు....చివరికి, గత్యంతరంలేక అదే ముహూర్తానికి గోపీచేత రాధికకి తాళికట్టించడం జరిగింది...."

"గోపీ ఎలాంటివాడు?" ఔంపో అడ్డొస్తూ అడిగాడు.

"మొదట్నించీ అతనంటే నాకు సదభిప్రాయం లేక పోయినా, పందిట్లో నా పరువు తీసినా గోపీ యోగ్యుడనే వొప్పుకోవాలి. రాధిక నగల్ని అతను అలా చేయడు."

"మిస్టర్ తిరపతిరావ్, పెళ్ళికి ఎన్నిరోజుల ముందు

ఆ నగలు కొన్నారు?"

"వారం రోజులనుకుంటా...."

"వారంరోజులూ అవి ఎవరిదగ్గరున్నాయి?"

"....నా దగ్గరే! దయానంగ్ వాటిని నా దగ్గరే ఉంచ మన్నాడు. అన్నట్టు అతనికి నేను ఆఫర్ చేసిన కట్నం సొమ్ముతో నగలు కొన్నాడతను" తిరపతిరావు గొణిగాడు.

"మీ ఇంట్లో ఎవరెవరున్నారు?"

తిరపతిరావు చిన్నగా నవ్వాడు. "మీ ఉద్దేశం అర్థమైంది. మా ఆవిడా, కూతుర్లూ, నేనూ. ఎవ్వరూ అలాంటి పాడుపని గురించి ఆలోచించరు కూడా! పైగా నగలు ఇనప్పెట్టెలో పెట్టాను. తాళాలు ఇరవైనాలుగ్గంటలూ నా దగ్గరే వున్నాయి!"

"అంటే కొన్న క్షణంనుంచీ, అమ్మాయి ధరించేదాకా నగలు మీ కస్టడీలో వున్నాయన్నమాట!"

"యస్."

టెంపో కళ్ళతో నవ్వుతూ చూశాడు. "నగల్ని మార్చ డానికి మీకే బ్రహ్మాండమైన అవకాశం వుంది!"

తిరపతిరావు బాధతో నవ్వాడు. "కానీ....అవసరం లేదు!"

టెంపో సిగరెట్ పీకని పడేసి, పైకి లేచాడు. టేబుల్ నుంచీ దూరంగా జరిగి తివాచీమీద పచార్లు చేయడం ప్రారంభించాడు. తిరపతిరావు అతన్నే చూస్తూ వుండి పోయాడు. కండలు తిరిగిన పొడుగాటి విగ్రహం. వెడల్పాటి భుజాల్లోంచీ బలం పైకి పొంగుతున్నట్టు కనిపిస్తోంది. వంకీలు తిరిగిన క్రాపు. వెడల్పాటి నుదురు. పొడుగాటి ముక్కు. ఎదటి మనిషి కళ్ళల్లోంచీ లోపలికి చొచ్చుకుపోయి, ఎన్నో పొరల్నీ, తెరల్నీ తొలగిస్తూ మన

సుని చూసే కళ్ళు....మరో సిగరెట్ వెలిగించి టెంపో తిరపతిరావు ముందు ఆగాడు.

"మిస్టర్ తిరపతిరావ్, పెళ్ళప్పుడు అమ్మాయికి నగలు మీరే ఇచ్చారా?"

"ఆఫ్‌కోర్స్....నోనో....మీరు ప్రత్యేకించి అడుగుతూంటే గుర్తొస్తోంది. రాధికనీ, నగల్నీ దయానంద్ గదిలోకి తీసికెళ్ళాను. అతను కొన్న నగలు. అతని చేతికే ఇచ్చాను. అతను తన చేతుల్తో రాధికకి ప్రెజెంట్ చేశాడు...."

టెంపో కళ్ళు చిట్లిస్తూ చూశాడు. "దయానంద్ నగల్ని మార్చివుంటాడా?"

తిరపతిరావు తలని అడ్డంగా ఆడించాడు. "అతనికా అవసరం లేదు. రాధిక నగలు ధరించిన చాలాసేపటిదాకా ఆమెని గోపీ తన్నుకుపోతాడని ఎవ్వరికీ తెలీదు. తను పెళ్ళాడి, అమెరికా తీసుకెళ్ళే రాధిక నగల్ని మార్చాల్సిన అవసరం ధనవంతుడైన దయానంద్‌కి లేదు! నిజం చెప్పాలంటే అవకాశమూ లేదు."

టెంపో సాలోచనగా చూశాడు. "అయిదుగురు వ్యక్తులు ఆ నగల్ని ముట్టుకున్నారు. వజ్రవేల్ చెట్టి, మీరు, దయానంద్, రాధిక, గోపీ. ఈ వ్యక్తుల్లో ఎవరో ఒకరు ఆ పని చేసి వుండాలి. ఈ అయిదుగురూ చేయలేదని మీరంటున్నారు. ఎవరో చేయకపోతే బంగారు గిల్టుకాదు! ఎవరు చేశారు?" అన్నాడతను గంభీరంగా.

"అది మీరు కనిపెట్టాలి!" తిరపతిరావు నవ్వుతూ అన్నాడు.

"ప్రయత్నిస్తాను...."

"మిస్టర్ టెంపో, ప్రయత్నించడం కాదు; ఫలితం

సాధించాలి! కూతురూ, అల్లుడూ నన్ను దొంగ అనుకోడం కన్నా దౌర్భాగ్యం లేదు! నగలు దొరక్కపోయినా ఫరవా లేదు. ఐ డోంట్ కేర్! ఆ ఛండాలపు పని నేను చేయలేదని మీరు నిరూపిస్తే చాలు. నా కూతురికి మరో సెట్ నగలు చేయిస్తాను...." అంటూ తిరపతిరావు జేబులోంచీ వంద రూపాయల నోట్లకట్ట తీశాడు. టేబుల్ మీద వుంచి, నవ్వుతూ చూశాడు.

"అడ్వాన్సుగా పదివేలిస్తున్నా. తరవాత మీరు అడిగి నంత ఇస్తాను" అన్నాడు.

డిటెక్టివ్ టెంపో రెండు చేతుల్నీ కోటుజేబుల్లో దోపు కుని, టేబుల్‌కి ఆనుకుని వాలుగా నిలబడ్డాడు.

"మిస్టర్ తిరపతిరావ్, మీ కూతుర్నీ, అల్లుడినీ, దయా నంద్‌నీ నేను కల్సుకోవాలి. వాళ్ళ అడ్రసులివ్వండి."

తిరపతిరావు జేబులోంచీ డైరీ తీశాడు. చకచకా రాసి కాగితం చింపి, నోట్లకట్ట కింద పెట్టాడు. తలెత్తి టెంపో వైపు చూశాడు. "దయానంద్ అడ్రసు నాకు తెలీదు...."

టెంపో ఆశ్చర్యంగా చూశాడు. "అతను మీకెలా పరిచయం అయ్యాడు?"

"పురోహితుడు అవధానిగారు తీసుకొచ్చాడు."

"అవధాని అడ్రసు రాయండి."

"సమ్మంధం ఖాయంచేసుకునేటప్పుడు తిరపతి సమీ పంలోని తన ఎస్టేట్ మేనేజర్ టెలిఫోన్ నంబరూ, అడ్రసూ ఇచ్చాడు దయానంద్...." రాయడం ముగించి మెల్లిగా అన్నాడు తిరపతిరావు.

"రాయండి."

"గుర్తులేదు. ఇంట్లో ఎక్కడో వుంది. తరవాత మీకు ఫోన్‌చేసి చెప్తాను" అన్నాడు తిరపతిరావు. "మళ్ళీ ఎప్పుడు

కలుసుకోమ్మంటారు?"

"అవసరం అయితే. ఏదేనా తెలిస్తే ఫోన్ చేస్తాను" టెంపో క్లుప్తంగా అన్నాడు. తిరపతిరావు నిలబడి కుడి చెయ్యి ముందుకి చాచాడు.

"మిస్టర్ టెంపో, ఈ చిదంబర రహస్యాన్ని మీరు భేదించేదాకా నాకు మనశ్శాంతి వుండదు!" అన్నాడు బరువుగా.

టెంపో అతనితో కరచాలనం చేశాడు.

2

అతను తలుపు తెరిచి, గుమ్మంలో నిలబడ్డ వ్యక్తిని కళ్ళద్దాలగుండా ఆశ్చర్యంగా చూశాడు.

"మిస్టర్ గోపీ...."

"నేనే. మీరు...." గోపీ ప్రశ్నార్థకంగా చూశాడు.

"అయామ్ డిటెక్టివ్ టెంపో."

"మీ గురించి విన్నాను. చూడ్డం ఇప్పుడే. దయచేసి లోపలికి రండి!" అంటూ గోపీ తలుపు బార్లా తెరిచి పక్కకి జరిగాడు. టెంపో చిన్నగావున్న హాల్లోకి అడుగు పెట్టాడు. ఎక్కడి వస్తువులు అక్కడ అమర్చబడ్డాయి. హాలు అందంగా వుంది.

"రాధికా, డిటెక్టివ్ టెంపోగారు ...." గోపీ, సోఫాలో కూచుని చూస్తున్న రాధికతో అన్నాడు. రాధిక నిలబడి టెంపోకి నమస్తే చెప్పింది.

"సార్, కూచోండి," గోపీ గౌరవపూర్వకంగా అన్నాడు. రాధిక లోపలికి వెళ్ళింది. టెంపో సోఫా ఎదురుగా కుర్చీలో కూచున్నాడు. రాధిక తిరిగి వచ్చి కాఫీ కప్పుని టెంపోకి అందించింది. ఆమెని చిరునవ్వుతో

చూస్తూ టెంపో కాఫీ చప్పరించసాగేడు.

డిటెక్టివ్ టెంపో రాకకి కారణం ఊహించడానికి ప్రయత్నిస్తున్నట్టున్నాయి గోపీ రాధికల మొహాలు.

"తిరపతిరావుగారు నన్ను కల్సుకున్నారు. నగల గోల్ మాల్ గురించి కనిపెట్టమన్నారు...." అంటూ టెంపో ఆగాడు.

రాధికా, గోపీ ఒకేసారి నిట్టూర్చారు. గోపీ అద్దాల్లోంచీ టెంపోని చూశాడు. "టెంపోగారూ, రాధికకోసం నేను రాధికను పెళ్ళాడాను; నగలకోసం కాదు! అయినా జరిగింది షాక్‌లాగా తెలిసిన క్షణంలో బాధకలిగింది. తరవాత ఆ విషయం మరిచిపోయాను...."

"కానీ మీ మామగారు మరిచిపోలేదు!" టెంపో నవ్వుతూ అన్నాడు. గోపీ నవ్వలేదు. రాధిక తలవాల్చుకుని కూచుంది.

"రాధికా, నగల్ని నువ్వు ఎవరికేనా ఇచ్చావా?" టెంపో ప్రశ్నించాడు.

రాధిక తల అడ్డంగా ఊగింది. "లేదు."

"రాధికా, ముహూర్తం ముందు దయానంద్ గదిలో నీకు నగలు ఇచ్చాడు. అతను నగల్ని మార్చివుంటాడా?" టెంపో అడిగాడు.

రాధిక తలపైకెత్తి టెంపో కళ్ళల్లోకి చూసింది "ఆయన అలాంటివారు కారు!"

టెంపో ఆశ్చర్యంగా చూశాడు.

"దయానంద్ అలాంటి వ్యక్తి కాదని నాకు తెలుసు. నా పట్టుచీరలకి యిచ్చిన పదివేలూ ఆయన తిరిగి తీసుకోలేదు. నిజం తెలిశాక, నాన్నకి తగువిధంగా బుద్ధిచెప్పి, ధైర్యంగా నిలబడి గోపీచేత నా మెళ్ళో మంగళసూత్రం

కట్టించారు: ఆయన త్యాగపురుషుడు!" రాధిక మెరిసే కళ్ళతో అంది.

"యస్! దయానంద్ నిజంగా పెద్దమనిషి. ఆయన్ని అనుమానించటం ధర్మంకాదు!" గోపీ ఉద్రేకంతో అన్నాడు.

సిగరెట్ వెలిగించి. పెంపో గోపీ మొహంలోకి తదేకంగా చూశాడు. "గోపీ, దయానంద్ పెద్దమనిషని నీకెలా తెలుసు?"

"....తెలుసు "

"ఎలా తెలుసు? మీ పరిచయం...."

గోపీ ఏదో చెప్పబోతూ ఆగాడు. పెంపో కళ్ళల్లోకి చూశాడు. "పెంపోగారూ, ఒకరు చేసిన పనికి మరొకర్ని అనుమానించడం అన్యాయం. దయానంద్‌తో నాకు పరిచయం వుంది. రాధికతో నా పెళ్ళి అసంభవం అని తేలిపోయిన విషాద సమయంలో ఆయన స్వయంగా వచ్చి నన్ను కల్సుకున్నారు. బ్రహ్మాండంగా ప్లాన్ చేశారు. రాధికతో తన పెళ్ళి ఫిక్స్ చేసుకున్నారు. తాళికట్టేముందు నేను పోలీస్ ఇన్స్‌పెక్టర్స్‌తో బాటు రంగ ప్రవేశం చేసేలా ఏర్పాటు జేశారు.

ఆయన నేర్పించిన విధంగా నేను నాటకం ఆడాను. ఆయన తన పాత్రని ఎంతో అద్భుతంగా పోషించారు. పరిస్థితిని అర్థం చేసుకున్న రాధిక సమయస్ఫూర్తితో నా మూలంగా తనకి నెలతప్పినట్టు చెప్పేసింది. దయానంద్ స్పోర్టివ్‌గా మామగార్ని దబాయించి, బెదిరించి నాచేత రాధిక మెడలో తాళికట్టించారు!" గోపీ ఆవేశంతో చెప్పి ఆగాడు.

పెంపో నమ్మలేనట్టు చూశాడు. "ఈ నాటకం గురించి

ఎవరెవరికి తెలుసు?"

"మొదట్లో నాకూ తెలీదు. పెళ్ళిముందు నా పాత్రని ఆయన వివరించారు. పెళ్ళయ్యాక అసలు విషయం రాధికకి చెప్పాను. ఇప్పుడు మీకు తెలుసు!" గోపీ నవ్వుతూ చూశాడు.

"దయానంద్ తెలివైన వ్యక్తిలా వున్నాడు...." జెంపో నవ్వుతూ అన్నాడు.

"నిస్సందేహంగా. హీఈజే రియల్ జంటిల్‌మన్!" అన్నాడు గోపీ. అవునన్నట్టు రాధిక నవ్వింది.

"గోపీ. మీ ఇద్దరికీ పెళ్ళిచేయడంలో అతని మోటివ్ ఏమిటి?" జెంపో మరో సిగరెట్ ముట్టిస్తూ అడిగాడు.

"ఈ ప్రశ్న ఆయన్నే అడిగాన్నేను. మానవధర్మం అన్నారాయన."

"ముక్కూ మొహం తెలీని వ్యక్తికి ఇలాంటి మేలు చేయడానికి అంతకన్నా బలమయిన మోటివ్ వుండాలి" జెంపో నవ్వుతూ అన్నాడు.

"మీ అర్థం?" గోపీ ప్రశ్నించాడు.

"మీ ఇద్దర్నీ కలపడానికి దయానంద్ బ్రహ్మాండమైన శ్రమ తీసుకున్నాడు. ఏదో లాభం లేకపోతే మనిషి అంత శ్రమ పడడు."

గోపీ తల అడ్డంగా ఆడించాడు. "నా పెళ్ళి ప్లాన్‌కి ఆయన పదిహేనువేలు ఖర్చు చేశారు. తరువాత ఆ పైకం నేను వాపసు చేశాను. కానీ, ఆ డబ్బునీ ఆయన సొంతానికి వాడుకోలేదు!"

జెంపో ప్రశ్నార్థకంగా చూశాడు.

"ఆ పైకాన్ని ఆయన నా పేర క్షామనివారణార్థం కర్ణాటక ముఖ్యమంత్రి నిధికి పంపేశారు! ఆ తరవాత కర్ణా

టక ముఖ్యమంత్రి నుండీ నాకు ధన్యవాదాలు తెలిపే ఉత్తరం వచ్చింది. అప్పటిదాకా దయానంద్ చేసిన ఆ సత్కార్యం గురించి నాకు తెలీదు!"

"ఐసీ...." ఝెంపో సాలోచనగా అన్నాడు. "మిస్టర్ గోపీ, దయానంద్ గురించి నీకు ఇంకా ఏం తెలుసు?"

"ఇంతకన్నా ఏమీ తెలేదు! ఆయన తన గురించి నాకేం చెప్పలేదు...."

"అయిదుగురు వ్యక్తులు నగల్ని హాండిల్ చేశారు. ఎవరో ఒకరు నగల్ని మార్చి వుండాలి...."

"ఝెంపోగారూ. ఫర్గెట్ ఇట్! రాధికా నేనూ ఒకరికొకరు ఆభరణాలుగా వున్నాం. ఆ నగల్ని ఎవరు కాజేసినా మేం విచారించం!" గోపీ వుద్రేకంతో అన్నాడు.

ఝెంపో చిరునవ్వు నవ్వాడు. "మీ ఇద్దరిదీ నిజమైన ప్రేమ! కానీ తిరపతిరావుగారికి ఇదేదో తేలేదాకా మన శ్శాంతి వుండదు...."

"అంతా మరిచిపొమ్మని ఆయనకి మీరు చెప్పండి!" గోపీ నవ్వుతూ అన్నాడు.

"ఈ కేసు గమ్మత్తుగా వుంది. ఏదో తేలిందాకా నేనూ మరిచిపోలేను!" ఝెంపో నవ్వుతూ అన్నాడు. "గోపీ, నీతో పెళ్ళికి వచ్చిన ఇన్స్పెక్ట్రిస్ ఎవరు?"

"నాకు తెలీదు. ముందే సంగతంతా దయానంద్‌గారు ఆమెకి చెప్పినట్టున్నారు. ఆయన చెప్పిన ప్రదేశంలో ఆమెని కలుసుకున్నా."

"ఎక్కడ?"

"తిరపతి రైల్వేస్టేషన్ దగ్గరున్న సర్కిల్‌లో. టాక్సీలో వెళ్లాను. నేను పలకరించగానే ఆమె టాక్సీలో ఎక్కారు...."

"గోపీ! ఆమె నిజంగా పోలీసేనా?" టెంపో ప్రశ్నించారు.

గోపీ ఆశ్చర్యంతో చూశాడు. "ఈ క్షణందాకా నాకా అనుమానం రాలేదు. అప్పుడు అసలు పోలీసే అనుకున్నాను!"

"దయానంద్ పెళ్ళికొడుకుగా నటించినట్టే ఆమె పోలీసుగా నటించి వుండొచ్చా?" టెంపో ప్రశ్నించాడు.

"ఉండొచ్చు....ఉండకపోవచ్చు. వాళ్ళిద్దరి సహకారంతో రాధిక నాకు నక్కింది. ఆమె నకిలీ అయినా, అసలు పోలీసే అయినా నేను కేర్ చేయను!" గోపీ నవ్వుతూ అన్నాడు.

"టెంపోగారు దయానంద్‌గార్నే అనుమానిస్తున్నట్టుంది!" రాధిక నవ్వుతూ అంది.

"మిస్టర్ టెంపో, దయానంద్‌గార్ని అనుమానించకండి!" గోపీ ఉద్రేకంతో అన్నాడు.

చిన్నగా నవ్వుతూ టెంపో లేచాడు. పక్క పక్కనే కూచున్న వాళ్ళిద్దర్నీ తదేకంగా చూశాడు. "అసలు వ్యక్తి దొరికేదాకా అందర్నీ అనుమానించాల్సిందే!"

3

"మీ ఫోన్‌కాల్ అందగానే, మీరు అసలు సంగతి పసిగట్టేశారేమో అనుకున్నాను!" తిరపతిరావు పచార్లు చేస్తున్న టెంపో వైపు చూస్తూ అన్నాడు.

"అసలు సంగతి అంత సులువుగా తేలదు! మిస్టర్ తిరపతిరావ్, ఇందులో దయానంద్ పనితనం వుందని నాకు అనుమానంగా వుంది...." టెంపో ఆగి, మెల్లిగా అన్నాడు.

తిరపతిరావ్ ఆశ్చర్యంగా చూశాడు. "దయానంద్

అమెరికన్ బిజినెస్ మాగ్నెట్! ఆ నగలు అతనికి చింత పిక్కలతో సమానం!" అన్నాడు.

టెంపో చిన్నగా నవ్వాడు. "నా అనుమానం నిజమే అవుతే అతను అమెరికా నుంచి రాలేదు; ఆంధ్రా నుంచే వచ్చాడు!"

"వాట్?" తిరపతిరావు అరిచాడు.

"యస్. మీరిచ్చిన నగల్ని అతను రాధికకు ఇవ్వ లేదు. నకిలీ సరుకు ఇచ్చాడు."

తిరపతిరావు నోరు పెద్దగా తెరిచాడు. "ఐ కాంట్ బిలీవ్! కాబోయే తన భార్యను అతను ఎందుకలా మోసం చేస్తాడు?"

టెంపో నవ్వుతూ వెళ్ళి రొటేటింగ్ కుర్చీలో కూచు న్నాడు. తిరపతిరావు తల పొద్దుతిరుగుడు పువ్వులా టెంపో వైపు తిరిగింది.

"మిస్టర్ తిరపతిరావ్, తన కోసం అతను మీతో సంబంధం సెటిల్ చేసుకోలేదు!"

"వాట్?" తిరపతిరావు బొంగురుగా అరిచాడు.

"అమెరికా అబ్బాయిలా నటిస్తూ అతను మీతో సంబంధం ఖాయం చేసుకున్నాడు. తాళి కట్టేముందు, అద్భుతంగా నాటకం ఆడి గోపీని మీ అమ్మాయి భర్తగా చేశాడు...."

తిరపతిరావు ఉక్కిరి బిక్కిరవుతూ కుర్చీలోంచి లేచాడు. అతని రెప్పలు కదలడం మానేశాయి.

"గోపీకీ, రాధికకీ పెళ్ళి చేయడం కోసం అతను పక డ్బందీగా నాటకం ఆడించి రక్తి కట్టించాడు; మిమ్మల్ని నిస్సహాయ స్థితిలో ఇరికించి, కార్నర్ చేసి బోల్తా కొట్టిం చాడు! వాళ్ళిద్దరిమధ్య వున్న ప్రేమకు పాదు చేయడానికి

అతను అంత రిస్క్ తీసుకున్నాడంటే నేను నమ్మను!"

"నాకు....నాకు అర్థం కావడంలేదు...." తిరపతిరావు నత్తివాడిలా అన్నాడు.

టెంపో చిన్నగా నవ్వాడు. "ప్రేమికుల్ని పెళ్ళితో ముడివేసే ఉద్దేశాన్ని అతను ఎంతో చాకచక్యంగా కాపిటలైజ్ చేసుకున్నాడు. అందుకే నగదు తీసుకోకుండా మీ చేత నగలు కొనిపించాడు!"

తిరపతిరావు అయోమయంగా చూశాడు.

"తాళికట్టే వ్యక్తికి పెళ్ళికూతురితోబాటు కట్నాన్నీ ఇచ్చివేయాలి! నకిలీ నగదు అతను తేలేడు. నకిలీ నగలు సులభంగా తేగలడు...."

"గుడ్‌గాడ్! మిస్టర్ టెంపో. ఇదంతా ఏదో క్రైమ్ కథలా వుంది! ఇప్పటికీ .... నేను .... నమ్మలేకుండా వున్నాను...."

"నగలు కొన్నాక, అతను వజ్రవేల్ చెట్టి షాపుకి మళ్ళీ వెళ్ళాడు. మీరంతా సెలక్ట్ చేసిన నగల నమూనాలున్న కేటలాగ్‌ని తీసుకున్నాడు!"

తిరపతిరావు పెదవులు అదరడం ప్రారంభించాయి. కంగారుగా చూశాడతను.

టెంపో తీక్షణంగా చూశాడు. "కేటలాగ్ ఎందుకు తీసుకున్నాడతను?"

తిరపతిరావు మౌనంగా చూస్తున్నాడు.

"అసలు నగల్లాగే కనిపించే నకిలీ నగలు చేయించడానికి!" టెంపో నవ్వుతూ అన్నాడు. తిరపతిరావు అలసటగా కుర్చీలో కూలబడ్డాడు.

"టెంపోగారూ....అతను.... దయానంద్ - ఇదంతా నిజంగా చేశాడంటారా?" వణికే కంఠంతో ప్రశ్నించా

దతను.

"అతను చేయకపోతే మీరు చేసి వుండాలి!"

"మిస్టర్ టెంపో!"

"రాధికా, గోపీ తాము ఒకరి కొకరు అమూల్యమైన ఆభరణాలుగా భావిస్తున్నారు...."

"మిస్టర్ టెంపో....నేను....నేను ఆ పని చేయలేదని మీకు తెలుసు!"

"తండ్రి స్థానంలో వున్న మీ మాటల్ని నేను నమ్ము తున్నా. అంచేత మీరు కాకపోతే ఆ పని చేయడానికి అవకాశం వున్న వ్యక్తి ఒక్కడే! దయానంద్!"

తిరపతిరావు ఆవేశంతో చూశాడు. "స్కౌండ్రల్! మేకతోలు తగిలించుకు వచ్చిన తోడేలుని పోల్చుకోలేక మోసపోయాను...." అంటూ పళ్ళు కొరుక్కున్నాడు. మెల్లగా తమాయించుకుని టెంపోవైపు ఉద్వేగంతో చూశాడు. టేబుల్ మీదున్న అతని పిడికిళ్ళు బిగుసు కున్నాయి.

"మిస్టర్ టెంపో, ఎంతయినా ఖర్చుపెట్టండి. ఆ దుర్మార్గుణ్ణి పట్టండి!"

"పెళ్ళిలో మీరు ఫోటోలు తీశారుగా?" టెంపో అడిగాడు.

తిరపతిరావు విచారంగా చూశాడు. "రాధికకి ఇష్టం లేని పెళ్ళి అది. ప్రపంచాన్నంతా మింగేసేంత దుఃఖం దాని మొహంలో కాపురం చేస్తోంది. ఆ స్థితిలో ఫోటోలూ అవీ వద్దంది నా భార్య, నాకూ నిజమే అనిపించింది...."

టెంపో సిట్టూర్చి చిరునవ్వు నవ్వాడు. "ఏ ఆధారము లేకుండా మనం అతని కోసం వెతకాలి...."

"అతని పేరు...." తిరపతిరావు ఆశగా అన్నాడు.

అతని కళ్ళు మెరిశాయి. "టెంపోగారూ, దయానంద్ దయానందే అని నాకు తెలుసు! అతనిచ్చిన ఫోన్ నంబరూ అడ్రసూ నిజమైనవే. ఎందుకేనా మంచిదని అతని ఎస్టేట్ మేనేజర్ని నేను పెళ్ళి ఫిక్స్ చేసుకునే సమయంలో కాంటాక్టు చేశాను. తన స్థితి గురించీ, తన తల్లి గురించీ బంధువుల గురించీ దయానంద్ నాకు చెప్పిందంతా నిజమే! అతనే ఇతను-కాకపోతే అన్నీ యథార్థాలే ఎలా చెప్పగలడు?"

కళ్ళు పెద్దగా చేసి చూస్తున్న తిరపతిరావుని టెంపో క్షణకాలం చూశాడు. ఆలోచిస్తూ సిగరెట్ వెలిగించాడు.

"అతనే ఇతనయ్యుంటే తేరగా డబ్బు సంపాదించాలన్న యావ అమెరికన్ బిజినెస్ మాగ్నెట్ కి పుట్టి వుండాలి....లేకపోతే మరెవరో ఆ పని చేసివుండాలి. నగలు కొన్నతరవాత వారం రోజులపైగా దగ్గిరుంచుకున్న మీకూ, కేటలాగ్ తీసుకెళ్ళిన దయానంద్ కీ నకిలీవి చేయించే అవకాశం, వ్యవధీ వున్నాయి!"

అంటూ లేచి టెంపో టేబుల్ ముందుకి నడిచాడు. కాళ్ళు ఎడంగా పెట్టి సిగరెట్ పెదాలమధ్య వుంచుకుని, రెండు చేతుల్నీ కోటు జేబుల్లో దోపుకుని తల పైకెత్తి సీలింగ్ ఫాన్ వైపు కళ్ళు చిట్లిస్తూ చూస్తూ వుండిపోయాడు.

తటాలున తిరపతిరావు వైపు తిరిగాడతను. సిగరెట్ వేళ్ళతో ఇవతలికి తీశాడు. తిరపతిరావు మొహంలోకి రెప్ప వేయకుండా చూశాడు. "మిస్టర్ తిరపతిరావ్, అమెరికాలో వున్న పారిశ్రామికవేత్త దయానంద్ గురించి అన్నీ తెలుసుకున్న తెలివయిన వ్యక్తి. తనని గురించీ, దయానంద్ గురించీ ఏమీ తెలీని మీకు తనను దయానంద్ గా పరిచయం చేసుకుంటే మీరు పోల్చుకో

గలరా?''

తిరపతిరావు ఉలిక్కిపడి చూశాడు. "పోల్చుకోలేను" అన్నాడు ఆశ్చర్యంతో.

"మీలో మొలకెత్తే అనుమానాల్ని మొక్కగా ఎదగక ముందే తుంచి వేయాలన్న ముందు చూపుతో ఆ వ్యక్తి మీకు దయానంద్ ఎస్టేట్ మేనేజర్ ఫోన్ నంబరూ అదీ ఇచ్చాడు!''

తిరపతిరావు గుటకలు మింగుతూ చూశాడు. "మిస్టర్ టెంపో, మీ తర్కం నా మతి పోగొడుతోంది.''

"మీ పరిచయం సంపాదించి, మీ కూతురితో పెళ్ళి ఖాయం చేసుకున్న వ్యక్తి దయానంద్ కాదని నాకు అనిపిస్తోంది. అతను నకిలీ మనిషి!'' టెంపో గంభీరంగా అన్నాడు.

"మిస్టర్ టెంపో. దీని అంతు తేల్చండి. నాకూతుర్ని అల్లుణ్ని నేను మోసం చేయలేదని నిరూపించండి!'' తిరపతిరావు ఉద్రేకంగా అన్నాడు.

"అరణ్యంలో, పచ్చని ఆకులమధ్య దాక్కున్న ఆకు తేలు కోసం మనం గాలించాలి! ఆల్‌రైట్....మీరు వెళ్ళండి'' అన్నాడు టెంపో.

తిరపతిరావు బరువుగా నిట్టూరుస్తూ మెల్లిగా లేచాడు. "ఏదేనా తెలిస్తే....''

"నాకు తెలిస్తే మీకు తెలుస్తుంది?'' టెంపో నవ్వుతూ అన్నాడు.

"థాంక్యూ....'' అంటూ తిరపతిరావు గుమ్మంవేపు కదిలాడు. అతన్ని మాయంచేస్తూ తలుపు మూసుకుంది.

డిటెక్టివ్ టెంపో రెండడుగులువేసి, టేబుల్ అంచు మీద కూచుని టెలిఫోన్ రిసీవరందుకున్నాడు. చెవికి రిసీ

వర్ని ఆన్చి పట్టుకుని డయల్‌టోన్ వింటూ అలాగే వుండి పోయాడు. పూర్తిగా కాలిన సిగరెట్‌ని యాష్‌ట్రేలో పడేశాడు. అతని చూపుడు వేలు మెల్లిగా ఒక నంబర్ని తిప్పింది.

"ప్రభంజనం" అందో కంఠం అటువేపు నుంచీ.

"డిటెక్టివ్ టెంపో...." అంటూ టెంపో ఆగాడు.

"నమస్తే మిస్టర్ టెంపో! ఈమధ్య మీరు కనిపించడం లేదు; మీ కంఠం వినిపించడం లేదు? ఏమిటి సంగతులు? ఏదేనా ఇన్ఫర్మేషన్ ఇస్తున్నారా?" ప్రభంజనం నవ్వుతూ అన్నాడు.

"ప్రభంజనం, నాకే కొంత ఇన్ఫర్మేషన్ కావాలి...."

"అడగండి"

"పైకి, సాధారణ దృష్టికి నేరాలుగా కనిపించని నేరాలు సరికొత్త పద్ధతిలో సాగుతున్నాయి. నేరాలు కాని నేరాలు! చాకచక్యంగా మనుషుల్ని బుట్టలో వేసే బ్రహ్మాండమైన తెలివితేటల్ని వుపయోగించి చేసిన నేరాలు...."

"తలా తోకా తెలీని అలాంటి అడ్వెంచర్స్ కొన్ని నా దృష్టికి వచ్చాయి. వాటిని నేను రిపోర్టుచేశాను...." ప్రభంజనం అడ్డొస్తూ అన్నాడు.

"వెరీగుడ్! ఆ వివరాలు నాకు అర్జెంటుగా కావాలి!" టెంపో ఉత్సాహంగా అన్నాడు.

"నేరాలుగా కనిపించని కొన్ని అడ్వెంచర్స్‌లో కొన్ని పోలీసుల దృష్టికి వచ్చాయి. అయితే వాట్ని నేరాలుగా నిరూపించే సాక్ష్యాధారాలు లేకపోడం మూలాన పోలీసులు ఊరుకున్నారు. మరికొన్ని పోలీసులదాకా వెళ్ళలేదు. వాటిలో కొన్నింటిని నేను కూడా రిపోర్టు చేశాను: నా

దృష్టికి రానివి కూడా వుండొచ్చు!"

"ప్రభంజనం, యూ ఆరే గుడ్ క్రైమ్ రిపోర్టర్! ఆ కటింగ్స్ నాకు పంపించు."

"నేనిప్పుడు తీరిగ్గానే వున్నా. అరగంటలో వస్తాను" ప్రభంజనం అన్నాడు.

"ఎక్సలెంట్! నువ్వొస్తే మరీ మంచిది. వివరంగా డిస్కస్ చేయొచ్చు. క్విక్! బయల్దేరు" అంటూ టెంపో రిసీవర్ని పెట్టేశాడు.

4

"కమిన్!" అన్నాడు టెంపో.

తలుపు తోసుకుని పైజామా జుబ్బా ధరించిన వ్యక్తి లోపలికి వచ్చాడు. సన్నగా, పొట్టిగా వున్నాడతను. కొద్దిగా పెరిగిన గెడ్డం. రిమ్‌లెస్ కళ్ళద్దాలలోంచి తీక్షణంగా చూస్తున్న కళ్ళు. చకచకా నడుస్తూ అతను టెంపో దగ్గిరగా వచ్చాడు.

"టెంపోగారూ, ఆయామ్ వనమాలి! ఆర్టిస్టుని. ప్రభంజనంగారు ఇవాళ మిమ్మల్ని కలుసుకోమని నిన్న సాయంత్రం చెప్పారు...." అన్నాడతను చేతిని చాస్తూ. టెంపో అతనితో కరచాలనం చేశాడు.

"మీరు రాసిన కొన్ని రియల్ క్రైమ్ ఆర్టికల్స్‌కి నేను బొమ్మలు వేశాను!" అన్నాడతను.

"థాంక్యూ. ప్లీస్ సిడౌన్;" టెంపో నవ్వుతూ అన్నాడు. వనమాలి కూచుని ప్రశ్నార్థకంగా చూశాడు.

"వనమాలీ, ఒక వ్యక్తిని నేను వర్ణిస్తాను. దాని ఆధారంతో, అతని బొమ్మ గీయాలి...."

"ప్రయత్నిస్తాను...." వనమాలి నవ్వుతూ అన్నాడు.

"ఆ వ్యక్తిని ముఖాముఖీ కల్సుకున్న నలుగురైదుగురు

అతన్ని మాటల్లో చిత్రించారు. కొద్దిపాటి తేడాలున్నా కూడా, ఔట్ లైన్ సరిపోతోంది. వాళ్ళ వర్ణన సారాం - శాన్ని నేను నీకు ఇస్తాను. ఆ వర్ణనకి నువ్వు రూపం ఇవ్వాలి....'' అంటూ శెంపో లేచి, పచార్లు ప్రారంభిం చాడు.

''కొద్దిగా పెరిగి చెవుల్ని కప్పేసిన క్రాపు. వెడల్పాటి నుదురు. మధ్యలో కలుసుకున్న గుబురు కనుబొమలు....'' శెంపో ఆగి, చూశాడు. వనమాలి తన డైరీలో ఏదో చకచకా రాసుకుంటున్నాడు.

''తెలివితేటల్నీ, హుందానీ విరజిమ్ముతూ వుండే పెద్ద పెద్ద కళ్ళు. పొడుగాటి ముక్కు. ఎప్పుడూ నవ్వుతూ వుండే పెదవులు. బలిష్టంగా కనిపించే వెడల్పాటి భుజాలు. ఆరడుగులదాకా వుండే అకారం. ఫుల్ సూటు....అంతే!''

రాయడం ముగించి వనమాలి నవ్వుతూ చూశాడు. ''శెంపోగారూ. ఈ వర్ణన ఆధారంగా నేను మీ బొమ్మ గీచి తెస్తే ఆశ్చర్యపోకండి! అఫ్‌కోర్స్....మీ కనుబొమలు మధ్యలో కలుసుకోలేదనుకోండి....''

శెంపో పకపకనవ్వాడు. ''వనమాలీ, ఇంకొక తేడా కూడా వుంది. నేను వర్ణించిన, నువ్వు చిత్రించబోతున్న వ్యక్తి నేరాలు చేస్తాడు. నేను నేరస్థుల్ని పట్టుకుంటాను! ఇంకా సూక్ష్మంగా ఆలోచిస్తే నేను నవ్వేప్పుడు నాకళ్ళూ నవ్వుతాయి. ఎదటివాణ్ని మోసంచేసే వ్యక్తి పెదాలమీది నవ్వు కళ్ళల్లోకి పాకదు! ఇదంతా నువ్వు గుర్తుంచు కోవాలి!''

వనమాలి మెప్పుగా, గౌరవంగా చూశాడు. ''ఈ వర్ణనతో మీరు అక్షరాల బొమ్మగీసేశారు!''

''ఈ వర్ణన ఆధారంతో బస్ట్‌సైజ్ బొమ్మ నువ్వు గీయ

గలవ్. అలాగే, ఇదే ఆధారంతో అతని ప్రొఫైల్ గీయ గలవా?" టెంపో ప్రశ్నించాడు.

వనమాలి కింది పెదవిని కాసేపు కొరుక్కుంటూ ఆలోచించాడు. తను రాసుకున్న వివరాల్ని వోసారి చూశాడు. "ఎదురుగా వున్న వ్యక్తిని పక్కకి తిప్పి చూడగలం. కానీ ఎదురుగా వున్నట్టు చిత్రించిన బొమ్మను అలా పక్కకి తిప్పి, పార్శ్వదృశ్యాన్ని చూడలేం. అయినా ప్రయత్నిస్తాను...." అన్నాడు మెల్లిగా.

టెంపో నవ్వుతూ చూశాడు. "గుడ్!" అంటూ జేబులోంచీ పర్సుతీశాడు. అయిదు వందరూపాయల నోట్లు లాగాడు. "గీసిన లైన్ డ్రాయింగ్స్‌ని వాష్‌చెయ్యి. వాటిని నెగటివ్‌లు తీయించి వో అరడజను కాపీలు—ఫోటోలు తీయించు. ఫోటోలు మరీ క్లియర్‌గా వుండకూడదు. ఆ వ్యక్తి రూపం మనకి డిమ్‌గా తెలుస్తోంది. మనకి తెలిసిన ఆకారాన్ని ఫోటోలు కూడా కాస్త డిమ్‌గా, కొద్దిగా అస్పష్టంగా రెప్రజెంట్ చేయాలి," అంటూ నోట్లని వనమాలికి అందించాడు.

"ఎక్కువిచ్చారు!" వనమాలి నవ్వుతూ అన్నాడు.

"మైడియర్ ఆర్టిస్ట్, కళకు విలువకట్టకు! గో అండ్ కమ్!" టెంపో నవ్వుతూ అన్నాడు.

వనమాలి పైకిలేచాడు. "ఇవన్నీ మీకు ఎప్పుడు కావాలి?"

"నిన్ననే!" టెంపో నవ్వుతూ అన్నాడు.

వనమాలి డైరీని జేబులో పెట్టుకోబోతూ ఆగాడు. జేబులోంచీ ఒక కవర్ని ఇవతలికి లాగాడు. "ప్రభంజనంగారు ఈ కవర్ని మీకు ఇమ్మన్నారు. ఈ న్యూస్ కటింగ్ మీకు పనికొస్తుందేమో చూడమన్నారు...." అంటూ కవర్ని

అందించాడు.

"థాంక్యూ!" టెంపో కవర్ని అందుకుంటూ అన్నాడు. నమస్కారం చేసి వనమాలి గుమ్మంవైపు వెళ్ళిపోయాడు.

టెంపో కుర్చీలో కూచున్నాడు. న్యూస్ కటింగ్‌ని గబగబా చదవసాగేడు. మయూరీ సిల్క్‌ప్యాలెస్‌లో ఎవరో భార్యాభర్తలు అరవైనాలుగువేల రూపాయల పట్టుచీరలు కొన్నారు. వాళ్ళ కార్లో పెట్టమన్న గుడ్డల పార్సెల్ మాయమైంది. వాళ్ళ కారులాగేవున్న క్రీమ్‌కలర్ కార్లోవున్న ఒక స్త్రీ పార్సెల్ని తెలివిగా అందుకుని ఎటో వెళ్ళిపోయింది. ఆ భార్యాభర్తలు మళ్ళీ పట్టుచీరలు కొనలేదు! షాపతనికి డబ్బు చెల్లించలేదు!... ఆలోచిస్తూ టెంపో ఆ కటింగ్‌ని ప్రభంజనం ఇచ్చిన తతిమ్మా కటింగ్స్‌కి జతపరిచాడు.

భార్యాభర్తలు, దయానంద్, ఇన్స్‌పెక్టరమ్మ....ఒక ఆడా. ఒక మగా....ఇద్దరూ తోడుదొంగలా? పట్టుచీరల కథ కూడా చక్కగా ప్లాన్ చేసిన మరో నేరమా?....

5

టాక్సీ పోలీస్‌స్టేషన్ ముందు ఆగింది. బ్రీఫ్‌కేస్ పట్టుకుని టెంపో స్టేషన్ లోపలికి ప్రవేశించాడు. టేబుల్ ముందు కూచుని తలని ఏదో ఫైల్లో పెట్టేసి, ఏకాగ్రతతో చదువుతున్న ఇన్స్‌పెక్టర్ తలెత్తి ప్రశ్నార్థకంగాచూశాడు.

"అయామ్ డిటెక్టివ్ టెంపో...." టెంపో నవ్వుతూ అన్నాడు.

ఇన్స్‌పెక్టర్ లేచి నిలబడి, ముందుకి వంగి కరచాలనం చేశాడు. "మిస్టర్ టెంపో, మీ గురించి విన్నాను. అయామ్ ఇన్స్‌పెక్టర్ ప్రసాద్. కూచోండి!"

టెంపో కూచున్నాడు. ఇన్స్‌పెక్టర్ ప్రసాద్ కూచుని ప్రశ్నార్థకంగా చూశాడు.

"ఏమిటి ఇలా వచ్చారు?" అన్నా డిన్స్పెక్టర్.

"ఎనిమిది నెలల క్రితం రాష్ట్రపతి రోడ్‌లోని గిరిధర్‌లాల్ జ్యూయలర్స్‌లో జె. శివరామ్ అనే వ్యక్తి రెండు వేల రూపాయలకి చెక్కిచ్చి. డైమండ్ రింగ్ కొన్నాడు." టెంపో ఆగి, సిగరెట్ ముట్టించాడు. "రెండువేలకి కొన్న ఆ ఉంగరాన్ని అదేరోజు సాయంత్రం మరోషాపులో అయిదువందలకి అమ్మే ప్రయత్నం చేశాడు...."

"యస్! దొంగ చెక్కిచ్చాడన్న అనుమానంతో అతన్ని అరెస్టు చేశాను. సోమవారం పొద్దుటే చెక్కు క్యాషయ్యింది! ఉంగరంతోబాటు అతన్ని వదిలేశాం...."

"ఆ తరవాత ఆ వ్యక్తి సేఠ్ గిరిధర్‌లాల్ మీద పరువు నష్టం దావా వేశాడు." టెంపో నవ్వుతూ అన్నాడు.

"యస్! ఆ సంగతి గిరిధర్‌లాల్ నాకు ఫోన్‌చేసి చెప్పాడు...."

"రింగ్ కొనడం, బాంకులు మూసేసిన తరవాత చెక్కు ఇవ్వడం, సాయంత్రం అమ్మే ప్రయత్నం చేయడం. ఆ తరవాత పరువు నష్టందావా....ఇవన్నీ అదొక ప్రీప్లాన్డ్ క్రైమ్ అన్న అనుమానాన్ని కలిగించ లేదా?" టెంపో ప్రశ్నించాడు.

ఇన్స్పెక్టర్ ప్రసాద్ కాసేపు మౌనంగా వుండిపోయాడు. అతని తల అడ్డంగా ఆడింది. "నో. ఆ సంఘటనలన్నీ చాలా నాచురల్‌గా జరిగాయి. ఆ వ్యక్తి చెప్పిందంతా నిజమే అని తేలింది. ఇద్దరిమధ్యా బెడిసికొట్టినట్టు అతని భార్య చెప్పింది. చెక్కు క్యాషయ్యింది. అది జరిగాక అతన్ని మనం బంధించి వుంచలేం!"

"అతన్ని వదిలేశాక, సేఠ్‌నుంచీ డిఫమేషన్ గురించి మీకు ఫోన్‌కాల్ వచ్చాక, అతని కదలికల్ని రహస్యంగా

గమనించివుంటే అది ముందుగా వేసుకున్న పథకం ప్రకారం సాగించిన తెలివైన నేరం అని మీకు తెలిసివుండేదేమో ఇన్స్పెక్టర్! జెంపో గంభీరంగా అన్నాడు.

ఇన్స్పెక్టర్ నోరు కొద్దిగా తెరిచి, కళ్ళు చిట్లిస్తూ చూశాడు. "అలా అని మీరు ఎందుకనుకుంటున్నారు?"

"చాకచక్యంగా జరిగిన మరికొన్ని నేరాలు నా దృష్టికి వచ్చాయి. వాటిలో కనిపించే బుద్ధిబలం ఈ కేసులో కూడా కనిపిస్తోంది. ఒకే బుర్ర ఈ నేరాలన్నింటినీ రూపొందించిందని నాకు అనిపిస్తోంది. అది ఎంతవరకూ నిజమో తేల్చుకోడానికి ఊరూరూ తిరుగుతున్నా!"

ఇన్స్పెక్టర్ ఆశ్చర్యంగా చూశాడు. జెంపో కోటు జేబులోంచి ఒక ఫోటోని తీశాడు. దాన్ని ఇన్స్పెక్టర్కి అందించాడు.

"రింగ్ కేసులో లాకప్లో వున్న వ్యక్తి ఇతనే!" ఇన్స్పెక్టర్ తపీమని అన్నాడు.

జెంపో సంతృప్తితో చూశాడు. వనమాలి తయారు చేసిన ఫోటోల్ని తిరపతిరావు, గోపీ, రాధికా, వజ్రవేల్ చెట్టీ పోల్చారు. తిరపతిరావుకి తిరుక్షౌరం చేసిన దయానంద్, గిరిధర్లాల్కి టోపీ వేసిన శివరామ్ ఒక్కరే!

"మిస్టర్ ప్రసాద్, ఈ మధ్య జరిగిన మరికొన్ని నేరాల్లో ఇతని హస్తం వుందనిపిస్తోంది. మీకు ఇతనిచ్చిన అడ్రెస్ చెప్పగలరా?" జెంపో ప్రశ్నించాడు.

"కానిస్టేబుల్ రంగయ్య అతనిచ్చిన అడ్రెస్కివెళ్ళి అతని భార్యతో మాట్లాడివచ్చాడు."

"రంగయ్యను పిలవండి!" జెంపో అడ్డొస్తూ అన్నాడు. ఇన్స్పెక్టర్ బెల్ నొక్కాడు.

రెండు నిమిషాల్లో కానిస్టేబుల్ టూనాట్టూ వాళ్ళ

దగ్గరగా నుంచున్నాడు. "రంగయ్యా, ఎనిమిది నెలల క్రితం గిరిధర్‌లాల్ రింగ్ కేసులో శివరామ్ అనే వ్యక్తిని మనం అరెస్టు చేశాం...."

"గుర్తుందిసార్. అతని ఇంటికెళ్ళి అతని భార్యతో నేను మాట్లాడివచ్చాను సార్...."

"ఆ అడ్రస్ నీకు గుర్తుందా?" టెంపో ప్రశ్నించాడు.

రంగయ్య బుర్ర గోక్కోబోయి, టోపీ చేతికి తగిలాక మానేశాడు. "ఇంటినంబురు....గుర్తులేదుసార్....చౌరస్తాలో ఇల్లుంది సార్...."

"రంగయ్యా, అతని భార్యను నువ్వు చూశావు. ఆమె ఎలా వుందో చెప్పగలవా?"

రంగయ్య అటూ ఇటూ కదిలాడు. "ఆమె—పేరు లత సార్—చాలా అందంగా వుంది సార్. ఆకర్షించే మొహంసార్. బాబ్డ్ హెయిర్. నేను వెళ్ళినప్పుడు ఆమె చేతుల్లేని జాకెట్ వేసుకుంది సార్. చేతులమీద టీకాల గుర్తుల లేవుసార్...."

టెంపో అతన్ని నవ్వుతూ చూశాడు. "ఆమె పొడుగ్గా వుందా? పొట్టిగా వుందా?"

"....పొడవైన ఆకారమనే చెప్పాలిసార్...."

"వెరీగుడ్! రంగయ్యా, బైట టాక్సీవుంది. నన్ను ఆ ఇంటికి తీసుకెళ్ళు!" అంటూ టెంపో లేచాడు. ఇన్స్‌పెక్టర్ ప్రసాద్ లేచాడు.

"టెంపోగారూ, నన్నూ రమ్మంటారా?" ప్రశ్నించాడతను.

"వొద్దు. రంగయ్యకూడా టాక్సీలో వుంటాడు. నేనొక్కణ్ణే వెళ్ళొస్తాను. మళ్ళీ ఇక్కడికి వస్తాను...." అంటూ టెంపో కదిలాడు.

"రంగయ్యా, టెంపోగారితో వెళ్ళిరా!" ప్రశ్నార్థకంగా తననుచూస్తున్న రంగయ్యకుఇన్స్పెక్టర్ ఉత్తరువిచ్చాడు.

6

"వాట్?" ఇన్స్పెక్టర్ పృథ్వీరావ్ ఆశ్చర్యంగా అరిచాడు.

టెంపో అతన్ని తదేకంగా చూశాడు. "యస్. మైడియర్ పృథ్వీ! సికిందరాబాద్, హైదరాబాద్, విజయవాడ, విశాఖ, రాజమండ్రి, కర్నూలు, నెల్లూరు, మద్రాసు, బెంగళూరు వగైరా నగరాల్లో కొత్త కొత్త పద్ధతుల్లో ఈ నేరాలన్నీ జరిగాయి. వాటిలో ప్రదర్శించబడిన చాకిచక్యం, మేధాసంపత్తీ ఒకే వ్యక్తి ఆ నేరాలన్నీ చేశాడన్న విష యాన్ని చాటి చెప్తున్నాయి!"

"గుడ్‌గాడ్! వీటిలో కొన్నింటి గురించి నేను విన్నాను...."

"మోసగించబడిన వ్యక్తి ఎవరికీ చెప్పుకోలేని నేరాలూ జరిగాయి! విశాఖలో మఖమల్‌చంద్ అనే పాన్‌బ్రోకర్‌కి, మనోహర్ అనేవ్యక్తి నకిలీ నెక్లెస్ తాకట్టుపెట్టి మఖ్మల్ టోపీ వేశాడు. ఆ అడ్వెంచర్లో ఒక యువతి అతనికి సహాయపడింది.

"దొంగనగలు అమ్మే వ్యక్తిగా నటించి, కర్నూల్లో వజ్రాల వ్యాపారి ధనిక్‌లాల్‌కి నకిలీ నెక్లెస్ ఇచ్చి లక్ష రూపాయలు కాజేశాడు. మఖమల్‌చంద్‌గానీ, ధనిక్‌లాల్ గానీ పోలీసులకి రిపోర్ట్ చేయలేదు. ఫోటో పట్టుకుని ప్రతీ షాపూ తిరుగుతూ, ఈ విషయాల్ని నేను ఇవతలికిలాగాను. ధనిక్‌లాల్‌కి నకిలీ నెక్లెస్ అమ్మిన కేసులో అతను నకిలీ పోలీసులను వాడుకున్నాడు."

"గుడ్‌హెవెన్స్!" ఇన్స్పెక్టర్ పృథ్వీరావ్ ఆశ్చ

ర్యాన్ని దాచుకోలేకుండా వున్నాడు.

"నెల్లూర్లో ఆనందరావు అన్యేవ క్తి దగ్గర సేఠ్ కరమ్ చంద్ రాజస్థాన్ స్టేట్ లాటరీలో ప్రథమ బహుమతి పొందిన టికెట్ని మూడు లక్షలుపెట్టి కొనేశాడు. ఆ టికెట్కి ప్రైజ్ రాలేదంటూ పేపర్లో సవరణ పడింది! ఇది కూడా తెలివిగా ప్లాన్ చేయబడింది! అక్కడ ఆనంద రావుగా తనని పరిచయం చేసుకున్న వ్యక్తి శివరామే!"

"ఈ శివరామ్ ఎవడో కత్తిలా ఎడాపెడా నరుక్కు పోతున్నాడు!" ఇన్స్పెక్టర్ పృథ్వీరావ్ అన్నాడు.

"యూ కెన్ సే ఇట్ ఎగైన్! పృథ్వీరావ్, నిన్ను అదరగొట్టేసే మరో అడ్వెంచర్ చెప్పనా?" టెంపో నవ్వుతూ అడిగాడు.

పృథ్వీరావ్ కళ్ళు పెద్దగా చేస్తూ చూశాడు. టెంపో సిగరెట్ వెలిగించి, పొగవదుల్తూ చూశాడు.

"గజదొంగ గజరాజు పేరు నువ్వు విన్నావా?"

"వినకపోవడమా! నొటోరియస్ థీఫ్ అండ్ మర్డరర్! ఆంధ్రా బర్క్లీ! సైలెంట్ మర్డర్ల ఎక్స్పర్ట్! ఈ మధ్య రాజమండ్రిలో వాణ్ణి మా వాళ్ళు పట్టేశారు...."

"జేల్లో ఇరుక్కుపోయిన గజదొంగ గజరాజుని తప్పిస్తానంటూ ఒక వ్యక్తి అతను హత్యచేసి దోచుకున్న లక్షరూపాయల్ని తెలివిగా గుంజుకుని ఉడాయించాడు. గుంటనక్కలాంటి గజరాజును దోచుకున్న తోడేలు మన శివరామే అని నా నమ్మకం!"

"మైగాడ్! గురూ! ఇదంతా నీకెలా తెల్సింది?" ఇన్స్పెక్టర్ పృథ్వీరావ్ అడిగాడు.

"అమెరికా పెళ్ళికొడుగ్గా నటిస్తూ ఇన్కమ్టాక్స్ ఆఫీసర్ తిరపతిరావుకి టోపీ వేశాడు శివరామ్. తిరపతిరావు

కూతురికి ఇచ్చిన నగలు నకిలీవని ఈమధ్య బైటపడింది. తిరపతిరావు నన్ను కలుసుకున్నాడు. ఆ కేసు గురించి ఆలోచిస్తూంటే ఈ కేసుల వాసన తగిలింది నాకు!

"బాగా డబ్బున్నవాళ్ళనీ. బ్లాక్‌మనీ హోల్డర్స్‌నీ. ఈజీ మనీకి అర్రులు చాచే ఘరానా వ్యక్తుల్ని దోచుకోడంలో శివరామ్ అభినవ రాబిన్‌హుడ్‌లా అపుపిస్తున్నాడు! ప్రతి చోటా మనుషుల బలహీనతనీ. దురాశనీ అతను డబ్బుగా మార్చుకుంటున్నాడు. దగాపడిన వ్యక్తులు చాలా సందర్భాల్లో పోలీసులదాకా వెళ్ళడానికి యే మాత్రం వీలులేని విచిత్రమైన పరిస్థితుల్ని కల్పించాడతను. శివరామ్ చాలా తెలివిగా, సమయస్ఫూర్తితో వాళ్ళచుట్టూ తన ఉక్కు పిడికిలి బిగించాడు. దాదాపు అన్ని కేసుల్లోనూ, ప్రతీ వ్యక్తీ అతనికి నవ్వుతూ డబ్బు చెల్లించారు; తరవాత శబ్దం కాకుండా యేడుస్తూ కూర్చున్నారు!"

"రిమార్కబుల్!" ఇన్‌స్పెక్టర్ పృథ్వీరాప్ నవ్వుతూ అన్నాడు

"అతను నేరాలు సాగించిన పద్ధతుల్నీ, ప్రాంతాల్నీ దృష్టిలో వుంచుకుని, అతని తత్వాన్ని అర్థం చేసుకోడానికి నేను ప్రయత్నించాను. విపరీతంగా డబ్బున్నవాళ్ళు హైక్లాస్ హోటల్స్లో వున్న వ్యాళ్ళల్లో శివరామ్ తన శివ తాండవం సాగించాడు. యాభై వేల నుంచీ, లక్షరూపాయలదాకా వివిధ మొత్తాల్ని అతను దోచుకున్నాడు. సరాసరి నెలకి ఒక నేరం చొప్పున అతను చేశాడని అనుకోవచ్చు. నువ్వు నెలనెలా జీతం తీసుకుంటున్నట్టు శివరామ్ ఖర్చులకి డబ్బు పోగుచేసుకుంటున్నాడు. నేరానికీ నేరానికీ, మధ్యవున్న వ్యవధి. దోచుకున్న మొత్తం—ఈ రెండింటి ఆధారంగా ఆలోచిస్తే అతను ధారాళంగా ఖర్చుచేస్తూ

రాజాలా బతుకుతున్నాడని తేలుతోంది...."

ఇన్‌స్పెక్టర్ పృథ్వీరాప్ తన ముందు టెంపో పడేసిన ఫోటోని తదేకంగా చూశాడు.

"గురూ, అంత తెలివిగా నేరాలు చేస్తున్న శివరామ్ నీకు దొరికేలా తన ఫోటో వదిలాడా....?" ప్రశ్నించాడతను.

"మైడియర్ పృథ్వీరాప్, అవి కెమెరాతో తీసిన ఫోటోలు కావు; బుర్రతో గీసినవి!" టెంపో నవ్వుతూ అన్నాడు.

ఇన్‌స్పెక్టర్ పృథ్వీరావు నవ్వుతూ ఫ్లాస్క్‌లోని టీని కప్పుల్లో పోసి. ఒక కప్పుని టెంపోకి అందించాడు. టీ ముగించి సిగెరెట్ వెలిగించి టెంపో ఇన్‌స్పెక్టర్‌వైపు చూశాడు.

"నేను సేకరించిన సమాచారం ప్రకారం గజరాజు దోచి దాచుకున్న లక్షరూపాయల్ని చాకచక్యంగా వసూలు చేసింతరవాత శివరామ్ ఇంతవరకూ మరోనేరం చేయలేదనే అనుకోవాలి...."

"గురూ, అతని పేరు శివరామ్ అని నీకెలా తెలుసు?" ఇన్‌స్పెక్టర్ పృథ్వీరాప్ అడ్డొస్తూ అడిగాడు.

"మంచి ప్రశ్న అడిగావ్! పోలీసులదాకా వెళ్ళి. డిఫమేషన్ లెవల్‌దాకా పాకిన రెండు కేసుల్లో అతను శివరామ్ పేరునే వాడుకున్నాడు. ముందుగా, కట్టుదిట్టంగా అంతా ప్లాన్‌చేసి. కేసు ఏయే మలుపు తిరిగి ఎలా ముగిసిపోవాలో నిర్ణయించుకునే అతను, కేసు స్వభావాన్నిబట్టి తన పేరుని మార్చుకున్నట్టు తోస్తోంది. పోలీసు రికార్డుల్లోకో కోర్టు రికార్డుల్లోకో పేరు యెక్కుతుందని అతను నిర్ణయించుకున్నప్పుడు శివరామ్ పేరు ఉపయోగించాడు. దీన్నిబట్టి

అదే అతని అసలు పేరు అయ్యుండాలి...."

"ఐసీ...." ఇన్స్పెక్టర్ పృథ్వీరాప్ తల పంకిస్తూ అన్నాడు.

"యూసీ, పృథ్వీ, శివరామ్ వేటాడుతూ నీ అడవిలోకి ప్రవేశించాడని నాకు అనిపిస్తోంది...."

ఇన్స్పెక్టర్ పృథ్వీరాప్ ఉలిక్కిపడుతూ, బొమలు ముడేసి చూశాడు.

"ఎ జంగానా?"

"రానిమండ్రి వెళ్ళాను. గజరాజుని తన మేథాశక్తి అనే అంకుశంతో పొడిచి, టోపీవేసిన రంగారావు శివ రామ్ అని తేల్చుకున్నాను. గజరాజు ప్రియురాలు శివ రామ్ ఫోటోని రంగారావుగా గుర్తించింది. అతని ఫోటోని పట్టుకుని తప్పిపోయిన తమ్ముడి కోసం వెతుకు తూన్నట్టు రాజమండ్రి అంతా చెడతిరిగాను. రైల్వే స్టేషన్లో ఒక పోర్టర్ శివరామ్ని గుర్తుపట్టాడు...."

"అక్కణ్నుంచీ అతనిక్కడికి వచ్చాడా?" పృథ్వీరాప్ కంఠంలో ఆతృత. ఆశా కలిసి ధ్వనించాయి.

"ఊటీ...."

"అయితే...." ఇన్స్పెక్టర్ పృథ్వీరాప్ యేదో చెప్ప బోయాడు.

"తొందరపడుతున్నావ్! పోలీస్ డాగ్లా వాసన పట్టు కుంటూ నేనూ ఊటీ వెళ్ళాను. వారం రోజులదాకా భార్యా సమేతంగా శివరామ్ హోటల్ హిల్వ్యూలో వున్నాడు. తరవాత మైసూరూ, అక్కణ్నుంచీ బెంగళూర్ చేరు కున్నాడు. అతని మార్గాన్ని నేనూ అనుసరించాను. బెంగ ళూర్ టూ తిరుపతి!" బెంవో నవ్వుతూ అన్నాడు.

"గుమా, అతను యిక్కడికి ఎప్పుడొచ్చాడు"? ఇన్

స్పెక్టర్ పృథ్వీరావ్ ప్రశ్నించాడు.

"నా అంచనా వారం రోజులు...."

"వారం రోజులప్పుడు యిక్కడికి వచ్చిన వ్యక్తి యింకా యిక్కడే వుంటాడనుకోలేం...."

టెంపో చిన్నగా నవ్వాడు "నేను అనుకుంటున్నా: అతను చేసిన ప్రతి నేరమూ చక్కగా, పకడ్బందీగా ప్లాన్ చేయబడింది. తన తెలివికి బలి చేయబోయే వ్యక్తిని నెమ్మదిగా, క్షుణ్ణంగా పరిశీలించి, అతని బలహీనతనీ, తత్వాన్నీ గ్రహించి నాటకం నడిపించి, విజయవంతంగా క్లైమాక్స్‌కి తీసుకెళ్తున్నాడతను. అతని ప్లానింగూ, వోపికా నాకు బ్రిటన్‌లో గ్రేట్ ట్రెయిన్ రాబరీ సాగించి చరిత్ర సృష్టించిన పియర్స్‌ని గుర్తుకు తెస్తున్నాయి: అంచేత వారంరోజుల క్రితం తను యింకా వేటాడని అరణ్యం—తిరపతి—చేరుకున్న అతను తన నెక్స్‌ట్ విక్టిమ్‌ని మైక్రోస్కోప్‌తో పరిశీలిస్తూ యేదో బ్రహ్మాండమైన పథకం తయారుచేయడంలో మునిగివున్నాడని నా నమ్మకం...."

ఇన్‌స్పెక్టర్ పృథ్వీరావ్ ఇబ్బందిగా కదిలాడు. "అతను యిక్కడికి చేరుకున్నాడన్న నీ వాదనకి మరేదేనా ఆధారం వుందా?"

టెంపో తన జేబులోంచీ ఒక కాగితాన్ని తీసి ఇన్‌స్పెక్టర్ పృథ్వీరావ్‌కి అందించాడు.

"ఇంతవరకూ అతను నేరాలు చేసిన ప్రదేశాలని చూపించే మ్యాప్ అది. తిరపతికి చుట్టూవున్న వివిధ పట్టణాల్లో అతను తన ప్రభావాన్ని చూపిస్తూ వచ్చాడు. అన్నీ బాగా డబ్బున్న వ్యాపారస్థులున్న స్థానాలే. ఆ ప్రాంతాలన్నింటికీ వున్న స్థానం ఆర్థికంగా తిరపతికీ వుంది. ఇంత

వరకూ అతను తిరపతిలో తన ప్రతాపం చూపలేదు. శివ రామ్ బుర్రతో నేరాలు చేస్తున్నాడు. బుర్రతోనే అతని మూవ్‌మెంట్స్‌ని మనం ఫాలో అవ్వాలి. నేను ఫాలో అవుతున్నా. నిజం చెప్పాలంటే అతనిలోకి పరకాయ ప్రవేశం చేసి, ఆలోచిస్తున్నా! ఇందాకటి నాటకాల సీన్లకి మధ్యలోవున్న తిరపతిలో అతను ఈసారి తన పంజా విప్పుతాడు.

ఇన్‌స్పెక్టర్ పృథ్వీరాజ్ కంగారుగా చూస్తూ లేచి నిల బడ్డాడు. మెరుస్తున్న కళ్ళతో సూటిగా టెంపో కళ్ళలోకి చూశాడు. "టెంపో, యూ ఆర్ కరెక్ట్! నువ్వు చెప్పింది తాత్కాలికంగా చక్కగా వుంది. నా పరిధిలో అతని ఆట సాగనివ్వను! తిరపతిని దువ్వేద్దాం!" అంటూ అతను బెల్ నొక్కాడు.

కానిస్టేబుల్ ప్రత్యక్షమయ్యాడు. ఇన్‌స్పెక్టర్ అతనికి యేదో చెప్పబోయాడు.

"పృథ్వీ, ఫస్ట్ ఆర్డర్ సమ్ కాఫీ!" అన్నాడు టెంపో నవ్వుతూ.

టెంపోవేపు ఆశ్చర్యంగా చూసి, అర్థమైందా అన్నట్టు కానిస్టేబుల్‌ని చూశాడు ఇన్‌స్పెక్టర్ పృథ్వీరాజ్. కానిస్టే బుల్ నిష్క్రమించాడు.

"పృథ్వీ, శివరామ్‌లాంటి నేరస్థుల్ని రెడ్‌హాండెడ్‌గా పట్టుకోవాలి! అప్పుడే అతనిలాంటి వాళ్ళకి సరైన గుణ పాఠం చెప్పగలం. అతని అడ్వెంచర్సన్నీ అతన్ని మరకత్తిగా చూపిస్తున్నాయి. కాకీ యూనిఫామ్‌మీద అతని కన్ను స్పెషల్‌గా వుంటుంది. మీ వాసన తగిల్తే అతను ఎండలో మంచులా అదృశ్యమైపోతాడు. వల విసిరే ముందే సముద్రంలోకి జారుకుంటాడు!" గంభీరంగా

అన్నాడు.

పృథ్వీరావ్ మెల్లిగా కుర్చీలో కూచున్నాడు. "గురూ, అయితే ఏం చేద్దామంటావ్?"

"అతను తన విక్టిమ్ కోసం వెతుకుతూ ప్లాన్ చేసినట్టే అతనికోసం వెతుకుతూ నేను ప్లాన్ చేస్తాను. ఎవ్వరికీ యే మాత్రం అనుమానం రాకుండా అతన్ని అన్వేషిస్తాను. అతను వేయబోయే యెత్తుకి పై యెత్తు వేస్తాను...."

"నువ్వు అనుకున్న విధంగా—మాటవరసకి—అతను మరో అడ్వెంచర్ ప్లాన్ చేయకపోతే అతన్ని రెడ్ హాండెడ్‌గా పట్టుకోలేంగా?" ఇన్‌స్పెక్టర్ పృథ్వీరావ్ అడ్డొస్తూ అన్నాడు.

"నీ డ్యూటీ చేయకుండా నువ్వు ఎలా వుండలేవో, తన నేరాలచేరం చేయకుండా అతను ఉండలేడు!" టెంపో నవ్వుతూ అన్నాడు.

ఇన్‌స్పెక్టర్ చిరునవ్వు నవ్వాడు. "ఓకే....నీ యిష్టం...."

"ఇరవై నాలు గ్గంటలూ యిక్కడే ఫోన్ ముందు కూచో. ఏ క్షణంలో అయినా ఫోన్ చేస్తాను. దూసుకు రావడానికి సిద్ధంగా వుండు!" టెంపో నవ్వుతూ అన్నాడు. ముందుకి వంగి ఇన్‌స్పెక్టర్ ముందున్న ఫోటోల్ని, కాగితాన్నీ అందుకుని జేబులో వడేసుకున్నాడు.

కానిస్టేబుల్ టీ కప్పుల్తో ప్రత్యక్షమయ్యాడు.

7

తలుపుమీద అతని వేళ్ళకణుపులు టక్‌ట్—టక్ అంటూ మూడుసార్లు చప్పుడు చేశాయి.

తలుపు తెరుచుకోడాన్ని ఎదురుచూస్తూ అతను పొడు

గాటి కారిడార్ని ఒకసారి చూశాడు. కారిడార్ నిర్మాను ష్యంగా వుంది.

చిన్న శబ్దంతో తలుపు తెరుచుకుంది.

నూరీ డ్రెస్‌లో వున్న లత అతన్ని చూసి పొద్దుతిరుగుడు పువ్వులా నవ్వింది. నూరీ హెచ్చువేత వేస్తున్న ఆమె అందాన్ని తనివితీరా చూస్తూ శివరామ్ అలాగే నిలబడిపోయాడు. లత నవ్వుతూ చెయ్యి పట్టుకుని అతన్ని గదిలోకి లాగింది. తలుపుమూసి గొళ్ళెంపెట్టి, అతన్ని దాటి ముందుకు నడవసాగింది.

శివరామ్ ఆమెను మంత్రముగ్ధుళ్ళా అనుసరించాడు. లత మంచంమీద, చంద్రహారం సినిమాలో సావిత్రిలా పక్కకి తిరిగి. తలకిందికి చేతిని చేర్చి పడుకుంది. శివరామ్ దగ్గరగా అడుగులేశాడు. లత చిలిపిగా నవ్వుతూచూసింది.

"డార్లింగ్, అక్కడే కూచో. నా దగ్గరగా రాకు! ఏం చేసుకొచ్చావో ముందు చెప్పు" అంది.

శివరామ్ నవ్వుతూ ఆమె ఎదురుగా కుర్చీలో కూచున్నాడు. జేబులోంచీ సిగరెట్ తీసి వెలిగించి పొగ వదిలాడు. లత అతన్నే రెప్పవేయకుండా చూస్తోంది.

"రంగం సిద్ధంచేశాను. రాత్రి పదకొండింటికి నాటకం విజయవంతంగా ముగుస్తుంది!" శివరామ్ నవ్వుతూ అన్నాడు.

"పొడిపొడిగా వొద్దు; విడమరచి చెప్పు!" లత నవ్వుతూ అంది.

"గోపీ రాధికల పెళ్ళి చేయించినప్పుడు ధరించిన ఇన్స్‌పెక్టరమ్మ యూనిఫామ్‌ని ఇవాళ రాత్రికి మళ్ళీ ధరించాలి నువ్వు!"

లత ప్రశ్నార్థకంగా చూసింది.

"మనతో బేరం చేయడానికి అతను ఒప్పుకున్నాడు. రాత్రి పదకొండుకి అతను నన్ను ఇక్కడ కలుసుకుంటాడు. తను తెచ్చింది నాకు ఇస్తాడు. నేను ఇచ్చేది పట్టుకుని వెళ్ళిపోతాడు...."

"డార్లింగ్ నువ్విలా సస్పెన్స్ క్రియేట్ చేస్తూ మాట్లాడితే. నేన్నీతో మాట్లాడను!" లత కోపం నటిస్తూ అంది.

శివరామ్ పకపక నవ్వాడు. "యాభై వేల రూపాయల మంచి నోట్లు ఇచ్చి. లక్షరూపాయల దొంగనోట్లు తీసుకోడానికి చివరికి అతను అంగీకరించాడు...."

"డార్లింగ్. దొంగనోట్లు ఎక్కణ్నుంచీ తెస్తావు?" లత ఆశ్చర్యంతో ప్రశ్నించింది.

"గజరాజు ఇచ్చిన లక్షరూపాయల్ని అతనికి ఇచ్చేస్తాను!" శివరామ్ నవ్వాడు.

లత నోరు కొద్దిగా తెరిచింది. "అవి దొంగిలించబడిన నోట్లు, దొంగనోట్లు కావుగా?"

"దొంగనోట్లు కావుగనకే వాట్ని గజరాజు దగ్గర సంపాయించాను. దొంగనోట్లు కావుగనకే ఇచ్చేస్తున్నాను...."

లత ఆదరాబాదరా లేచి కూచుంది. "డార్లింగ్, పిచ్చి ఆలోచనలొస్తున్నాయా? యాభై వేలకి లక్ష ఇచ్చేస్తావా? ఏమిటిది?" తీక్షణంగా చూస్తూ అడిగిందామె.

"లోకంలో పెద్దపెద్ద వ్యక్తులకి డబ్బుపిచ్చి వున్నంత కాలం మనకి పిచ్చి ఆలోచనలు రావు! అందుకే నువ్వు యూనిఫామ్ తగిలించాలంటున్నాను. లక్షని సూట్‌కేసులో సర్దుకుని అతను జారుకునే ప్రయత్నం చేస్తాడు. లిఫ్ట్ ఉపయోగించవద్దనీ, మెట్లమ్మట దిగి వెనకున్న ఇరుకు సందులోకి జారుకుని, మాయమైపొమ్మనీ అతనికి సలహా

ఇస్తాను. చీకటిగా వున్న ఇరుకు సందులో నువ్వు సిద్ధంగా వుంటావు. నీ యూనిఫామ్, నీ చేతిలోని అలిషర్ టాయ్ పిస్టల్ అతన్ని గడగడలాడిస్తాయి. దొంగనోట్లు చేతులు మారుతున్నట్టు ఇన్ఫర్మేషన్ వచ్చిందనీ, లొంగిపొమ్మనీ నువ్వు అతన్ని హెచ్చరిస్తావు....''

''అతనేం చేస్తాడో....?'' లత సందేహిస్తూ అంది.

''మూడొంతులు అతను పరుగెట్టుకు వెళ్ళే ప్రయత్నం చేస్తాడు. ఈలోగా సూట్ కేస్ హాండిల్ని నువ్వు పట్టుకుంటావు. దొంగనోట్ల కేసులో ఇరుక్కొని, పరువు పోగొట్టుకుని జెయిలు పాలవడంకన్నా యాభై వేలని మరిచిపోడం నయంగా భావించి అతను సూట్ కేస్ వొదిలేసి పిక్కబలం చూపుతాడు. నేలమీద టకటక బూట్లు శబ్దం చేస్తూ ఇంకా స్పీడుగా పరుగెట్టడానికి నువ్వు సాయంచేస్తావ్!'' శివరామ్ నవ్వుతూ ఆగాడు.

లత ఉద్రేకంతో చూసింది. ''ఆ తరవాత?''

''ఆ తరవాత నువ్వు మెల్లెక్కి ఇక్కడికొస్తావ్. ఇక్కడ మూటా ముల్లే సర్దేసి నేను టేకాఫ్‌కి రెడీగా వుంటాను!'' శివరామ్ నవ్వుతూ ముగించాడు. లత ఆనందంతో ఉక్కిరి బిక్కిరవుతూ చూసింది.

ఒక్క ఉదుటున మంచంమీంచీ లేచి, పరుగెడుతూ వచ్చి అతని వొళ్ళో వాలింది. ఆమె చేతులు అతని మెడ చుట్టూ అల్లుకున్నాయి.

8

200 నంబరు గదిలో శివరామ్ సోఫాలోంచీ లేచాడు. తలుపుమీద ఎవరో తట్టుతున్నారు. ఠీవిగా నడుస్తూ వెళ్ళి శివరామ్ తలుపు కొద్దిగా తెరిచాడు. బైట నిలబడ్డ గుప్తాని చిరునవ్వుతో చూస్తూ తలుపు మరికొంచెం తెరిచాడు.

గుప్తా బ్రీఫ్ కేస్‌తో లోపలికి ప్రవేశించాడు.

తలుపు మూసి, గొళ్ళెంపెట్టి శివరామ్ గది మధ్యగ నడిచి సోఫా ముందు నిలబడ్డాడు. గుప్తాని కూచోమన్నాడు. సోఫాలో కూచున్న గుప్తా తలెత్తి శివరామ్‌ని అదోవిధంగా చూశాడు. అతని మొహంనిండా చెమటలు కమ్మాయి.

"మిస్టర్ గుప్తా, మీరు భయపడుతున్నారు!" శివరామ్ నవ్వుతూ అన్నాడు.

గుప్తా బలవంతంగా చిరునవ్వు నవ్వాడు. "ఇలాంటి కార్యం చేయడం నాకు ఇదే మొదటిసారి! మిస్టర్ ఓంకార్, నాకేం ప్రమాదం రాదుగా?"

శివరామ్ చిన్నగా నవ్వాడు. "బ్లేడుకి భయపడితే మీరు షేవింగ్ చేసుకోలేరు! డబ్బు కావాలంటే ధైర్యంగా సాధించాలి! నిన్నటి నుంచీ మీరు యాభై శాంపిల్ నోట్సుని వివిధ బాంక్సుకి పంపించి ట్రైచేశారు. వాటిని ఎవరూ పోల్చుకోలేదు! నిర్భయంగా ఉండండి. అదిరే మనిషికి డబ్బెప్పుడూ ఆమడల దూరంలో వుంటుంది!"

గుప్తా అర్థమైనట్టు చిన్నగా నవ్వాడు. శివరామ్ చెయ్యి చాచాడు. గుప్తా వొళ్ళోపెట్టుకున్న బ్రీఫ్ కేస్ తెరిచి వంద రూపాయల నోట్లకట్టల్ని శివరామ్‌కి అందించాడు. వాట్ని పరిశీలించి, శివరామ్ మంచంవైపు నడిచాడు. నోట్లకట్టల్ని మంచంమీద పడేసి, కిందికి వొంగి బ్రీఫ్ కేసుని ఇవతలికి లాగాడు.

టీపాయ్‌మీద పెట్టి, బ్రీఫ్ కేస్‌ని తెరిచాడు. "మిస్టర్ గుప్తా, లెక్కెట్టుకోండి ఎన్‌లాక్!" అన్నాడు నవ్వుతూ.

గుప్తా నోట్లకట్టల్ని ఉక్కిరిబిక్కిరవుతూ చూశాడు. వణుకుతున్న చేతుల్తో కట్టల్ని ఎంచుకుంటూ తన బ్రీఫ్ కేసులో పెట్టుకున్నాడు. నవ్వుతూ లేచి నిలబడ్డాడు.

శివరామ్ అతన్ని మెచ్చుకుంటున్నట్టు చూశాడు.

"మిస్టర్ గుప్తా క్షేమంగా వచ్చారు; లాభంతో వెళ్తున్నారు! లిఫ్ట్ వుపయోగించకండి. మెట్లమ్మట హోటల్ వెనకభాగానికి వెళ్ళండి. వెనక సందులోకి వున్న గేటు తెరిచి వుండేలా యేర్పాటు చేశాను. గేటు మూసుకుంటూ ఆ సందమ్మట మామూలుగా నడిచి వెళ్ళిపొండి. కంగారు ప్రదర్శించకండి!" అన్నాడు నవ్వుతూ.

"సందమ్మట ఎందుకు? చీకటి. మామూలుగానే వెళతాను" గుప్తా మెల్లిగా అన్నాడు.

"హోటల్లోంచీ బ్రీఫ్ కేస్‌తో వెళ్తూంటే హోటల్‌వాళ్ళు సందేహిస్తారు. మిమ్మల్ని ఈ క్షణంనుంచీ అనుమానించే కళ్ళు చూడకూడదు! దొడ్డిదారి ఇప్పుడు మీకు దొడ్డదారి! వెళ్ళండి. గుడ్‌లక్!" అన్నాడు శివరామ్ అతని చేతిని ఊపుతూ.

"థాంక్స్, మిస్టర్ ఓంకార్ ...." అంటూ గుప్తా గుమ్మం వైపు గడిచాడు. శివరామ్ తలుపుదాకా అతన్ని సాగనంపి, తలుపు మూసి గొళ్ళెం పెట్టేశాడు. గబగబా మంచం దగ్గరగా వెళ్ళి నోట్లకట్టల్ని బ్రీఫ్ కేసులో సర్దేశాడు.

పావుగంట గడిచింది.

సగంకాలిన సిగరెట్ పీకని మంచం కిందికి విసిరి శివరామ్ అసహనంగా కదిలాడు. వాచీ చూసుకున్నాడు. ఆమె ఈపాటికి గది చేరుకుని వుండాలి: ఆలోచిస్తూ జేబులోంచీ మరొక సిగరెట్ తీసి వెలిగించాడు.

తలుపుమీద వేళ్ళకణుపులు చప్పుడు చేశాయి. శివరామ్ ఉషారుగా లేచాడు. పెద్ద పెద్ద అంగల్లో సమీపించి, గొళ్ళెం లాగి, తలుపుని కొద్దిగా తెరిచాడు. తలుపు బలంగా తోయబడింది. అప్రయత్నంగా శివరామ్ ఒక అడుగు వెనక్కి

వేశాడు.

గదిలోకి జొరబడ్డ టెంపో తలుపుమూసి. దానికి ఆను కుని నిలబడ్డాడు. చిరునవ్వుతో శివరామ్ వైపు చూశాడు. శివరామ్ కళ్ళల్లో ఆశ్చర్యం కొట్టొచ్చినట్టు కనిపిస్తోంది. అతని పెదవులు కదిలాయి.

9

"శివరామ్...." టెంపో మెల్లిగా అన్నాడు.

శివరామ్ కళ్ళు చిట్లిస్తూ చూశాడు. "వాటీస్ దిస్? గెటౌట్!" కోపంగా అరిచాడతను.

టెంపో చిరునవ్వు నవ్వాడు. "లోపలికి వస్తే, బైటికి వెళ్ళడం కోసంకాదు శివరామ్!" ఫుల్ సూటులో హుందాగా వున్న శివరామ్‌నే సూటిగా చూస్తూ అన్నాడు.

"నా పేరు ఓంకార్; శివరామ్‌కాదు! గెట్‌లాస్ట్!" శివరామ్ గద్దించాడు, అప్రయత్నంగా ఒక అడుగు ముందుకి వేస్తూ.

"మనోహర్, రామ్మోహన్, సులోచనారావ్, రంగా రావ్, ఆనందరావ్, ఓంకార్—ఏ పేరుతో నువ్వు పిలవ మంటే ఆ పేరుతోటే పిలుస్తాను. శివరామ్!" టెంపో నవ్వుతూ అన్నాడు.

శివరామ్ నమ్మలేనట్టు చూశాడు. సృష్టిలోని ఆశ్చర్య మంతా అతని మొహంమీద రాసిపోసినట్టుంది. అసంక ల్పితంగా వెనక్కి జరిగాడు. అతని కనుబొమలు మెలికలు తిరిగి మధ్యలో కలుసుకున్నాయి. రెప్పవేయడం మరిచి పోయి. అతను తనముందు చిరునవ్వుతో ఠీవిగా నిలబడ్డ టెంపోని చూస్తూ ఉండిపోయాడు.

వేరు వేరు అరణ్యాలనుండీ వస్తూ, మార్గమధ్యంలో

మరో అడవిలో ఎదురెదురైన సింహాల్లా ఇద్దరూ ఒకర్నొకరు చూస్తూ వుండిపోయాడు. శివరామ్ తెప్పరిల్లాడు.

"హూ ఆర్ యూ?" అతని కంఠం సన్నగా కఠినంగా ధ్వనించింది.

"డిటెక్టివ్ టెంపో పేరు విన్నావా?" టెంపో నవ్వుతూ అన్నాడు.

శివరామ్ కళ్ళల్లో ఏదో మార్పు రంగుమారినట్టు వచ్చింది. అతని కుడిచెయ్యి కోటు జేబులోకి వెళ్ళింది. టెంపో, తన కుడిచేతిని కోటుజేబులోకి పోనిచ్చాడు. శివరామ్ చెయ్యి సిగరెట్‌పాకెట్‌తో ఇవతలికి వచ్చింది. టెంపో చేతిని అలాగే వుంచుకున్నాడు. సిగరెట్ వెలిగించి పొగ వూదుతూ శివరామ్ టెంపోవైపు తీక్షణంగా చూశాడు. అతని కళ్ళు ఎర్రగా వున్నాయి.

"మిస్టర్ టెంపో, మీరు ఇందాకా ఏవో పేర్లుచెప్పారు. ఆ పేర్లకి అర్థమేమిటో, మీ రెందుకిలా నా గదిలోకి దౌర్జన్యంగా జొరబడ్డారో నాకు అంతు పట్టడంలేదు...."

"శివరామ్, నువ్వు యథార్థాన్ని ఎదుర్కొంటావనుకున్నాను. అయామ్ సారీ. నిన్ను వోవర్ ఎస్టిమేట్ చేశాను!" టెంపో నవ్వుతూ చూశాడు!

శివరామ్. కళ్ళు చిట్లించాడు. "మీ అర్థం?"

"ఏయే పేర్లు ఉపయోగించి, ఏయే వూళ్ళల్లో ఏయే పేర్లున్న వ్యక్తుల్ని మోసం చేశావో చెప్పమంటావా దయానంద్?" టెంపో నవ్వుతూ అన్నాడు. శివరామ్ నిట్టూర్చడం అతనికి కనిపించింది.

శివరామ్ వెనక్కి జరిగి. సోఫాలో కూచున్నాడు. అతనికి అయిదడుగుల దూరంలో టెంపో ఠీవిగా నిలబడ్డాడు.

"అద్భుతమైన తెలివితో బ్రహ్మాండగా ప్లాన్‌వేసి, యెంతోమందికి టోపీ వేశావు. నీ తెలివికి బలైపోయి, నీకు నవ్వుతూ ముడుపు చెల్లించిన ప్రతివ్యక్తీ కుళ్ళికుళ్ళి యేడుస్తున్నాడు. చివరికి నీ ఆటకట్టయింది శివరామ్!" టెంపో గంభీరంగా అన్నాడు.

సిగరెట్ ఊదుతూ శివరామ్ నిర్లక్ష్యంగా చూశాడు. "మిస్టర్ టెంపో. వాళ్ళలోని దురాశ వాళ్ళని మోసం చేసింది; ఏడిపిస్తోంది. నేను నిమిత్తమాత్రుణ్ని"

"వేదాంతం జోడిస్తే నీ మాటలకి విలువ పెరుగుతుం దనుకుంటున్నావా? అమాయకుల్ని నమ్మించి దోచు కున్నావ్...."

శివరామ్ చిన్నగా నవ్వాడు: "దోపిడీ: పని చేసేవాడి కష్టాన్ని, చెమటనూ రూపాయలుగా మార్చుకొని, బల హీనుల్ని ఎక్స్‌ప్లాయిట్ చేసే మనుషు లున్నంతకాలం, ఈజీ మనీ కోసం అత్యాశతో అర్రులు చాచే ధనవంతులు వున్నంత కాలం—వాళ్ళ అత్యాశల్ని, బలహీనతల్ని డబ్బుగా మార్చుకునే తెలివైనవాళ్ళు పుట్టుకొస్తూనే వుంటారు మిస్టర్ టెంపో!"

టెంపో నవ్వుతూ చూశాడు. "డబ్బుని విపరీతంగా సంపాయించి బ్లాక్ చేయడం యెంత నేరమో, దాన్ని నీలాగా కొల్లగొట్టడం కూడా అంతే నేరమే! నేరస్థుడు కలకాలం తప్పించుకుంటూ వుండలేడు!"

శివరామ్ పకపకా నవ్వాడు. "పోలీసుల మధ్య నుంచీ, జెయిళ్ళలోంచీ. చివరికి కోర్టునుంచీ కూడా నేను చాలా సార్లు తప్పించుకున్నాను మిస్టర్ టెంపో! మీరు నన్ను బంధించి వుంచలేరు!" సగర్వంగా అన్నాడతను.

టెంపో అతన్ని తీక్షణంగా చూశాడు. "నీకు తెలీదు.

ఈసారి ఉవ్వు రెడ్‌హాండెడ్‌గా పట్టుబడ్డావ్!''

శివరామ్ కళ్ళు చిట్లిస్తూ చూశాడు. ఓరగా వోసారి తలుపువైపు చూశాడు. "మిస్టర్ టెంపో, మీరు పొరబడుతున్నారు. నేను యే నేరమూ చేయలేదు. మీరు నన్ను రెండ్‌హాండెడ్‌గా పట్టుకోలేరు!'' అన్నాడు కంఠం బాగా హెచ్చించి.

టెంపో అతన్ని తదేకంగా చూశాడు. "యాభై వేల రూపాయల అసలు నోట్లకి నువ్వు లక్షరూపాయ అసలు నోట్లే గుప్తాకి యిచ్చావ్: నీ పార్టనర్ లత ఇన్‌స్పెక్టరమ్మ వేషంలో ఆతన్ని బెదిరించి ఆ నోట్లకట్టలున్న బ్రీఫ్‌కేసుని లాక్కుంది! ఈ ప్లానంతా నీ కంఠంలో నా టేప్‌మీద వుంది, ప్రక్కగదిలో. ఈ నేరం మూలంగా నీకు చిల్లిగవ్వ కూడా నష్టం కాదు! అసలు నోట్లని నకిలీ నోట్లుగా భావించిన గుప్తా....''

శివరామ్ తటాలున లేచాడు. నిప్పులతో నిండిన గరిటల్లా వున్న కళ్ళతో క్షణకాలం టెంపోని చూశాడు. మెల్లిగా, ఆతని పెదవులు చిరునవ్వుతో విచ్చుకొన్నాయి.

"మిస్టర్ టెంపో, మీకు యెంతో కొంత తెలుసని అంగీకరిస్తున్నా....'' శివరామ్ యేదో చెప్పబోయాడు.

"శివరామ్, నాకు నీ కథ అంతా తెలుసు।'' టెంపో సగర్వంగా అన్నాడు.

కత్తికొనల్లా తళుక్కుమంటున్న కళ్ళతో శివరామ్ అతన్ని చూశాడు. "గుప్తా యిక్కడ వదిలేసిన యాభైవేలూ మీకు యిచ్చేస్తాను. మీరు డబ్బుకోసమే ప్రైవేట్ ఐగా పని చేస్తున్నారనుకుంటా....''

"నీలా మనిషి డబ్బుకోసమే అన్ని పనులూ

చేయడు!"

"ఆల్‌రైట్....ఆ యాభై వేలూ తీసుకెళ్ళండి. నన్ను మరిచిపోండి...." అంటూ శివరామ్ వెనుదిరిగి మంచం వైపు రెండడుగులు వేశాడు. వొంగి బ్రీఫ్‌కేస్‌ని అందుకున్నాడు. పైకి లేస్తూ మెల్లగా వెనుదిరిగాడు. టెంపో దృష్టి శివరామ్ మీద లేదు. అతని కళ్ళు శివరామ్ చేతిలోని బ్రీఫ్‌కేస్‌మీదే వున్నాయి. శివరామ్ చెయ్యి మెరుపులా కదిలింది. బ్రీఫ్‌కేస్ చక్రంలా గిర్రున తిరుగుతూ టెంపో తలవైపు దూసుకొచ్చింది.

టెంపో పక్కకి జరగలేదు. కోటుజేబులోంచి కుడి చేతిని తియ్యలేదు. పాముపడగలా పైకి లేచిన టెంపో ఎడమచేతివేళ్ళు అడుగు దూరంలో నే బ్రీఫ్‌కేస్ హాండిల్‌ని బలంగా పట్టుకున్నాయి. అదేక్షణంలో అతని కళ్ళు వోరగా చూశాయి. తలుపువేపు గాలిలా దూసుకెళ్తున్నాడు శివరామ్.

టెంపో ఎడమచెయ్యి స్ప్రింగ్‌లా కదిలింది. లిప్తపాటులో అతని చేతిలో పుట్టిన కండరశక్తి బ్రీఫ్‌కేస్‌ని రివ్వున శివరామ్ వెంట రువ్వింది. తలుపుని చేరుకోబోతున్న శివరామ్ మెడని బ్రీఫ్‌కేస్ బలంగా తాకింది. తూలిపడబోతూ నిలదొక్కుకుని శివరామ్ హాండిల్ని తిప్పుతూ తలుపుని బలంగా లాగాడు. గుమ్మంలోంచి బైటికి గెంతేయబోతున్న అతను అతిప్రయత్నంమీద ఆగిపోయాడు.

చివాల్న వెనుదిరిగాడు. అతని కళ్ళల్లో ఆశ్చర్యం చెక్కిన శిల్పంలా స్పష్టంగా అవుపిస్తోంది. కళ్ళతోబాటు అతని నోరు కొద్దిగా తెరుచుకుంది.

టెంపో గదిమధ్య నిలబడి అతనివైపు నవ్వుతూ

చూస్తున్నాడు, అతని చేతిలో గురిపెట్టబడిన రివాల్వర్ లైట్ కాంతిలో తళుక్కుమంటోంది.

శివరామ్ విగ్రహంలా నిలబడిపోయాడు. అతని భుజం మీద ఎవరిదో చెయ్యి బలంగా, బరువుగా పడింది. యూనిఫాంలో వున్న పోలీస్ ఇన్‌స్పెక్టర్ అతన్నే వోరగా కఠినంగా చూస్తున్నాడు.

వణకుతున్న చేతివేళ్ళు చల్లగా అతని ఎడమ చేతిని చుట్టాయి. రెప్పలు దించి. పోలీసు వేషంలో వున్న లతని కళ్ళ కొనసల్లోంచీ చూశాడతను.

తలుపు మూయబడింది. ఆరుగురు కానిస్టేబుల్స్ శివరామ్ లతల చుట్టూ నిలుచున్నారు. ఇన్‌స్పెక్టర్ పృథ్వీరావ్ శివరామ్ ముందుకి జరిగి ఠీవిగా నిలబడ్డాడు. టెంపో వాళ్ళ దగ్గిరగా జరిగాడు. ఇన్‌స్పెక్టర్ చేతిలోని బేడీలు శివరామ్‌నీ. లతనీ కలుపుతూ వాళ్ళ చేతుల చుట్టూ బిగుసుకున్నాయి.

"ప్రముఖ వ్యాపారస్థుడు గుప్తాను మోసంచేసి అతన్నుండీ యాభై వేలు కాజేసిన నేరం మీద మిమ్మల్నిద్దర్నీ అరెస్టు చేస్తున్నా" అన్నాడు ఇన్‌స్పెక్టర్ పృథ్వీరావ్.

శివరామ్ ఇన్‌స్పెక్టర్‌ని నిర్లక్ష్యంగా వొకసారి చూసి చూపుల్ని అతని వెనక నుంచుని గర్వంగా తనవేపు చూస్తున్న గుప్తా వైపు తిప్పాడు. మెల్లిగా అతని చూపులు డిటెక్టివ్ టెంపో వైపు తిరిగాయి.

"మిస్టర్ టెంపో. చరిత్ర ఈ రోజుతో ముగిసిపోలేదు. బ్లాక్‌మనీ కోటలు కడుతూ, అనాయాసంగా వచ్చే డబ్బుకి అర్రులు చాపే మనుషులున్నంతకాలం శివరామ్‌లు వస్తూనే వుంటారు! ఆల్వేస్ రిమెంబర్ దిస్!"

టెంపో చిన్నగా నవ్వాడు. "శివరామ్, గుడ్‌బై!"

అన్నాడు అతని కళ్ళలోకి చూస్తూ.

ఇన్స్పెక్టర్ పృథ్వీరాప్ కదిలాడు. పోలీసులు శివ రామ్‌నీ, లతనీ గదిలోంచి బైటికి నడిపించారు. గదిలో వున్న శివరామ్ వస్తువులన్నింటినీ లిస్టు తయారుచేసి పత్రమ్మని ఇన్స్పెక్టర్ ఇద్దరు కానిస్టేబుల్స్‌కి ఉత్తరు విచ్చాడు.

"మిస్టర్ గుప్తా. ఎంతో సహకరించి. ఆరితేరిన నేర స్థుణ్ని బంధించడంలో తోడ్పడ్డారు. థాంక్స్;" పృథ్వీ రాప్ నవ్వుతూ అన్నాడు.

"ఇన్స్పెక్టర్‌గారూ, మనందరం డిటెక్టివ్ టెంపో గారికి ధన్యవాదాలు చెప్పుకుందాం!" అన్నాడు గుప్తా.

"పృథ్వీరాప్, ప్రక్క గదిలో టేప్‌రికార్డర్, కాసెట్ వున్నాయి. శివరామ్ తన నేరానికి తనే స్వయంగా సప్లై చేసిన ఎవిడెన్స్ ఆ టేపులో వుంది. టేకిట్!" అన్నాడు టెంపో.

10

ఇద్దరు ఇన్స్పెక్టర్‌లూ, ఎనమండుగురు పోలీసులూ శివరామ్‌నీ, లతనూ వాన్‌లో ఎక్కించి తీసుకెళ్ళారు. ఇన్స్పెక్టర్ పృథ్వీరాప్, డిటెక్టివ్ టెంపోని ఆప్యా యంగా చూశాడు.

"గురూ, శివరామ్‌ని అతి చాకచక్యంగా బంధించి, నా హాట్‌కి ఒక తురాయి సంపాయించి యిచ్చావ్. థాంక్స్ ఎలాట్!" అన్నాడు టెంపోతో కరచాలనం చేస్తూ. టెంపో చిన్నగా నవ్వాడు. ఇద్దరూ జీప్‌లో ఎక్కారు. ఇన్స్పెక్టర్ పృథ్వీరాప్ జీపుని స్టార్టు చేశాడు.

"నువ్వు రమ్మన్నచోటికి వచ్చాను; చెయ్యమన్నది చేశాను. ఇదంతా ఎలా ఊహించావో నేను ఊహించ

లేకుండా వున్నాను....'' పృథ్వీరావ్ నవ్వుతూ అన్నాడు. టెంపో నవ్వుతూ సిగరెట్ వెలిగించాడు.

''శివరామ్‌ని అన్వేషిస్తూ గుప్తా ఫైనాన్స్ కార్పొరేషన్ చేరుకున్నా. అక్కడికి వెళ్ళినట్టు తెలింది. గుప్తాని కలుసుకున్నా. మొదట అతను ఫోటో చూసి కూడా అతనెవరో తనకి తెలీదన్నాడు. శివరామ్ ఓంకార్ పేరుతో అతన్ని కలుసుకున్నాడు. మరో మార్గంలేక గుప్తాకి శివరామ్ నిజస్వరూపం, అతని నేరాలూ వివరించేను. అతను గుప్తాలాంటి వ్యాపారుల్ని చాలామందిని నష్టేల్లో ముంచేశాడన్నాను. అతన్ని బంధించడంలో తోడ్పడితే తనకి పెద్ద పేరొస్తుందన్నాను.

''గుప్తా అర్థం చేసుకున్నాడు. శివరామ్-ఓంకార్ తనకి యాభై వేలకి లక్షరూపాయల దొంగనోట్లు ఇవ్వబోతున్నట్టు చివరికి అతను వొప్పుకున్నాడు.

''శివరామ్ తనని రాత్రి పదకొండింటికి హోటల్ సెవెన్ హిల్స్, గది నంబరు 200 లో కల్సుకొమ్మన్నట్టు చెప్పాడు. అతన్ని జాగర్తగా వుండమని హెచ్చరించి, అతి ప్రయత్నంమీద హోటల్ సెవెన్ హిల్స్‌లో 201 నెంబరు గదికి దిగాను. శివరామ్ లతకి వివరిస్తున్న ప్లానుని రికార్డు చేశాను.

''ఆ వెంటనే నిన్ను కల్సుకున్నాను. ఏం చేయాల్సిందీ వివరించాను. మళ్ళీ గుప్తాను కలుసుకున్నాను. శివరామ్ ఒరిజినల్ ప్లాన్ వున్న కాసెట్‌ని అతనికి వినిపించాను. గుప్తా అప్పటికి నన్ను పూర్తిగా విశ్వసించి, నాటకంలో పాత్రను పోషించడానికి అంగీకరించాడు. గుప్తాకూ, శివరామ్‌కీ మధ్య జరిగిన సంభాషణ కూడా నీ జేబులో వున్న కాసెట్‌లో వుంది. ఆ తరవాత జరిగిందంతా నీకు

తెలుసు!'' టెంపో నవ్వుతూ ముగించాడు.

"ఎక్సలెంట్ బ్రెయిన్ వర్క్! కంగ్రాట్స్ గురూ!" ఇన్‌స్పెక్టర్ పృథ్వీరావ్ ఉత్సాహంగా అన్నాడు.

*   *   *

ఇన్‌స్పెక్టర్ పృథ్వీరావ్ తన ఎదురుగా కూచున్న డిటెక్టివ్ టెంపోని నవ్వుతూ చూశాడు.

"గురూ, శివరామ్ మొండిధైర్యం కలిగిన వ్యక్తి. నువ్వు వివరించిన నేరాలన్నీ తను చేసినట్టు ఒప్పుకున్నాడు. అతని తెలివికి బలయిపోయిన వ్యక్తులందర్నీ కాంటాక్టు చేశాను. తమకి పెద్ద సైజు టోపీ తగిలించిన శివరామ్‌ని వొడుపుగా బంధించిన నిన్ను వాళ్ళెంతగానో మెచ్చుకున్నారు. నిన్ను శివరామ్ మీదికి ఉసిగొలిపిన తిరపతిరావు ఎగిరి గెంతేసాడు?''

టెంపో చిరునవ్వుతో సిగరెట్ వెలిగించాడు.

"మదపుటేనుగులా స్వైర విహారం చేస్తున్న శివరామ్‌ని పట్టుకోడం దాదాపు అసాధ్యంగా అనిపించే సమయంలో....'' ఇన్‌స్పెక్టర్ యేదో చెప్పబోయాడు.

"ఎంత మదించిన ఏనుగైనా ఖెడ్డాలో పట్టుబడక తప్పదు పృథ్వీరావ్!....'' టెంపో గంభీరంగా అన్నాడు.

ఇన్‌స్పెక్టర్ పృథ్వీరావ్ ఔనన్నట్టు తలాడించాడు. "టెంపో, వాళ్ళంతా ఒక కమిటీగా ఏర్పడి నా ఆధ్వర్యంలో డిటెక్టివ్ టెంపోకి సన్మానం చేయబోతున్నారు. ఎల్లుండి యిక్కడ జరిగే సన్మానానికి అధ్యక్షత వహించడానికి ఐ.జీ. గారు ప్రత్యేకంగా వస్తున్నారు....''

"పృథ్వీ, విధినిర్వహణ చేసే వాళ్ళకి సన్మానా

లక్షల్లేదు!" టెంపో నవ్వుతూ అన్నాడు.

"అంతేకాదు....శివరామ్ చేత మూతులమీద వాతలు వేయించుకున్న షావుకార్లంతా కలిసి నీకో పర్సు ప్రెజెంట్ చేయబోతున్నారు!" ఇన్స్పెక్టర్ పృథ్వీరావ్ కులాసాగా నవ్వుతూ అన్నాడు.

టెంపో చిన్నగా నవ్వాడు. "కష్టార్జితాన్ని వద్దనలేం! లేకపోతే మనం కూడా శివరామ్‌లాగా దోపిడీలు చెయ్యాల్సి వస్తుంది!"

ఇన్స్పెక్టర్ పృథ్వీరావ్ పకపక నవ్వాడు. □

['శివరామ్ నేరాలు' ఇంతటితో సమాప్తం]

'పార్టీ' ఫండ్?



కె.వి.యస్.యస్.మూర్తి

బ్లూ బేబీ....

రఘునాథరాజు కాలుగాలిన పిల్లిలా తిరుగుతున్నాడు— వరండాలో.

లోపల డాక్టర్ సరోజినీదేవి — భార్యను పరీక్ష చేస్తోంది.

రఘునాథరాజు మనసు పరిపరి విధాల పోతోంది.

పార్వతి లోపలకు వెళ్ళి గంటదాటింది. ఏమయింది? ఇంకా పరీక్షలు పూర్తికాలేదా?....

అంతలో లోపలనుండి పిలుపు వచ్చింది—రఘునాథ రాజుకి.

లోపలకు వెళ్ళాడు. డాక్టర్ సరోజినీదేవికి విష్ చేసి కుర్చీలో కూర్చున్నాడు.

"ఎలా వుంది డాక్టర్?" అడిగాడు రఘునాథరాజు.

"షి ఈజ్ పర్ఫెక్ట్లీ ఆల్‌రైట్. కానీ—చాలా నీర సంగా వుంది."

"డాక్టర్! బిడ్డ సంగతి....?"

"నాకు తెలుసున్నంతలో—బిడ్డ ఆరోగ్యంగానే వున్నా డని చెప్పగలను."

"ప్రతీసారీ—యిలానే జరుగుతోంది. కానీ—కడుపు లోంచి బయటపడిన బిడ్డ—ఆరుగంటల కంటె ఎక్కువ బ్రతకటం లేదు. పుట్టిన ఇద్దరు పిల్లలూ—నీలం రంగుకు తిరిగి చనిపోయారు. ఏమిటి డాక్టర్? ఎందుకలా జరిగింది?" బాధగా అడిగాడు రఘునాథరాజు.

"పుట్టిన పిల్లలు—నీలంగా మారి చనిపోయారా?" అడిగింది డాక్టర్ సరోజినీదేవి.

"మొదటిబిడ్డ—పుట్టడమే నీలంగా పుట్టింది. ఆరు గంటలు బ్రతికింది. తర్వాత చనిపోయింది. రెండోసారి-మొగపిల్లాడు. పుట్టేటప్పుడు—దబ్బపండులాగానే కనిపిం చాడు. నిముషాలలో రంగు మారిపోయింది, వాడుకూడా-అలానే పోయాడు." కళ్ళు తుడుచుకున్నాడు రఘునాథ రాజు.

"ఆ డాక్టర్లేమన్నారు?"

"డాక్టర్లా! పాడా!"

"అదేం?"

"మొదటి రెండు పురుళ్ళూ—నా భార్యకు పుట్టింటి వాళ్ళే పోశారు. మొదటి పురుడు—ఒక మంత్రసాని పోసింది. ఏమి తెలియలేదు. రెండో పురుడు—ఒక రిటైర్డు నర్సు పోసింది. ఆమెకు కూడా బిడ్డ మరణం గురించి—పెద్దగా తెలియదు. కానీ ఆ తర్వాత—నా భార్యను డాక్టర్ కస్తూరికి చూపించాను."

"మీరు బిడ్డల మరణాల గురించి—ఎవరినీ అడగ లేదా?"

"లేదు డాక్టర్! అలా ఎందుకు చనిపోయారంటారు?"

"ఇటువంటి పిల్లలను—బ్లూ బేబీస్ అంటారు."

"బ్లూ బేబీస్—అంటే?"

"కొందరు శిశువులు—పుట్టటమే నీలంగా పుట్టి చని పోతున్నారు. అది—వాళ్ళలో ప్రవహించే చెడు రక్తం యొక్క ప్రభావం."

"చెడురక్తం ప్రభావమా!"

"అవును—మన గుండెలో రెండుభాగాలు వుంటాయి. ఒకటి—మంచి రక్తాన్ని కలిగియుంటుంది. మరొకటి—చెడు రక్తాన్ని. ధమనులూ, శిరలూ—ఈ రక్తాన్ని శరీర భాగాలకు సరఫరా చేస్తుంటాయి. గుండెలో వున్న రెండు అరల మధ్య—ఒక చిన్న రంధ్రం ఏర్పడుతుంది—ఈ బ్లూ బేబీస్‌లో. దానివల్ల చెడు రక్తం—మంచి రక్తంలో కలసిపోతుంది. అందువల్ల శరీరం అంతా చెడురక్తం ప్రవహిస్తుంది. అప్పుడు—ఆ బేబీ వళ్ళంతా నీలంగా మారిపోతుంది."

"అలాంటి పిల్లలు—బ్రతకరా?"

"పూర్వపు రోజుల్లో—కష్టమే. కానీ ఈ రోజుల్లో -

ఏదీ అసాధ్యం కాదు."

"అంటే!"

"అంటే—ఏముంది. పుట్టిన ఆరుగంటలలోగా ఆపరేషన్ జరగాలి. మంచి కార్డియాలజిస్టు—ఆపరేషన్ చేసి గుండెతో ఏర్పడిన రంధ్రాన్ని మూసేసి మరణాన్ని ఆపగలడు."

"అయితే నా పిల్లలను—చేతులారా చంపేశానన్న మాట!"

"అదెలా! మీకు ఈ విషయాలు తెలియకపోవటం వలన యిలా జరిగింది!"

"పోనీ మొదటిసారి—ఏదో జరిగిందనుకుందాం? మళ్లా రెండోసారికూడా - బ్లూ బేబీయే ఎందుకు పుట్టిందంటారు?" అడిగాడు రఘునాథరాజు.

"ఇదివరకు—మీ కుటుంబంలో యిటువంటి సంఘటన ఏదైనా జరిగిందా? అంటే—మీ అమ్మగార్కి గానీ మీ మామ్మగార్కి గానీ మీ బంధువులకు గానీ—యిటువంటి పిల్ల - పుట్టారా?"

"నాకు సరిగా తెలియదు. ఏం డాక్టర్? కుటుంబ చరిత్రకూ—మాకు పుట్టే బ్లూ బేబీలకూ ఏమయినా సంబంధం వుందంటారా? కారణం—అదేనంటారా?"

"అలాగని కాదు. ఏదో మీకు యిటువంటిది కాకతాళీయంగా జరిగి వుండొచ్చు."

"డాక్టర్!"

"ఊఁ! చెప్పండి?"

"డాక్టర్! ఈసారయినా—మాకు సరైన బిడ్డ కల్గుతాడంటారా?

"మంచే జరుగుతుందని ఆశిద్దాం. అయినా—ఆమెకు

రెండో కాన్పు కష్టం అయ్యింది కదా. కాన్పయినాక డాక్టర్ కస్తూరికి చూపించేరు. ఆవిడ ఏమన్నారు?"

రఘునాథరాజు తడబడ్డాడు. "అది...." నసిగాడు.

"చెప్పండి రాజుగారూ! ఎందుకు—అలా నసుగుతున్నారు?" అడిగింది డాక్టర్ సరోజినీదేవి.

"మరో యిష్యూ గురించి ఆలోచించకుండా వెంటనే ఆపరేషన్ చేయించేసుకోమన్నారు. పార్వతి ఆరోగ్యం - కాన్పుకు అనుకూలం కాదని చెప్పారు."

"మరి మీరు ఆమె సలహాను—ఎందుకు పాటించ లేదు?"

"పార్వతి అందుకు ఒప్పుకోలేదు. కడుపుతీపి!"

"ఏదో మీకు ధైర్యం చెప్పాలని అన్నాను—కానీ, నిజం చెప్పాలంటే ఆవిడ చాలా నీరసంగా వుంది. ఈ ప్రసవం అయినాక—ఇక ఆలోచించకండి. వెంటనే వాసక్టమీ చేయించేసుకోండి."

"అలానే డాక్టర్. తప్పకుండా! కానీ—ఈసారయినా పిల్లాడు బ్రతికితే!"

"తప్పకుండా! కృషి చేస్తాను."

"అదికాదు డాక్టర్. ఈసారి పుట్టేది కూడా—బ్లూ బేబీయే అయితే...."

డాక్టర్ సరోజినీదేవి రెండు నిముషాలు మౌనంగా వుండిపోయింది. చివరకు తలవూపి "అయితే—ఒకపని చేయండి" అంది.

"చెప్పండి!" అన్నాడు రఘునాథరాజు ఆత్రుతతో.

"డాక్టర్ వాయుగుంతం అని—ఈ మధ్యనే స్టేట్సు నుండి తిరిగి వచ్చారు. మీరు ఆయన్ని కలవండి. మంచి కార్డియాలజిస్టు. మీకు యిదివరకు కలిగిన—బ్లూ బేబీస్

గురించి చెప్పండి. ఆయన సలహా తీసుకోండి. మా డిస్పెన్సరీలో వున్న థియేటర్—అన్ని ఆపరేషన్లకూ అనుకూలమయిందే. ఆయన డెలివరీ టైమ్‌కు యిక్కడకు వస్తానంటే—మనం ఎక్విప్‌మెంటు సిద్ధంచేద్దాం."

"సరే డాక్టర్! అడ్రెస్సు రాసివ్వండి. మీరేమయినా-యింట్రడక్షన్ కూడా యివ్వండి. ఆయన్ను కలుసుకుంటాను" అన్నాడు రఘునాధరాజు.

డాక్టర్ సరోజినీదేవి డాక్టర్ వాయుగుండం ఎడ్రస్ వ్రాసి యిచ్చింది. దాంతోపాటు—ఒక లెటర్‌ను కూడా యిచ్చి "మీ రాయన్ని కల్సి—ఈ పుత్తరాన్ని చూపించండి. చాలా మంచివాడు. నేను ఫోన్‌కూడా చేస్తాను. ఈసారికూడా మీకు దురదృష్టవశాత్తూ బ్లూ బేబీయే పుడితే-డాక్టర్ వాయుగుండం ఒక్కరే-ఆ బేబీకి ప్రాణం పొయ్యగలరు" అంది.

రఘునాధరాజు సరోజినీదేవికి నమస్కారం పెట్టి భార్యను తీసుకుని బయటకు వచ్చేశాడు.

2

సుబ్బరాజు—సీసాలోని ద్రవాన్ని గ్లాసులోకి వంపుకున్నాడు.

నెమ్మదిగా సిప్‌చేస్తున్నాడు. ప్లేట్లోని రొయ్యల పకోడీ ఒక్కొక్కటీ అతని నోట్లోకి వెళుతోంది. ఫారిన్ విస్కీ ప్రభావం—అతని మస్తిష్కంమీద బాగా పనిచేస్తోంది.

ఎదురుగా గోడకు తగిలించిన ఫొటోలోంచి రాజారాం ప్రసాద్ మీర్జా కొడుకును కన్నార్పకుండా చూస్తున్నాడు.

సుబ్బరాజు తండ్రి ఫొటోవంక చూశాడు.

చిన్నగా నవ్వుకుంటూ విస్కీ సిప్‌చేయసాగాడు

అదే తండ్రి బ్రతికున్న రోజులలో అయితే—ఆయన

ఎదురుపడి మాట్లాడేవాడు కాడు, సుబ్బరాజు. తండ్రంటే చచ్చేటంత భయం—సుబ్బరాజుకి. ఆ భయం—రాను రానూ తండ్రిమీద కసిగా ద్వేషంగా మారిపోయింది.

మీర్జాగారు మొదటి భార్య చనిపోతే మరో పెళ్ళి చేసుకున్నాడు.

మొదటిభార్య కొడుకు — రఘునాధరాజు. రెండో భార్య కొడుకు—సుబ్బరాజు.

రఘునాధరాజు సౌమ్యుడూ, మంచివాడు. అతడంటే మీర్జాగారికి—వల్లమాలిన అభిమానం.

సుబ్బరాజుకు—చిన్నతనం నుండీ చెడు సావాసాలు అబ్బాయి. అతని కన్నతల్లి కూడా రఘునాధరాజునే అభిమానించింది.

రఘునాధరాజుకి పిల్లలు లేరు. పుట్టిన యిద్దరూ—బ్లూ బేబీలు.

సుబ్బరాజుకి మాత్రం—ఒక కొడుకు వుండేవాడు.

"ఆస్తి పంపకాలు జరిగితే—సుబ్బరాజు ఆస్తి పాడు చేస్తాడు" అని ఆలోచించి మీర్జా—పెద్దకొడుకు రఘునాధరాజు సలహామీద—ఆస్తిని కొడుకులకు పుట్టబోయే పిల్లలకు రాశాడు. రఘునాధరాజుని—ట్రస్టీగా నియమించాడు.

ఆరునెలల క్రితం—కాశీ ప్రయాణానికి మనవడిని తీసుకుని వెళ్ళిన మీర్జా దంపతులు రైలు ఏక్సిడెంట్‌లో మరణించారు.

సుబ్బరాజుకి తండ్రి ఫోటోను చూస్తే—ఎక్కడలేని కోపం వచ్చేస్తుంది.

తన కొడుకుని పొట్టన పెట్టుకున్నాడు. ఆస్తి తనకు కాకుండా చేశాడు.

గ్లాసులోని విస్కీ లోపలకు వెళుతోంది.

"ఒరేయ్! బసవా!" పిలిచాడు సుబ్బరాజు.

"అయ్!" అంటూ వచ్చాడు బసవన్న.

"అన్నయ్య విషయం—ఏమయినా తెలిసిందా?"

"అయ్! ఈ నెల 28 తారీకున—ప్రసవం అవుద్దటండి. పుట్టబోయే వోడి గురించి...."

"ఏమిటీ—తెలిసింది?"

"డాక్టరమ్మ గారు—అన్నయ్యగారికి మంచి భరోసా యిచ్చారండి. ఒకేళ తేడా పాడా వస్తే గుండాపరేసన్ చెయ్యటానికి డాక్టరు వాయుగుండం గార్ని తెత్తారట."

"సరే — నువ్వెళ్ళు!" అంటూ, ఫోన్ దగ్గరకు వెళ్ళాడు సుబ్బరాజు.

మనిషి తూలుతున్నాడు.

రిసీవరు తీసి—తనకు కావలసిన నంబరు డయల్ చేశాడు.

అటువయిపునుండి "హలో" అని వినిపించింది.

"హలో: నేను సుబ్బరాజును."

"ఊఁ!"

"అన్నయ్య మంచి ప్రయత్నంమీద వున్నాడట!"

"తెలుసు!"

"ఆ వాయుగుండం ఎలాటివాడు?"

"చాలా గట్టివాడు."

"అతని సహాయం అన్నయ్యకు అందకూడదు."

"ఏం చెయ్యను? లేపెయ్యనా?"

"ఛ! వద్దు. వదినకు డెలివరీ అయిన మరుసటి రోజు అతడిని వదిలెయ్. నా చేతులకు-మట్టి అంటుకోకూడదు."

"ఎందుకు వెధవ గోల! లేపేస్తే సరిపోదా!"

"వద్దు. అనవసరంగా హత్యలు వద్దు."

"అలా అయితే—కొంచం ఎక్కువ ఖర్చవుతుంది."

"ఎంత?"

"పదివేలు."

"చాలా ఎక్కువ! సరేకాని. ముందు పని ముఖ్యం." రిసీవరు పెట్టేశాడు సుబ్బరాజు.

ఒకవేళ అన్నయ్యకు పుట్టిన బిడ్డ బ్రతికితే—ఆస్తి ముక్కలు అవుతుంది. ఎలాసూ యిది ఆఖరుఛాన్సు—ఇక మీదట అన్నయ్యబిడ్డల గురించి ప్రయత్నం చెయ్యడు. అప్పుడు—ఆస్తి అంతా తన బిడ్డదే—

సుబ్బరాజు నెమ్మదిగా గదిలోకి అడుగులు వేశాడు.

మంచం మీద—భార్య సుజాత ఆదమరచి నిద్ర పోతోంది.

సుబ్బరాజు ఆమె ప్రక్కన కూర్చుని ఆమె కురులను సవరించాడు. నుదుటిని చుంబించాడు. ఆమె పొట్టవైపు ఆప్యాయంగా చూశాడు. చెయ్యిపేసి—పొట్టను తడివాడు "నువ్వు మీర్జా వంశానికి ఏకైక వారసుడివిరా!" అనుకున్నాడు—భార్య కడుపులోని బిడ్డను తలుచుకుని—తన భార్యగురించీ, బిడ్డగురించీ ఏమయినా చేస్తాడు.

సుబ్బరాజు అక్కడినుండి లేచాడు. ఎదురుగా గోడకు కేలెండర్ 24 తేదీ రౌండ్ చేసి వుంది—కాదు—తనే చేశాడు.

ఈ నెల 24 న సుజాతకు డెలివరీ అవుతుందని చెప్పింది డాక్టర్ సీతాదేవి. విచిత్రం—తోటి కోడళ్లు యిద్దరికీ—ఇంచుమించుగా ఒకే డేట్....

సుబ్బరాజు మళ్ళీ హాలులోకి వచ్చాడు.

విదేశీ మద్యం అతని కడుపులోకి వెళుతోంది.

3

"నమస్కారం సార్!" అంటూ లోపలకు వచ్చాడు, రఘునాధరాజు.

"యస్! ప్లీజ్!" అన్నాడు వాయుగుండం తల పైకి ఎత్తకుండానే.

"నా పేరు—రఘునాధరాజు."

"రఘునాధరాజు—అవును డాక్టర్ సరోజినీదేవి ఫోన్ చేసి చెప్పారు. కూర్చోండి."

"థాంక్యూ! డాక్టర్!" రఘునాధరాజు కూర్చున్నాడు. జేబులోంచి సీతాదేవి రాసిచ్చిన ఉత్తరాన్ని తీసి వాయుగుండానికి అందించాడు.

ఉత్తరాన్ని తీసి చదివాడు వాయుగుండం. తలపంకించాడు. "ఇదివరకటి రెండు యిష్యూలూ బ్లూ బేబీలే నన్న మాట" అన్నాడు.

రఘునాధరాజు అవును అన్నట్లు తల వూపాడు.

"ఈ మూడో యిష్యూ బ్లూ బేబీ యేమో అని ఎందుకు అనుకుంటున్నారు? ఇది వంశపారంపర్యం కాదు. మీ భార్యాభర్తల జీన్స్‌మీద యెంత మాత్రం ఆధారపడి వుండదు. ఇదివరకటి వాళ్ళిద్దరూ బ్లూ బేబీ లవటం కేవలం కాకతాళీయం. మూడోబిడ్డ బ్లూ బేబీ కావలసిన అవసరం లేదు" అన్నాడు వాయుగుండం.

ఏదో ఓదార్పు. తన జాతకంలో తన సంతానం గురించి వివరంగా వుంది. ముగ్గురు పిల్లలు—పురిటిలోనే మరణం—చావుకి ముగ్గురికి ఒకే కారణం—అందుకే వాయుగుండం చెప్పేదాన్ని—పెద్దగా లెక్క చేయలేక పోయాడు రఘునాధరాజు.

"నా భార్య చాలా నీరసంగా వుంది. మొదటి రెండు

కాన్పులూ చాలా కష్టం అయ్యాయి. మూడో ప్రయత్నం పద్దన్నాను. నా భార్య వినలేదు. కడుపున కాయ కాయాలనే తపన. అందుకు ప్రాణాన్నయినా వదులుకోవటానికి యిష్టపడింది గానీ, నన్ను వేసక్టమీ చేయించుకోనివ్వ లేదు. ఏం చెయ్యను? ఆమె మాటను కాదనలేక పోయాను.

ఈసారి యేమైనా జరిగితే ఆమె బ్రతకదు. మొన్ననే వేసక్టమీ కూడా చేయించుకున్నాను. అందుకే ఇప్పుడు పుట్టబోయే బిడ్డ గురించి—యిన్ని జాగ్రత్తలు తీసుకుంటున్నాను. బిడ్డ ఆరోగ్యంగా పుడితే సరే! కీడెంచి మేలెంచమని—ఒకవేళ పాత పద్ధతే పునరావృతం అయితే! అందుకే ముందు జాగ్రత్త కోసం మీ దగ్గరకు వచ్చాను" అన్నాడు.

వాయుగుండం తల పంకించాడు. "సరే! 23 గదా డెలివరీ డేట్? నేను వస్తాను!" అన్నాడు.

"థాంక్యూ డాక్టర్! థాంక్యూ!"

"కానీ ఒక విషయం."

"ఏమిటి సార్?"

"ఈసారి మీకు మంచి బిడ్డే కలుగుతాడని ఆశిద్దాం. ఒకవేళ పుట్టేది బ్లూబేబీ అయితే మాత్రం—నేను నూటికి నూరుపాళ్ళు గ్యారంటీ యివ్వలేను. మానవ ప్రయత్నం చేద్దాం. ఆ తర్వాత దైవేచ్ఛ."

"అలాగే సార్! నాది ఒక చిన్న అనుమానం."

"చెప్పండి!"

"డాక్టర్! సరోజినీదేవి బ్లూబేబీస్ గురించి చెప్పారు. అయినా మీ నోటినుండి కూడా ఒకసారి విందామని కుతూహలంగా వుంది."

"ఏ విషయంలో?"

"అదే సార్? పెద్దవాళ్ళకే గుండె ఆపరేషన్ చెయ్యటం కష్టం కదా! పసిగుడ్డుకు ఆపరేషన్ చేస్తే ప్రమాదం కాదా?" అడిగాడు రఘునాథరాజు.

"మీ ప్రశ్న సమంజసమయినదే. పిల్లలలో గుండెకు జరిగే శస్త్రచికిత్సలు చాల తక్కువ. పూర్వం గుండె ఆపరేషన్ పెద్ద అద్భుతం. ఈ మధ్యకాలం వరకు—చిన్న పిల్లలకు యిటువంటి శస్త్రచికిత్సలు జరుగలేదు. కానీ ఈ కాలంలో అసాధ్యం అనేదీ లేదు.

"హృదయకోశంలో యేర్పడే లోపాలను సవరించే శస్త్రచికిత్సలు జరిపేందుకు హార్ట్ లంగ్ మెషీన్ అనే పరికరాన్ని ఉపయోగిస్తారు. ఈ యంత్రం గుండె మరమ్మత్తు సమయంలో—మెదడూ, మూత్రపిండాలూ, యితర అవయవాలకూ రక్తాన్ని సరఫరా చేస్తుంది.

చిన్నపిల్లల విషయంలో ఈ పద్ధతి వుపయోగించం. ఆపరేషన్—మరో పద్ధతిలో జరుగుతుంది. ఆపరేషన్ చేయవలసిన బేబీ ఉష్ణోగ్రత 18 సెల్సియస్ డిగ్రీలకు తగ్గిస్తాం. శరీరంమీద ఐస్‌పాక్‌లను వుంచుతాం. గుండె కొట్టుకోవటం నిలిచిపోతుంది. ఈ స్థితిలో మెదడుకు గానీ యితర అవయవాలకుగానీ రక్తం అవసరం వుండదు. ఈ స్థితిలో రోగిని అరగంటసేపు వుంచవచ్చు. ఈ అరగంట లోగా ఆపరేషన్ చేసి లోపాన్ని సవరిస్తాం. అంటే హృదయాన్ని ఆపి సమాధి స్థితిలో ఆపరేషన్ చేస్తాం. ఆపరేషన్ పూర్తయితే శరీర ఉష్ణోగ్రతను నెమ్మదిగా 37° సెల్సియస్‌కు పెంచుతాం...." అన్నాడు వాయు గుండం.

ఆయనదగ్గర సెలవుతీసుకుని యింటికి బయలుదేరాడు

రఘునాథరాజు.

రఘునాథరాజు బయటకు వెళ్ళిన పది నిముషాలకు గూండాలాంటి యిద్దరు వ్యక్తులు—వాయుగుండం గది లోకి ప్రవేశించారు.

వాళ్ళవయిపు విచిత్రంగా చూసి "ఏం కావాలి?" అన్నాడు వాయుగుండం.

వాళ్ళేమీ సమాధానం చెప్పలేదు. ఒకడు వాయుగుండా నికి పిస్టల్ గురిపెట్టాడు. రెండోవాడు వాయుగుండం వెనక్కి వెళ్ళాడు.

వాయుగుండం అరవబోయాడు.

అతని వెనక్కి వచ్చిన గూండా ఒకచేత్తో అతని నోరు మూసి, రెండోచేత్తో మెడమీద ఒక దెబ్బ వేశాడు.

వాయుగుండం కిక్కురుమనకుండా తల వాల్చేశాడు.

స్పృహ కోల్పోయాడు.

దొడ్డిత్రోవన—స్పృహకోల్పోయిన వాయుగుండాన్ని మోసుకుపోయారు—ఆ గూండాలు.

4

ట్రింగ్ .... ట్రింగ్ ....

బల్లమీద వున్న ఫోన్ అదేపనిగా మోగసాగింది.

సుబ్బరాజు విసుగ్గా కళ్ళు తెరచాడు.

బల్లదగ్గరకు వెళ్ళి, రిసీవర్ తీసి "హల్లో!" అన్నాడు మగతగా.

"హలో వాయుగుండాన్ని బంధించాను!" వినపడింది అటువైపు నుండి.

సుబ్బరాజు నిద్ర ఒక్కసారిగా ఎగిరిపోయింది. "థాంక్యూ! వచ్చి డబ్బు తీసుకో!" అన్నాడు.

"ఇప్పుడు నాకు ఖాళీలేదు. అర్జెంటు పనిమీద కలకత్తా

వెళుతున్నాను. ముప్పయ్యో తారీఖు కూడా రాను. డబ్బు అటునుండి వచ్చేకా తీసుకుంటాను.''

''సరే! ఆ డాక్టర్ తప్పించుకోడు కదా?''

''నీకు అటువంటి భయం అక్కర్లేదు. ఒకసారి రాకూడదా, చూపిస్తాను.''

''వద్దులే! నీమీద నమ్మకం వుంది!''

''అది కాదు! అతన్ని దాచినచోటు తెలుసుకోవాలని నీకు కుతూహలంగా లేదా?''

''లేదు! ఆ ప్రదేశం నాకు తెలియటం మంచిది కాదు. రేపు పదిన బాధను చూడలేక నేను వాయుగుండాన్ని విడిపించవచ్చు. అప్పుడు మాకు పుట్టబోయే బిడ్డ భవిష్యత్తు యేంకాను.''

''సరే! నీకు ఈ మధ్యకాలంలో నా అవసరం యేమీ లేదు కదా!''

''లేదు!''

అవతల ఫోన్ డిస్కనెక్ట్ అయింది.

సుబ్బరాజు సిగరెట్ తీసి వెలిగించాడు.

అతని మనసంతా ఆలోచనలతో నిండిపోయింది.

5

రఘునాథరాజు హాస్పటల్ వరండాలో కాలుకాలిన పిల్లిలా తిరుగుతున్నాడు.

లోపల లేబర్ రూమ్‌లో భార్య పార్వతి నొప్పులుపడుతోంది.

రఘునాథరాజు మనసంతా ఆందోళనతో నిండిపోయింది.

డాక్టర్ వాయుగుండం ఈ రోజు వస్తానన్నాడు. కానీ రాలేదు. తీరా ఫోన్‌చేస్తే యింటికి వచ్చి మూడు రోజు

లయింవన్నారు. ఏమిటి ఇలా జరిగింది? తనకు ఈ బిడ్డ దక్కే అవకాశం కూడా లేదా? టౌన్‌లో చాలామంది డాక్టర్లకు ఫోన్ చేశాడు. కబుర్లు పంపాడు. ఎవరికీ చిన్న పిల్లల గుండె ఆపరేషన్‌తో పరిచయంలేదు. ఎవరూ ముందుకు రాలేదు. యేం చెయ్యటానికి పాలుపోలేదు. అందుకే దేవుడిమీద భారంవేసి అలా వరండాలో తిరుగుతున్నాడు.

అంతలో సుబ్బరాజు హడావుడిగా వచ్చాడు అక్కడికి....

లోపలకు హడావుడిగా వస్తున్న తమ్ముడిని చూశాడు రఘునాధరాజు.

గబగబా అతని దగ్గరకు వెళ్ళాడు. "ఏం జరిగింది?" అన్నాడు.

"సుజాతకు నొప్పులు మొదలయ్యాయి" అన్నాడు సుబ్బరాజు. అతడు అన్నగారి మొహంలోనికి సూటిగా చూడలేకపోతున్నాడు. దేవుడి లాంటి అన్నయ్యను స్వార్థంకోసం మోసం చేస్తున్నాడు. లోపల వదినకు ఏమయిందో? కుతూహలాన్ని అణచుకోలేక పోయాడు. "వదినకు...." అడిగాడు.

"ఇంకా యేమీ తెలియలేదు!" అన్నాడు రఘునాధరాజు.

సుబ్బరాజు అతనిని ఒకసారి చూసి తల వొంచుకున్నాడు.

అంతలో సుజాతను లోపలకు తీసుకుని వెళ్ళారు.

క్షణాలు భారంగా గడుస్తున్నాయి.

పది నిముషాలు పోయిన తర్వాత డాక్టర్ సీతాదేవి ఖంగారుగా బయటకు వచ్చింది.

రఘునాథరాజు జరగకూడనది యేదో జరిగిందని వూహించాడు. "ఏమయింది డాక్టర్...." అన్నాడు.

"ఇంకా ఏమీకాలేదు రాజుగారూ! నొప్పులు మాత్రం ఎక్కువ అయ్యాయి. కానీ మీ తమ్ముడిగారి భార్యకు మాత్రం...." అంది ఆమె.

రఘునాథరాజు మనసు ఆందోళనతో నిండిపోయింది.

"ఏం జరిగింది?" అన్నాడు.

"కాన్పు చాలా కష్టం! ఆపరేషన్ చెయ్యాలి....!" అంది.

"అలానే కానీయండి!" అన్నాడు రఘునాథరాజు.

"కానీ! ఆపరేషన్ జరిగితే ఆమెకు మళ్ళీ తల్లయ్యే అదృష్టంలేదు!" అంది.

సుబ్బరాజు గొల్లుమన్నాడు. రఘునాథరాజు అతడిని ఓదార్చేడు. డాక్టర్ వైపు తిరిగి "బిడ్డకు ఏమీ ప్రమాదం లేదుకదా?" అడిగాడు.

"చెప్పలేం!"

"డాక్టర్ ఎలాగయినా తల్లితోపాటు ఆ బిడ్డను కూడా కాపాడండి. మా కుటుంబం అంతా మీకు ఋణపడి వుంటాం! నాకు పుట్టబోయే బిడ్డమీద ఎలాసూ ఆశలేదు. నా తమ్ముడి బిడ్డనయినా రక్షించండి డాక్టర్! మా వంశానికి వారసుడిని ప్రసాదించండి డాక్టర్!" రఘునాథరాజు డాక్టర్ సీతాదేవిని ప్రాధేయపడ్డాడు.

ఆమె తలవూపి "నా ప్రయత్నం నేను చేస్తాను" అని వెళ్ళిపోయింది.

అన్నయ్యను సుబ్బరాజు ఆశ్చర్యంగా చూశాడు. ఇటువంటి నిస్వార్థ జీవికా—తను అపకారం తలపెట్టాడు!

తనకు ప్రాయశ్చిత్తంలేదు. అతని కంటినుండి జల జలా నీళ్ళు రాలాయి.

అతడి ఏడుపుకు మరో కారణం వూహించాడు రఘునాథరాజు. అతనిని అనునయించాడు. అన్నగారి ఓదార్పు మాటలకు, ఏడుపుస్థాయి మరీ పెరిగింది.

మరో అరగంటలో లోపల నుండి ఒక నర్సు బయటకు వచ్చింది.

"కంగ్రాట్సు: రఘునాథరాజుగారూ! పండంటి మగ బిడ్డను కంది మీ భార్య."

రఘునాథరాజుకు ఎగిరి గంతెయ్యాలనిపించింది. చాలా సంబరపడిపోయాడు. సుబ్బరాజుకు గుండెమీద నుండి బరువు దించినట్లు అనిపించింది.

మరో అయిదు నిముషాలలో డాక్టర్ సీతాదేవి హడావుడిగా బయటకు వచ్చింది. "డాక్టర్ వాయుగుండం రాలేదా?" అంది.

రఘునాథరాజుకు ఖంగారు మొదలయ్యింది. అతని మనసు యేదో కీడును శంకించింది. "ఏం జరిగింది?" అన్నాడు.

"సుజాతగార్కి ఖ్రాబీ...." అంది.

రఘునాథరాజుకి నోట మాటరాలేదు.

సుబ్బరాజయితే నిలువుగుడ్లేశాడు. తన గొయ్యిని తనే తవ్వుకున్నాడు. కనీసం వాయుగుండం ఎక్కడ వున్నాడో కూడా తెలియదు. అక్కడికి వాయుగుండాన్ని కిడ్నాప్ చేసిన వ్యక్తి చెబుతానన్నాడు కూడా!

అందుకే మూగగా రోదిస్తూ వుండిపోయాడు సుబ్బరాజు. □

నారాయణ మంత్రం

జొన్నలగడ్డ రామలక్ష్మి

నారాయణంటే నాకు గౌరవం.

ఆఫీసులో చాలామందికి అతడంటే అసూయ. పై అధికారులతణ్ణి సాటివాడిలా గౌరవిస్తారు.

అందుక్కారణం అతడి చలాకీతనం.

నారాయణ వయసేమీ తక్కువకాదు. నలభై అయి

దుండవచ్చు.

కానీ పాతికేళ్ళ వయసులోనే ఈసురోమనే వాళ్ళెందరో ఉన్నారు మా ఆఫీసులో. నారాయణ వాళ్ళను వేళాకోళం చేస్తాడు కూడా.

నారాయణ తన పనులు తాను చేసుకోవడమే కాదు— పదిమందికీ సాయపడతాడు కూడా. ఆ సాయం కూడా అందరూ చేయలేరు.

కొత్తగా ఆఫీసులో చేరినవాళ్ళకి ఇల్లు కుదురుస్తాడు. రేషన్ కార్డు త్వరగా వచ్చేలా చేస్తాడు.

ఆఫీసులో ఎవరు చేరినా మర్నాటికల్లా అతడి పరిచయం కాక తప్పదు. మూడో నాటికతణ్ణి ఆరాధించకనూ తప్పదు.

చాలామంది డబ్బుతోటీ పలుకుబడితోటీ సాధించలేని పనులు నారాయణ చిటికెలో సాధించుకుని వస్తాడు. అతడికేమీ చెప్పుకోతగ్గ హోదా లేకపోయినా ఊళ్ళో మునిసిపల్ కౌన్సిలర్ కంటే ఎక్కువ పలుకుబడి ఉంది.

మా మేనేజర్‌కు అనుకోకుండా ప్రయాణం తగిలింది. ప్లేన్లో నాలుగు రోజులదాకా బుకింగు లేదన్నారు. నారాయణ ఆ రోజుకే టికెట్ ఓకే చేయించుకు వచ్చాడు.

ఇంకో ఆఫీసర్ కూతురిపెళ్ళి ముహూర్తం అనుకున్న దానికో నెలరోజులు అడ్వాన్సయింది. శుభలేఖలు రాత్రికి రాత్రి ప్రింటు చేయించడం నారాయణవల్లనే అయింది.

కొత్తగా పెళ్ళయింది నాకు. అప్పుడో చిన్న కంపెనీలో ఉన్నాను. ఇలా పెళ్ళవగానే అలా ఈ ఉద్యోగం వచ్చింది. అంతా నా భార్య అదృష్టాన్ని పొగిడారు. జీతం రెట్టింపు. సెంట్రల్ గవర్న్మెంటుద్యోగం. ధరలు పెరిగినప్పుడల్లా డియ్యేలు వస్తూంటాయి. ఉద్యోగంలో చేరుతూ చాలా సంతోషించాను. వీటన్నింటికీ మించి నారాయణ పరిచయం

నాకెంతో సంతోషాన్ని కలిగించింది.

నెలకు రెండువందల యాభై రూపాయలకు మూడు గదుల యిల్లు చూసిపెట్టాడు నారాయణ. ఆ తర్వాత వారం రోజుల్లో రేషన్ కార్డేకాక, గ్యాస్ కనెక్షన్ కూడా ఇప్పించాడు. వాయిదాల పద్ధతిని ఖరీదైన వస్తువులు కొనుక్కునేందుకు పెద్ద షాపులకు నన్ను పరిచయంచేసి తను హామీ ఉంటానన్నాడు.

కొత్తకాపురం - అందమైన భార్య....

నారాయణ కారణంగా మొదటి సంవత్సరంలో నేను స్వర్గం చూశాను.

నారాయణ అప్పుడప్పుడు మా యింటికి వచ్చేవాడు. నా భార్యతో చనువుగా మసిలేవాడు కానీ నోరారా చెల్లెమ్మా అనే పిలిచేవాడు.

నారాయణ ఆడవాళ్ళ నాకర్షించి వశపర్చుకుంటాడు జాగ్రత్త అని కొందరు నన్ను హెచ్చరించారు. ఆ విషయం నేను నా భార్యతో అంటే ఆమె ఆ మాటలన్నవారిని ఛీ అని అసహ్యించుకుంది.

మా ఆఫీసులో అందరూ నారాయణవల్ల అంతో ఇంతో ప్రయోజనం పొందినవారే! అయినాసరే కొందరికతడంటే అసూయ. ఆ అసూయకు క్రమంగా ద్వేషాన్ని జోడిస్తున్నారు. అతడిమీద లేనిపోని పుకార్లు లేవదీసేవారు.

కొందరు నారాయణ ఆఫీసుటైములో వ్యాపారం చేస్తున్నాడనేవారు. అదెంతవరకూ నిజమో తెలియదు కానీ అతడు రోజుకు ఏడున్నరగంటల్లో నాలుగు గంటలు బయటే తిరిగేవాడు. ఉన్న మూడున్నర గంటల్లోనూ ఆఫీసులో సీటు కూడా కదలడు - ఎవరైనా పిలిస్తే తప్ప!

అతడి టేబిలునద్ద పెండింగు పైలుండవు.

బయటకు వెడితే నాలుగు గంటల్లో నలభై మంది పనులు చేసుకుని వస్తాడని మేనేజరతణ్ణి మెచ్చుకునేవాడు. అందుకే బయటి పనులకతణ్ణే పంపేవాడు.

"మేనేజరు తన స్వంత పనులు చూసిపెట్టడం కోసం నారాయణను బయటకు పంపుతున్నాడు. సద్దుకుందు కతణ్ణి సమర్థిస్తున్నాడు...." అనేవారు చాలామంది.

నేను మాత్రం నారాయణనే నమ్మేవాణ్ణి. అతడు నాతో అందరూ తనగురించి అనే మాటలు చెప్పి బాధపడేవాడు.

"నేనే గనుక వ్యాపారం చేయగలిగితే - ఈ ఉద్యోగ మెందుకు చేస్తాను? ఎందుకూ పనికిరానివాళ్ళే గవర్న మెంటుద్యోగానికి వస్తారు-" అనేవాడు నారాయణ.

"మీరు వ్యాపారం చేయడంలేదంటే ఒప్పుకుంటాను. ఎందుకూ పనికిరానివారంటే మాత్రం ఒప్పుకోను—" అన్నాను.

"అందరికీ నా సాయంకావాలి. అడిగేటప్పుడు సిగ్గుండదు...." అంటాడు నారాయణ చాలామందితో.

అయినా అతణ్ణెవరైనా సాయమడిగినప్పుడు - వాళ్ళు తన్ను నిందించినవారేనని తెలిసి కూడా నారాయణ సిగ్గు లేకుండా సాయపడతాడు.

సాయపడడం అతడి బలహీనత.

నేను తరచుగా నారాయణను పొగుడుతూండేవాణ్ణి. కేవలం మొహమాటానికి కాదు—నా పొగడ్తలకు నిజంగానే అతడర్హుడు.

నారాయణకు నేనంటే అభిమానం.

"ఏదో ఒక రోజున నువ్వూ మారిపోతావేమోనని నాకు భయం-" అంటూండేవాడతడు - అప్పుడతడికళ్ళలో భయం గోచరించేది.

నేను తేలికగా నవ్వేసి-"అందువల్ల నష్టం నాకేగానీ మీకుకాదు-" అనేవాణ్ణి.

కానీ నిజంగానే అలాంటిరోజు వస్తుందని నాకు తెలియదు.

2

ఆ రోజు నారాయణ సెలవు పెట్టాడు.

నా అభిప్రాయంలో నారాయణ సెలవు పెడితే ఆఫీసు చిన్నబోతుంది.

ఆ రోజు ఆఫీసు చిన్నబోయింది.

మేనేజరు నన్ను లోపలకు పిలిచాడు వెళ్ళాను.

"ఈ రోజు నారాయణ సెలవు పెట్టాడు-" అన్నాడాయన.

తెలుసన్నట్లు తలాడించాను.

"తనపని ఏదైనాఉంటే నీకు చెప్పమన్నాడు...."

చెప్పమన్నట్లు తలాడించాను.

"అర్జంటుగా ఈ సరుకులు కొని తీసుకుని రావాలి-" అంటూ మేనేజరు నాకో పెద్ద జాబితా యిచ్చాడు.

అందుకుని చూశాను.

ఒక పని లోకల్ కెమికల్సులో.

అక్కడ నేను సుమారు అయిదువేల రూపాయలు విలువచేసే కెమికల్సు కొని తీసుకుని రావాలి. మా ఆఫీసులో ఒక టెస్టింగ్ లాబరేటరీ ఉంది. కుటీర పరిశ్రమల్లో తయారయ్యే వస్తువులనక్కడ టెస్టుచేస్తారు. అందుగురించి తరచుగా కెమికల్సు కొంటూంటాం. కెమికల్ లాబరేటరీని నిర్వహించే అధికారి తనక్కావలసిన వస్తువుల జాబితా యిస్తాడు. మేనేజరు నారాయణ ద్వారా వాటిని రప్పిస్తాడు.

రెండవపని అరుణా స్టేషనరీస్‌లో.

సుమారు ఎనిమిదివేల రూపాయలు విలువ చేసే కాగితాలు, పెన్నులు, పెన్సిల్స్, స్టెన్సిల్స్, కార్బన్ పేపరు, ఫైల్ కవర్సు వగైరాలు ఖరీదు చేయాలి నేను.

మూడవపని రాఘవేంద్రా మెడికల్ స్టోర్సు. మా ఆఫీసు డిస్పెన్సరీకి మందులు కొనాలి.

నాల్గవపని గౌరీ ఫర్నిచర్స్‌లో. ఆఫీసుకు సంబంధించిన ఇరవై కుర్చీలకు పేము నేయించాలి. అందుకు మనిషిని దగ్గరుండి తీసుకురావాలి. పేముకు బిల్లు తీసుకోవాలి.

మొత్తం నాలుగు పనులు

నాలుగింటికీ నాలుగు దిశలకు వెళ్ళాలి.

పాపం - ఇలాంటి పనులకే నారాయణ నాలుగు గంటలు బయట తిరిగేవాడన్నమాట, నాలుగు గంటల్లో నాలుగు పనులూ చేసుకుని రావడం మాటటుంచి ఎండలో తిరగడం—ఎంత శ్రమ?

"ఎంతసేపు పడుతుంది?" అన్నాడు మేనేజరు.

నేను తిరగడాని కాఫీసు వెహికిలుంటుంది. లోకల్ కెమికల్సు కిరవై నిముషాలు పడుతుంది. అక్కడో అర గంటైనా ఉండాలికదా!

త్వరగా లెక్క వేయసాగాను.

"లెక్కకే ఇంతసేపుపడుతోంది....ఇంక నీ వల్ల త్వరగా పనేమవుతుంది?" మేనేజరు నవ్వుతూనే అన్నాడు.

ఆయన నవ్వు నాలో ధైర్యాన్ని పెంచింది.

నారాయణ సాధారంగా నాలుగు గంటలసేపు బయటకు వెడతాడు.

అతడికంటె సమర్థుడినని నేననిపించుకోవాలి.

"మూడుగంటలు...." అన్నాను.

"టూమచ్!" అన్నాడు మేనేజరు- "నారాయణ నీ గురించి చెబితే ఏమో అనుకున్నాను. ఇంత చిన్నపనికి అరగంట చాలదూ?"

అదాయన నన్ను ప్రశ్న అడిగినట్లులేదు. అరగంటలో పూర్తి చేసుకునిరా అని ఆజ్ఞాపించినట్లుంది.

నాకు తెలుసు - అరగంటలో ఆ పని అయ్యేదికాదని!

అయినా తలాడించాను.

మేనేజరు సంతృప్తికరంగా నవ్వి- "నీ చురుకుతనం నాకు నచ్చింది. నారాయణ ఈ పనులన్నీ అరగంటలో చేసుకుని రాగలడు. అయితే నేను నీకు మూడుగంటలు టైమిస్తున్నాను...." అన్నాడు.

నారాయణతో పోల్చి నన్ను చిన్నబుచ్చినందుకు మనసు చివుక్కు మన్నప్పటికీ - మూడుగంటలు టైమిచ్చినందుకు కొంత సంతోషించాను. లేకుంటే ఆ పనులు చేసుకుని రాలేనుకదా!

మేనేజరుకు థాంక్స్ చెప్పి లేవబోయాను.

"నీకు మూడు గంటలు టైమిచ్చానంటే ఎందుకని అడగవేం?" అన్నాడు మేనేజరు.

అడగాలని నాకు తెలియదు. తన స్థానంలో నా పేరు సూచించి నారాయణ నన్నిబ్బందిలో పడేశాడు. ఆయన హృదయ గతాభిప్రాయమేమిటో నాకు తెలియదు.

చేసేదిలేక అమాయకంగా చూశాను.

మేనేజర్ నాకో కాగితమిచ్చాడు. అందులో నాలుగు పేర్లు. వయసులున్నాయి. నలుగురికీ బొంబాయి వెళ్ళడానికి ట్రైన్లో రిజర్వేషన్ చేయించాలి.

"నా బంధువల్లే...." అన్నాడాయన—ఎనిమిది వంద రూపాలనోట్లు కూడా నా వైపు తోస్తూ.

ఆ డబ్బు తీసుకోవాలో కూడదో నాకు తెలియదు. తీసుకోకుంటే డబ్బెక్కణ్ణించి వస్తుంది నాకు?

నోట్లు తీసుకున్నాను.

"ఇక్కణ్ణించి బొంబాయికి సెకండ్ క్లాసులో వెళ్ళాలంటే ఎంతవుతుంది?"

ఇలాంటి ప్రశ్నలకు జవాబు నాకేం తెలుస్తుంది? తెల్ల మొహం వేసి చూశాను.

మేనేజరు నవ్వి - "నారాయణకు రైల్వే స్టేషన్‌లో పార్కింగ్ క్లర్కుకంటె కరెక్టుగా - ఏ ఊరికెంతో చెప్పగల జ్ఞాపకశక్తి ఉంది. ఎట్టి పరిస్థితుల్లోనూ ఆరువందలు దాటదు. మరి ఎనిమిదిపంద లెందుకిచ్చానో తెలుసా?" అన్నాడు.

ఆయన చెప్పందే నాకెలా తెలుస్తుంది?

మేనేజరొకో లిస్టిచ్చాడు.

ఫ్యాన్సీస్టోర్లో కాస్మెటిక్స్ కొనాలి. ఆయనింట్లో ఇవ్వాలి.

"చాలా అర్జంటు. సమయానికందకపోతే అమ్మాయి కోప్పడుతుంది.... నే నాఫీసునుంచి వచ్చేలోగా పంపుతానని మాటిచ్చాను-" అన్నాడు మేనేజరు.

తల ఊపాను.

"మిగిలిన డబ్బులింట్లో యిచ్చేసేయ్...."

తల ఊపాను.

"మూడు గంటల్లో వెనక్కొచ్చేయాలి...."

తల ఊపాను.

"వెళ్ళు!" అన్నాడాయన.

బ్రతుకుజీవుడా అని అక్కణ్ణించి బయటపడ్డాను.

నారాయణ నన్నిప్పుడు గొప్ప ఇబ్బందిలో పడేశాడు.

ఈ పనులన్నీ నా వల్ల అవుతాయా?

ముందుగా డ్రైవర్ని కలుసుకున్నాను. రిజర్వేషన్ గురించి ఎంతసేపు పడుతుందని అడిగాను. వాడు గంభీరంగా ముఖంపెట్టి—"నారాయణగారికైతే చిటికెలమీద పనండి. ఇంకెవరికైనా రెండుగంటలకు తక్కువ పట్టదు" అన్నాడు.

రెండుగంటలు రిజర్వేషన్‌కు పోతే—ఫ్యాన్సీషాపు, మేనేజరిల్లు మరోగంట పడితే—మొత్తం మూడుగంటలూ అయిపోయింది.

మిగతా పనులకు నాకు టైమేదీ!

సీట్లోకి వెళ్ళి కూర్చున్నాను.

కాసేపు తాపీగా ఆలోచించిగానీ కదలకూడదనుకున్నాను.

ఆఫీసు వదిలిన మూడుగంటలకల్లా నేను తిరిగిరావాలి.

నారాయణ ఈ పనులన్నీ ఎలా చేసేవాడు?

రిజర్వేషన్ క్షణాల మీదైపోయినా కూడా - ఫ్యాన్సీ స్టోర్లో సరుకులు కొనడానికి - మేనేజరింటికి వెళ్ళడానికీ కలిపి గంట దాటుతుంది. ఆపైన నాలుగు గంటలసేపు నగరం నాలుగు దిక్కులకూ తిరగాలి.

ఇన్ని పనులతడంత తక్కువ వ్యవధిలో ఎలా చేసేవాడో?

అతడి విషయమెలాగున్నా నేను చేయలేను.

అందువల్ల ముందుగా వీటిలో ముఖ్యమైన పనులేమిటో తెలుసుకోవాలి.

నారాయణ నాకొకసారి చెప్పాడు.

మేనేజరు ఆఫీసు పనీ, స్వంత పనీ కలిపి చెప్పాడంటే—ఆయన స్వంతపనికే ప్రాధాన్యత నివ్వాలని.

ఆఫీసుపని బయటకు వెళ్ళడానికి వంక. అది చేయక పోయినా మేనేజరుకు కోపంరాదు. స్వంతపని కాకపోతే మాత్రం ఆయన కాలరుద్రుడవుతాడు.

నేనూ ఇప్పుడదే చేయాలనుకున్నాను.

ముందుగా రైల్వే స్టేషను .... తర్వాత ఫ్యాన్సీ స్టోర్సు....

ఆ పైన కాళీ ఉంటే మిగతావాటి ో ముఖ్యమైన పని చేయపచ్చు.

నా కప్పగించిన నాలుగింటిలో ముఖ్యమైన దేమిటో ముందుగా తె సుకోవాలి నేను.

ముందుగా టెస్టింగ్ లాబరేటరీ సూపర్వైజింగ్ ఆఫీసర్ జాన్సన్ దగ్గరకు వెళ్ళి కెమికల్సు జాబితా చూపించి "ఇవి మీకు అర్జెంటుగా యీ రోజే కావాలా?" అనడిగాను.

"అర్జంటు కాకపోతే కొటేషన్ మీద ఆర్డరిచ్చేవాణ్ని. క్యాష్ పర్చేజ్ అడిగిన దెందుకూ?" అన్నాడు జాన్సన్.

నిరుత్సాహంగా అక్కడ్నించి కదలబోయాను.

ఉన్నట్లుండి జాన్సన్ నన్నడిగాడు—"ఈ జాబితా మీ దగ్గరకెలా వచ్చింది?"

"నారాయణగారు సెలవు—" అంటూ పరిస్థితి వివరించి చెప్పాను.

"అయ్యో—నా కా సంగతి తెలియదే — యెన్నాళ్ళేమిటి?" అన్నాడు జాన్సన్ అదోలా. అతడి ముఖంలో ఆత్రుత ఉంది.

"ఈ వేళ ఒక్కరోజే—" అన్నాను.

"అయితే మీ కెందుకూ శ్రమ! ఈ ఒక్కరోజుకూ నేను సర్దుకోగలను—...." అన్నాడు జాన్సన్. అతడి

మాటల్లో నామీద జాలి ఉంది.

"హమ్మయ్య—" అని మనసులో అనుకుంటూనే— "పాపం—నా కారణంగా మీకిబ్బందవుతుందేమో—" అన్నాను.

"ఇబ్బందేమిటండీ—అలవాటులేని పని మీవల్ల కాదు కదా! ఆ మాత్రం అవగాహన లేకపోతే మనం కొలీగ్సు మయుండీ ప్రయోజనమేమిటి?" అన్నాడు జాన్సన్.

తర్వాత యూసఫ్, జరీవాలా, లక్ష్మణ్‌సింగ్‌లను కలుసుకున్నాను వారి వారి పనుల అర్జెన్సీ గురించి. అందరూ తలో ప్రాంతానికీ, మతానికీ చెందినవారు. అయినా నామీద జాలిపడ్డారు. మర్నాటిదాకా తమ పనులు ఆగవచ్చునన్నారు.

అప్పటికి తేలికపడిన మనసుతో నేను డ్రైవర్ని కలుసుకున్నాను. రైల్వేస్టేషన్‌కు పదమన్నాను.

కారులో కూర్చుని జరిగిందంతా చర్వితచర్వణం చేసుకుంటే ఆఫీసులో కొలీగ్సు నామీద చూపించిన జాలి నన్ను బాధించింది.

ఒక్కరుకూడా పని ఎక్కువని జాలిపడలేదు. నారాయణకులా నేను చేయలేనని జాలిపడ్డారు.

నారాయణైతే ఇన్ని పనులూ అరగంటలోనే చేసేవాడని ఆఫీసరు అభిప్రాయం. కానీ అదెలా సాధ్యం?

మరికాస్త ఆలోచించగా నాకింకో విషయం తట్టింది. నారాయణ సామర్థ్యంపై ఉన్న నమ్మకం నా కొలీగ్సుకు నాపై లేదు. తమ పనులు నారాయణ చేయడమే మంచిదని వారు భావిస్తున్నట్లుంది.

రైల్వేస్టేషనుకు వెళ్ళాను.

కోనేటి చాంతాడులాంటి క్యూ.

అది చూస్తూనే డ్రైవరు—"బాబూ—ఓ రౌండ్ కొట్టి గంట తర్వాత వస్తాను. ఈలోగా మీ పని ఎలాగూ కాదు—" అని వెళ్ళిపోయాడు.

నారాయణ డ్రైవర్నలా వదిలిపెట్టేవాడేమో తెలియదు. ఈ పని నాకు కొత్త. డ్రైవర్ని వెళ్ళిపోనిచ్చి రిజర్వేషన్ స్లిప్ తెచ్చుకుని క్యూలో నిలబడ్డాను.

నిలబడే వాళ్ళ పేర్లు రాసి ఫారం ఫిలప్ చేశాను.

డ్రైవరు చెప్పినట్లే గంటపట్టింది బుకింగ్ కౌంటర్ని సమీపించడానికి.

నా ముందు ఒకతనికి రిజర్వేషన్ దొరకలేదు. అతడిదీ నా ట్రయినే!

అతడు కాస్త స్వరం తగ్గించి_"కలెక్టర్‌గారు చాలా యిబ్బంది పడిపోతాడు—రిజర్వేషన్ కాకపోతే—" అన్నాడు.

బుకింగ్‌క్లర్క్ హెచ్చు స్వరంలోనే_"సీటు లేకపోతే మేమేం చేస్తాం? మాకు కలెక్టరైనా మినిస్టరైనా ఒకటే_" అన్నాడు.

అతడు ఇన్‌ఫ్లుయన్స్ చేయడానికి ప్రయత్నించి ఫెయిలై వెళ్ళిపోయాడు.

నేను భయపడుతూనే నా స్లిప్ అందించాను.

బుకింగ్ క్లర్కొకసారి నా వేపు ఎగాదిగా చూసి_"సారీ అండీ—కోటా అయిపోయింది_" అన్నాడు.

బయటకు వచ్చేశాను.

అప్పుడే డ్రైవరు వచ్చాడు. జరిగింది విని—"అదేంటి సార్_నారాయణగారి పేరు చెప్పకపోయారా?" అన్నాడు.

"ఒకతను కలెక్టరు పేరు చెప్పాడు. పని జరగలేదు" అన్నాను.

"పేరు కేముంది సార్! యెవరైనా యెవరైనా చెప్పొచ్చు. నారాయణగారి ఆఫీసునుంచే కదా వస్తున్నారు. అందుకు నేను సాక్ష్యం—...." అన్నాడు డ్రైవరు.

"కలెక్టరు పేరు చెప్పినవాడి స్లిప్ చూశాను. అడ్రసు కలెక్టరుదే ఇచ్చాడు—...." అన్నాను.

"ఆ స్లిప్పు నా కివ్వండి—" అన్నాడు డ్రైవరు. పది నిముషాల్లో వాడు—రిజర్వేషన్ చేయించుకుని వచ్చాడు. వాడసలు క్యూలో నిలబడలేదు. నేరుగా బుకింగ్‌క్లర్కు వున్న గదిలోకి వెళ్ళాడు.

"ఎలా సాధ్యపడింది?" అన్నానాశ్చర్యంగా.

"నారాయణ మంత్రం వేశాను సార్!" అన్నాడు డ్రైవరు.

"నీకు తెలుసా—ఆయన పేరు చెబితే పనైపోతుందని...."

"ఆ బుకింగ్‌కర్క్ నాకు బాగా తెలుసు సార్. నారాయణగారాయనకు గాలాసార్లు మన కార్లో లిఫ్టిచ్చారు...." అన్నాడు డ్రైవర్.

ఆఫీసు కారును బుకింగ్ క్లర్కు కుపయోగపడేలా చేసి తన పలుకుబడి పెంచుకున్నాడన్న మాట నారాయణ.

"నువ్వీ సంగతి ముందే చెప్పాల్సింది. ఇంతసేపు క్యూలో నిలబడాల్సిన పనుండేది కాదు—" అన్నాను తీవ్రంగా.

డ్రైవరు నవ్వుతూ—"నారాయణగారి దగ్గర నాకంటే మీకే చనువెక్కువ సార్. అందుకని అంతా మీకు

తెలుసనుకున్నాను....” అన్నాడు.

“అయినా సరే—నేను క్యూలో నిలబడ్డం చూశావు గదా! ఓ గంట పడుతుందని కూడా అన్నావు గదా....” అన్నాను కోపంగా.

“పొరపాటైపోయింది సార్! నాకు స్వంత పనివుంది. అందుకని ఈ గంటా ఉపయోగించుకున్నాను—....” అన్నాడు డ్రైవరు.

నాకు వళ్ళు మండిపోయింది. ఏదో అనబోయి ఆగి పోయాను.

నారాయణ నాతో ఒకసారి అన్నాడు.

“మనకింద పని చేసేవాళ్ళు మనకంటే బలవంతులు. పని చేయకపోయినా వాళ్ళను డిస్మిస్ చేయలేము. వాళ్ళకు బలమైన యూనియన్లున్నాయి. వాళ్ళతో గొడవపడ్డంవల్ల మన పరువుపోవడం మినహా మన కే లాభమూ వుండదు. ఒకోసారి వాళ్ళు చావదన్నినా తన్నగలరు. వాళ్ళతో మంచిగా ఉంటేనే మనమాట వింటారు. తప్పుచేస్తే మందలించాలి. వాళ్ళు తప్పొప్పుకుంటారు. తప్పొప్పు కున్నారు గదా అని అథార్టీ చేశావా—వాళ్ళు సహించరు. ఒప్పుకున్నారు గదా అని సంతోషించి నవ్వూ ఊరు కోవాలి. అప్పుడే వాళ్ళు నిన్ను గౌరవిస్తారు. వాళ్ళిస్తేనే నీకు గౌరవం—అని గుర్తుంచుకోవాలి—....”

ఆఫీసులో నారాయణకు ప్యూన్సందరూ దణ్ణాలు పెడ తారు. ఒకోసారి వాళ్ళాఫీసర్లను కూడా లెక్కచేయరు. కానీ నారాయణంటే గౌరవం. అందులోని కిటుకు నాకు నారాయణ పై విధంగా వివరించి చెప్పాడు.

అందుకే నేను డ్రైవర్ మీద నా కొచ్చిన కోపా న్నణచుకున్నాను. కారెక్కి—ఫ్యాన్సీ స్టోర్సుకు వెళ్ళాను.

స్టోర్సులో చాలా రష్‌గా వుంది. కాసేపెదురు చూసి.
మా మేనేజరు పేరు చెప్పాను. షాపువాడు నాకు వినయంగా
నమస్కరించి—"కాస్త టైము పడుతుంది సార్—"
అన్నాడు.

అతడు నన్నేమాత్రమూ పట్టించుకోలేదు. ఇంకా
ఇంకా ఆలస్యమవుతోంది.

అప్పుడు నాకు నారాయణ మంత్రం గుర్తొచ్చింది.

అందువల్ల పని జరిగింది. వెంటనే నాక్కావలసిన
వస్తువులు నీటుగా ప్యాక్ చేయబడ్డాయి.

అవి తీసుకుని మేనేజరింటికి వెళ్ళాను.

మేనేజరుగా రమ్మాయి యింట్లోనే వుంది. నేను
తెచ్చిన సరుకులు చూసింది. ఆమె కవి నచ్చినట్లు లేదు.
ఏవో వంకలు చెప్పడం ప్రారంభించింది.

ఆమెను గురించి నేను విన్నాను. ఆఫీసులో పనిచేసే
వారంతా తన నౌకర్లన్నట్లు మాట్లాడుతుందిట ఆమె.
చాలామంది మేనేజరింటికి వెళ్ళడానికి ఆమె గురించే భయ
పడతారు. ఆమె నెదిరించలేరు. ఆమె అనే మాటలకు బాధ
పడకుండా ఉండలేరు.

ఆమె మాటలు నన్నూ కాస్త బాధించాయి. తీవ్రం
గానే బదులిద్దామనిపించింది. ఇతరులు తెచ్చేవి నచ్చ
నపుడు—తామే స్వయంగా వెళ్ళాలి.

మేనేజరేమో — టాల్కం పౌడరని రాశాడు—
కంపెనీ పేరు రాయలేదు. ఆమెకే కంపెనీ దిష్టమో నా కెలా
తెలుస్తుంది?

ఇవన్నీ మాటలరూపంలో అనాలనుకునేసరికి నారా
యణ గుర్తుకొచ్చాడు నాకు. చటుక్కున అతడే అవి కొని
నా కిచ్చి పంపాడన్నాను.

ఆ అమ్మాయి ముఖం మారిపోయింది.

"నారాయణగారివి పంపించారా?" అంది అప్రయత్నంగా. ఆయన పేరుతోనే ఆ వస్తువులన్నీ మారిపోయినట్లున్నాయి. ఒకో వస్తువే ఆమెకు నచ్చనారంభించింది. పౌడరు వాసనచూసి—"ఈ కంపెనీ దిదివరకు బాగుండేది కాదు. ఇప్పుడు ఫార్ములా మార్చివుంటారు. ఫంటాస్టిక్ ప్రోగ్రెస్స్....నారాయణగారి కిలాంటివన్నీ ముందే తెలుస్తాయి...." అంది.

అక్కణ్నుంచి బయటపడ్డాక ఇంకా వేరేచోట్లకు వెళ్ళలేదు. తిన్నగా ఆఫీసుకు వెళ్ళాను. మేనేజరు గదికి వెళ్ళి రిజర్వేషన్ గురించీ, ఫ్యాన్సీసరుకుల గురించీ చెప్పాను. ఆయన—"గుడ్! చురుకైనవాడివి—" అని మెచ్చుకున్నాడు.

మిగతా పనుల గురించి ఆయన అడగనూలేదు. నేను చెప్పనూలేదు.

తర్వాత నేను నా సీట్లో కూర్చుని నారాయణ గురించే ఆలోచించసాగాను.

ఏమిటి నారాయణలోని విశేషం? మనిషి దగ్గర లేకపోతే కలెక్టరు కూడా పనికావడంలేదు. నారాయణ పనులు పేరు చెబుతూనే అయిపోతున్నాయి.

అతడంటే నాకు అసూయ కలిగింది. ఆ విషయం అప్పుడు నాకు తెలియలేదు. ఇంటికి వెళ్ళి నా భార్యకా రోజు జరిగిందంతా చెప్పుకున్నాను. అప్పుడామె చెప్పింది.

"నాకెందుకూ అతడంటే అసూయ?" అన్నాను ఉక్రోషంగా.

"అన్నిపనులూ అందరివల్లా కావు. నారాయణగారు

మహానుభావుడు. అందరూ ఆయనకులా ఉండలేరు. మన మాయనవంటి వారివల్ల ప్రయోజనం పొందాలి. అందు కాయనకు కృతజ్ఞులమై ఉండాలి. అసూయపడకూడదు" అంది నా భార్య.

నా భార్య కూడా నా మీద కాక నారాయణపై గౌరవ మెక్కువనిపించిం దా క్షణంలో. అయితే ఆ మాటపైకి అనలేదు.

3

మర్నాడు నారాయణ ఆఫీసుకు వచ్చాడు. వస్తూనే మేనేజర్ గదికి వెళ్ళాడు. తర్వాత నా దగ్గరకు వచ్చి—"మేనేజరుగారు నిన్ను మెచ్చుకున్నారు—" అన్నాడు.

"నేనేం చేశాను?" అన్నాను.

నేను చేసిన మేనేజరు స్వంత పనుల గురించి చెప్పాడతడు.

"అందులో నా గొప్పతనమేమీ లేదు. మీ పేరు మంత్రంలా పని చేసింది ప్రతిచోటా—నా వల్లనైతే ఒక్క పని కూడా అయ్యేది కాదు...." అన్నాను.

"ఏం జరిగిందేమిటి?"

చెప్పాను.

నారాయణ చిరునవ్వు నవ్వాడు.

"ఏమిటి మీలోని విశేషం? ఊళ్ళో ఇంత పేరెలా సంపాదించారు?" అన్నా నాశ్చర్యంగా.

"నేను చేసిందీ, చేస్తున్నదీ చాలా సింపుల్—" అన్నాడు నారాయణ. అతడు చెబుతూంటే నేను వింటున్నాను.

కట్నం తీసుకోనడం చటవిరుద్ధం. అయితే ఎక్కడ పెళ్ళిప్రసక్తి వచ్చినా-కట్నం ప్రస్తావన తప్పనిసరి. అంటే

సామాజిక సంప్రదాయంలో కట్నం కూడా ఒక భాగమై పోయింది. అలాగే నిత్యజీవితంలో అవినీతి, చట్టవిరుద్ధమైన పనులు—ఎన్నో భాగమైపోతున్నాయి.

నారాయణ కూడా అలాంటి పనులు చాలా చేస్తున్నాడు. అయితే చాలామందికిలా అతడు అవినీతిని తన స్వార్థానికీ, నీతిని ప్రగాల్భాలకీ పరిమితం చేసుకోకుండా-వీలైనంతలో అందరికీ సాయపడుతున్నాడు. అతడెవరితోనూ విరోధం తెచ్చుకోడు. ప్రతివాడికీ సాయపడాలని చూస్తాడు. తన గురించి గొప్పలు చెప్పుకోడు. ఎదుటి మనిషి గొప్పలు చెప్పుకుంటే సహిస్తాడు. పదిమందితో పరిచయాలు పెంచుకుంటాడు. పెంచుకున్న పరిచయాలు నిలుపుకుందుకు కృషిచేస్తాడు.

"నాకులా ఉండడం అసాధ్యం కాదు. కానీ అందుకు కృషి కావాలి. ఇతరులకోసం రోజూ కొంత సమయాన్ని వినియోగించగలగాలి. అలా చేయలేని స్వార్థపరులు—నా కృషి ఫలితాన్ననుభవిస్తూనే నన్ను చూసి అసూయపడుతూంటారు...." అన్నాడు నారాయణ.

అయితే నారాయణ కలాంటివారిపై జాలి తప్ప ద్వేషం లేదని నాకూ తెలుసు. అతడు జాలిపడేవారి జాబితాలో నా పేరు చేర్చడం ఇష్టంలేదు నాకు.

తర్వాత నారాయణతో ఆఫీసరు నా కప్పగించిన నాలుగు ఆఫీసుపనుల గురించీ చెప్పి నేనేం చేశానో చెప్పాను.

"మంచిపని చేశావు. ఈరోజే నేనా పని చేసుకుని వస్తాను...." అన్నాడు నారాయణ.

"కానీ మేనేజరు అరగంట చాలన్నాడు—" అన్నాను.

"నిజమే—అరగంట చాలు—" అన్నాడు నారాయణ

తాపీగా.

నిజం చెప్పాలంటే నాకు వళ్ళు మండింది.

"అసలు నిన్న మీ పేరుపయోగించి ఈ పనులు పూర్తి చేసుకుని వద్దామనుకున్నాను. కానీ నారాయణ మంత్రం మనుషుల్ని వశపరుచుకోగలదు కానీ-ప్రయాణ కాలాన్ని తగ్గించలేదు గదా" అన్నాను నేను.

"అందుకే నారాయణుడే స్వయంగా రంగంలో దిగాలి-" అన్నాడు నారాయణ నవ్వుతూ.

"మీరు మాత్రం గాలిలో యెగిరి వెళ్ళరు కదా!" అన్నాను.

నారాయణ నవ్వుతూనే—"అసలు విషయం నీకు తెలియక ఊరికే కంగారుపడుతున్నావు—" అన్నాడు.

"ఏమిటది?" అన్నాను.

అప్పుడు నాకు నారాయణ ఓ గొప్ప రహస్యం చెప్పాడు.

కెమికల్సు, మందులు, స్టేషనరీ, పేము అల్లిక అన్నీ అబద్ధం

జాన్సన్ కెమికల్సు కావాలంటాడు. అవి లాబొరేటరీ లోనే ఉంటాయి. అయినా అతడడిగితే కాదనేవారు లేరు. నారాయణ బిల్లు తెచ్చియిస్తాడు. ఆఫీసునుంచి డబ్బు శాంక్షనవుతుంది. బిల్లు యిచ్చినతడు, నారాయణ, జాన్సన్—ఆ డబ్బు పంచుకుంటారు.

"మందులు కూడా అంతేనా?" అన్నాను.

"ఆఖరికి కుర్చీల పేము అల్లిక కూడా—అంతా పేపర్ వర్కు! ఇది యెవ్వరూ కనుక్కోలేని—పట్టుకోలేని నేరం!"

"ఆఫీసులో ఎవరైనా కంప్లైంట్ చేస్తే?"

"ఒక్కరోజులో నువ్వు నలుగురు దొంగల్ని తెలుసుకున్నావు. ఇంచుమించు అందరూ ఏదో విధంగా లాభం పొందుతున్నవారే!"

"మేనేజరుకిది తెలుసా?"

"అన్ని వ్యవహారాల్లో పెద్ద వాటా ఆయనదే! అర గంటలో నాలుగు చోట్లకు వెళ్ళిరమ్మన్నాడు నిన్న. అంటే దానర్థం సరుకులేమీ కొనక్కర్లేదని. అది మా కోడ్!

నేనాశ్చర్యపడుతూ—"ఎప్పుడూ ఏం కొనకపోతే ఆఫీసుకు సరుకులెలా వస్తాయి?" అన్నాను.

"ఎల్లప్పుడూ యిలా వుండదు. ఒకోసారి అన్నీ కొంటాం. ఒకోసారి కొన్ని కొంటాం. ఒకోసారి ఏమీ కొనం. బిల్లులు మాత్రం వస్తూనే ఉంటాయి. నిన్న నీకు అప్పగించబడిన పని—బిల్లు సేకరించుకొని రావడమే!" అన్నాడు నారాయణ.

"అంటే—అరగంటలో మీరూ ఆ పని చేయలేరు. బిల్లులు తేవడానికైనా నగరం నాలుగు మూలలకూ వెళ్లాలి గదా-అందుకైనా రెండు గంటలు తక్కువ పట్టదు...." అన్నాడు తేలికగా నిట్టూర్చి.

అప్పుడే నారాయణ బాంబు పేల్చాడు.

"ఆ పని అరగంటలో అవుతుంది కాబట్టే ఆ కోడ్ వచ్చింది-" అన్నాడతడు.

"అదెలా సాధ్యం?"

"మన ఆఫీసుకు కిలోమీటరు దూరంలో సత్యం ట్రావెల్స్-ఆఫీసుంది. అక్కడ మనకు నగరంలో ఏ దుకాణం పేరులో బిల్లు కావాలన్నా దొరుకుతుంది. అన్ని దుకాణాలవారూ మనవంటి ఆఫీసుల సౌకర్యార్థం తమకు

సంబంధించిన ఓ బిల్లు బుక్కు నక్కడుంచుతూం టారు....''

నేను తెల్లబోయి—''అదెలా సాధ్యం?'' అన్నాను.

''అదంతే! నే నక్కడకు వెళ్ళిరావడానికి అరగంట కూడా అక్కర్లేదు....''

కాసేపు నాకు నోటమాట రాలేదు.

''మేనేజరీ రహస్యం నీకు తెలుసుననే అనుకుంటు న్నాడు. చాలామంది తెలిసి కూడా తెలియనట్లు నటించే రహస్యమిది....'' అన్నాడు నారాయణ.

''అయితే మన ఆఫీసులో ఎవరైనా సత్యం ట్రావెల్స్‌కు వెళ్ళవచ్చా?''

''అదేకదా అందరి ఏడుపను. అందుకూ నారాయణ మాత్రం కావాలి. నేను నీ పేరు సూచించాను కాబట్టి మేనే జరు నిన్నక్కడకు పంపాలనుకున్నాడు—....''

''ఇలాంటివన్నీ మీకెలా తెలుస్తాయి?''

''మిగతా విషయాలు నేను చెప్పలేను కానీ సత్యం ట్రావెల్స్ గురించి మాత్రం కొంత చెప్పగలను—....'' అని ఆగాడు నారాయణ.

కుతూహలంగా—''ఊఁ'' అన్నాను.

''నేనేదో వ్యాపారం చేస్తున్నానని అంతా ఏడు స్తారే....నాకున్న వ్యాపారం సత్యం ట్రావెల్స్ ఒక్కటే....'' అన్నాడు నారాయణ.

అప్పుడు నారాయణ నాకు సామాన్యుడిలా తోచలేదు. ఆ మహానుభావుడికి శుశ్రూష చేసి—అసూయాద్వేషా లకు దూరమై—నేనూ అంతటి వాడిని కావాలను కున్నాను. □

సుంకరి రాంప్రసాద్

— చివరి మజిలీ —



"వ్ఃనం. రేపు కుప్పుస్వామిని విడిపించబోతున్నాం."

గ్లాసులోని విస్కీనంతా ఒక్కసారిగా గొంతులోనికి పోసుకొని అంది జరీనా. ఆమెవంక ఆశ్చర్యంగా చూసాడు శ్రీనివాస్.

APANA 10

మద్రాసకు ముప్ఫయి కిలో మీటర్లదూరంలో మహాబలి పురానికి వెళ్లే త్రోవలో ఉంది వి.జి.పి. గార్డెన్స్. అందు లోని కాటేజ్‌లో కూర్చుని మాట్లాడుకుంటున్నారు వారు.

పగలంతా సినిమా షూటింగ్‌లతో సందడిగా ఉండే ఆ గార్డెన్స్ చీకటి పడేసరికి నిర్మానుష్యంగా ఉంటుంది. విశాలమైన తోపులలో దూర, దూరంగా విసిరేసినట్లుండే ఆ కాటేజస్ ఇటువంటి రహస్య సమావేశాలకు ఎంతో అనుకూలంగా ఉంటాయి.

"కానీ జరీనా. కుప్పుస్వామి ఉన్నది పోలీస్ స్టేషన్‌లో కాదు. సెంట్రల్ జైలులో" అన్నాడు శ్రీనివాస్.

పోలీస్ స్టేషన్‌లో ఖైదుచేయబడ్డ వారిని విడిపించడం తనలాంటి వారికి పెద్ద కష్టంకాదు. కాని, సెంట్రల్ జైలులో బంధింపబడ్డ కుప్పుస్వామిని....అదీ....ఇన్ టెన్సివ్ కేర్‌లో ఉంచబడ్డ అతడిని రేపే మనం విడిపించ బోతున్నామని జీడిపప్పు పలుకులు తిన్నంత సులభంగా ఆమె చెప్పడం అతడికి ఆశ్చర్యం కలిగించింది.

ఆమె అతడి కళ్ళలోకి చూసి సన్నగా నవ్వింది. ఎర్రని దొండపండ్లలాంటి పెదవులు విచ్చుకుని దానిమ్మగింజల లాంటి ఆమె పళ్లు మిలమిలా మెరిసాయి.

నవ్వుతుంటే మినీస్కర్ట్‌లోని ఆమె అందాలు బరువుగా కదిలాయి. కాలు మీద కాలు వేసుకొని కూర్చుని ఉంది ఆమె. ఫ్లోరోసెంట్ దీపకాంతిలో నిగనిగా మెరుస్తున్న ఆమె నున్నని తొడలవంక ఆకలిగా చూసాడతడు.

మగవాడ్ని పిచ్చెక్కించేలా అలా సెక్సీగా నవ్వటం జరీనా లాంటి ఏ కొద్దిమంది ఆడవాళ్ళకో సాధ్యపడుతుంది.

ఇంటర్నేషనల్ స్మగ్లర్‌గా పేరుగాంచిన కుప్పుస్వామి, జరీనా అంటే ఎందుకంత పడి చస్తాడో, ఆమె నవ్వును

చూసాక అర్థమయింది అతడికి.

"మొగల్ పాదుషా ఔరంగజేబ్ ఖైదుచేసిన శివాజీ.... ఢిల్లీ చెఱసాల నుండి ఎలా తప్పించుకు పోయాడో నీకు తెలుసా శ్రీనివాస్....?"

"జైలులోని సైనికులకు మిఠాయిలు పంచి."

"మనం కూడా రేపు ఆ ఓల్డ్ ట్రిక్‌నే ఉపయోగించ బోతున్నాం."

పెదవులు బిగించి, విలాసంగా అతడివంక చూస్తూ అంది ఆమె. అర్థంకానట్లు ఆమెవంక చూసాడతడు.

ఆమె అందం అతడి మతి పోగొడుతూంది. అతడేం ఆలోచించడంలేదు. కానీ, కనిపించకుండా దోబూచులాడు తున్న ఆమె అవయవాలవంక ఆబగా చూస్తూ, ఆమె చెబు తున్న మాటలను ఆలకిస్తున్నాడతడు.

అతడి కళ్ళలోని కోరికను ఆమె గమనించక పోలేదు. తన అందంతో మగవాడ్ని కవ్విస్తూ, అతడిలోని కోరికలను రెచ్చగొడుతూ. అతడికి అందకుండా ఊరిస్తూ, ఆటలాడటం ఆమెకో సరదా.

తన ప్లాన్‌ను నెమ్మదిగా వివరించింది ఆమె.

"శ్రీనివాస్....యింక నీవు నీ ఏర్పాట్లలో ఉండు." అతడిని గదిలో నుండి సాగనంపడానికి కుర్చీలోనుండి లేచిందామె. బిగుతైన స్కర్ట్‌లో నుండి బలంగా కదలు తున్న ఆమె పిరుదులను చూసేసరికి, తమకాన్ని ఆపుకో లేక పోయాడతడు. ఆత్రంగా ఆమె నడుం మీద చేయివేసి దగ్గరకు లాక్కున్నాడతడు.

సున్నితంగా అతడ్ని వారిస్తూ, అతడి కౌగిలిని విడి పించుకుంది ఆమె.

"ముందు మన ఎసైన్‌మెంట్ డార్లింగ్. కుప్పుస్వామిని

విడిపించి ఆ బంగారాన్ని చేజిక్కించుకుంటే....ఆ తరువాత మన యిష్టం."

మత్తుగా అతడి కళ్ళలోకి చూస్తూ అంది ఆమె. ఆమె పెదవులతో తన బుగ్గలమీద మృదువుగా రాస్తుంటే, మంత్రముగ్ధుడిలా గాలిలో తేలిపోతూ ఆమెతోపాటు ఆ కాటేజ్ బయటకు నడిచాడు అతడు. అతడు వెళ్ళి పోయిన అరగంట తర్వాత ఆ కాటేజ్ ముందు ఆగింది ఒక బుల్లెట్ మోటారు సైకిల్.

బుల్లెట్‌కు స్టాండ్ వేసి హుందాగా మెట్లెక్కి వస్తున్న బాలమురుగన్‌ను సాదరంగా ఆహ్వానించింది జరీనా.

గంటన్నర తరువాత అతడు కూడా వెళ్ళిపోయాడు. మరి కాసేపటిలో ఆమెను కలుసుకోవడానికి వచ్చాడు మీర్‌కాశిం.

శ్రీవాస్, బాలమురుగన్, మీర్‌కాశిం....వీరు ముగ్గురూ మద్రాసులో పేరు మోసిన క్రిమినల్స్. వారు ముగ్గుర్నీ ఆమె వేరు, వేరుగా కాంటాక్ట్ చేసినా వారికి అప్పగించిన ఎసైన్‌మెంట్ మాత్రం ఒక్కటే.

అది: కుప్పుస్వామిని సెంట్రల్ జయిల్‌నుండి విడి పించడం.

అయితే ఆ ఎసైన్‌మెంట్‌లో ముగ్గురికీ మూడు ప్రత్యేక మైన పనులకు వినియోగించిందామె. వారిలో ఏ ఒక్కరికీ మిగిలినవారి గురించిగానీ, ఆ ఎసైన్‌మెంట్‌లో మిగిలిన వారికి కేటాయింపబడ్డ పని గురించిగానీ ఏ మాత్రం కూడా తెలియదు.

దురదృష్టవశాత్తు, తమ ఎసైన్‌మెంట్ ఫెయిలయి వారిలో ఏ ఒక్కరైనా పోలీసులకు చిక్కినా. వారు ఆ ప్లాన్ పూర్తి వివరాలు చెప్పలేరు. అందుకే ఆమె అంత జాగ్రత్త

పడింది.

'కుప్పుస్వామిని సెంట్రల్ జైలు నుండి తప్పించి, ఆ బంగారం ఆచూకీ తెలుసుకున్నాక, కుప్పుస్వామి అడ్డం తొలగిస్తే, కోట్ల విలువజేసే బంగారంతో పాటు, బంగారం లాంటి జరీనా కూడా తమ వశమవుతుందని....' ఆ ముగ్గురూ కలలుకంటున్నారు.

"ఈ ఎసైన్‌మెంట్ పూర్తయితే నేను నీదాననేనని" ముగ్గురితోనూ నమ్మబలికింది జరీనా.

ఆ రాత్రే ఆమె మద్రాసునుండి రాజమండ్రికి బయలు దేరింది.

సరిగ్గా మద్రాసు సెంట్రల్ జైలునుండి కుప్పుస్వామి తప్పించుకొనే సమయానికి, ఆమె రాజమండ్రిలో ఒక ఫంక్షన్‌లో పాల్గొనబోతూంది. ఆ ఫంక్షనుకు డి. ఎస్. పి. ముఖ్య అతిథిగా వస్తున్నాడు.

ఆ ఎసైన్‌మెంట్‌తో తనకేమీ సంబంధం లేదని నిరూపించుకోవడానికి అంత పటిష్టమైన ఎలిబీని సృష్టించుకుంది ఆమె.

ఆ రోజు....అక్టోబర్ ఒకటి

2

1984—సింగపూర్.

రోజు, రోజుకూ విపరీతంగా పెరిగిపోతున్న బంగారం ధరను అదుపులో ఉంచడానికి, రిజర్వు బ్యాంకులోని బంగారం నిల్వలలో కొంత భాగాన్ని బహిరంగ వేలం ద్వారా బులియన్ మార్కెట్‌లోనికి ప్రవేశపెట్టాలని నిర్ణయించింది సింగపూర్ ప్రభుత్వం.

1978 లో అప్పటి భారతప్రధాని శ్రీ మొరార్జీదేశాయ్, ఆర్థికమంత్రి శ్రీ హెచ్. ఎం. పటేల్ కూడా సరిగ్గా

యిలాంటి నిర్ణయాన్నే తీసుకున్నారు.

ఆ రోజు ఉదయం సరిగ్గా తొమ్మిదిగంటలకు....

రిజర్వ్‌బ్యాంక్ నుండి బంగారాన్ని తెస్తున్నపోలీస్‌వాన్ సింగపూర్ గవర్నర్ బంగళాకు బయలుదేరింది. కొన్ని కోట్లరూపాయల విలువచేసే ఆ బంగారం గవర్నర్ పర్యవేక్షణలో ఆయన బంగళాలోనే వేలం వేయబడుతూంది.

ఆ వేన్‌లోని ఐరన్‌సేఫ్ చుట్టూ, హైపవర్డ్ రైఫిల్స్ పట్టుకుని ఆరుగురు సార్జెంట్స్ కూర్చుని ఉన్నారు. ఆ వాన్ చుట్టూ వలయంలా పదిమంది సార్జెంట్స్ మోటార్ బైక్స్ మీద వస్తున్నారు.

వేన్ చిల్డ్రిన్స్ పార్క్‌ను సమీపించింది. ఒకప్రక్క ఎత్తయిన పచ్చని గుట్టలు. మరోప్రక్క పెద్ద ఓక్, ఆలివ్ వృక్షాలతో అడివిలా ఉండే చిల్డ్రిన్స్‌పార్క్. ఆ రెండింటి మధ్యనున్న రోడ్డులోనికి ప్రవేశించింది ఆ వేన్.

సాయంత్రమయ్యేసరికి పసిపిల్లల కేరింతలతో, వారితో వచ్చిన పెద్దల గుంపులతో ఎంతో సందడిగా ఉండే ఆ ప్రదేశం పగలు మాత్రం నిర్మానుష్యంగా ఉంటుంది.

సరిగ్గా ఆ వేన్ ఆ మార్గంలోనికి ప్రవేశించి, పది గజాల దూరం వచ్చేసరికి, అకస్మాత్తుగా వారిపై కాల్పులు ప్రారంభమయ్యాయి. మోటారు బైక్స్ మీద ఎస్కార్ట్స్‌గా వస్తున్న సార్జెంట్స్ పిట్టల్లా నేలరాలిపోయారు.

పార్క్ గోడచాటునుండి మిషిన్‌గన్స్‌తో కాల్పులు సాగిస్తున్న తమ ప్రత్యర్థులను ఎదుర్కొనడానికి కూడా వారికి అవకాశం లభించలేదు.

మెషీన్‌గన్స్ మ్రోతను విన్నవెంటనే ప్రమాదాన్ని శంకించాడు ఆ వేన్ డ్రయివర్. ఆర్తనాదాలు చేస్తూ.... మోటారు సైకిళ్ళపైనుండి నేల కూలిపోతున్న

సార్జెంట్స్‌ను చూసేసరికి భయంతో అతడి కాలు ఏక్స్‌లేటర్‌పై బిగుసుకుంది.

ఆ ప్రదేశం నుండి ఎంత వేగంగా బయటపడితే అంత మంచిదని అనుకున్నాడతడు.

కాని, ఎదురుగా భూతంలా దూసుకువస్తున్న పెద్ద ట్రక్‌ను చూసేసరికి అతడి ముఖం మ్లానమయింది. ఆ ట్రక్ సరిగ్గా రోడ్డుకు అడ్డంగా వచ్చి ఆగింది. అదే సమయంలో మెషీన్‌గన్ గుళ్ళు ఆ వేన్ టైర్లను ఛిన్నాభిన్నం చేసాయి. పాములా రెండు మెలికలు తిరిగి. కీచుమని శబ్దంచేస్తూ ఆ వేన్ ఆగిపోయింది.

ప్రాణభయంతో క్రిందకు దూకి, పారిపోబోతున్న డ్రయివర్ శరీరం మెషీన్‌గన్ తూటాలతో జల్లెడలా మారింది. విసురుగా ఆ వేన్ తలుపులను తెరిచారు ఇద్దరు అగంతకులు. వారి చేతిలలోని మెషీన్‌గన్స్ ఆ వేన్‌లోని సార్జెంట్స్‌కు గురిపెట్టబడి ఉన్నాయి.

చేతిలో పెద్ద రైఫిల్‌తో నరరూప రాక్షసునిలా వారిద్దరి మధ్యా నిలచుని ఉన్న వ్యక్తివంక ఆందోళనగా చూసారు వాన్‌లోని ఐరన్‌సేఫ్ చుట్టూ కూర్చునిఉన్న సార్జెంట్స్.

అతడు....అంతర్జాతీయ నేరస్తునిగా పేరుమోసిన కుప్పుస్వామి. ఎన్నో దోపిడీలకు, హత్యలకు ప్రత్యక్షంగానో, పరోక్షంగానో మూలకారకుడైన కుప్పుస్వామిని సజీవంగా గాని, నిర్జీవంగాగాని అప్పగించిన వారికి లక్షరూపాయల బహుమానాన్ని ప్రకటించింది సింగపూర్ ప్రభుత్వం.

వేన్ డోర్ ఓపెన్ చేయబడ్డ మరుక్షణం అతడి కిరువైపులా ఉన్న ఇద్దరు అనుచరులూ ఫైరింగ్ ఓపెన్ చేసారు. రక్తపు ముద్దలలా నిర్జీవంగా నేలమీద పడ్డ

సార్జెంట్స్ శవాలను త్రొక్కుకుంటూ వేన్‌లోనికి ప్రవేశించాడు కుప్పుస్వామి.

ఐరన్‌సేఫ్ కీహోల్‌లో రైఫిల్ బారెల్‌ను పెట్టి ట్రిగ్గర్‌ను నొక్కాడు. భయంకరమైన ఎనుబోతులను, ఏనుగులను చంపడానికి ఉపయోగించే హంటింగ్ రైఫిల్ అది. ఆ ఐరన్ సేఫ్‌కున్న లాకర్‌ను బ్రద్దలు కొట్టడం దానికో సమస్యకాదు.

లాకర్ తెరచి అందులోని బిస్కట్ల రూపంలో ఉన్న బంగారాన్ని రెండు సూట్‌కేసులనిండా పేర్చారు కుప్పుస్వామి అనుచరులు.

బంగారాన్ని పేర్చడం పూర్తయిన వెంటనే ఒకడు గాలిలో చేతిని ఊపాడు. అంతవరకూ పార్క్ గేటువద్ద పార్క్ చేయబడ్డ ఒక మోరిస్ మైనర్ కారు దూసుకుంటూ వచ్చింది. కుప్పుస్వామి కారును ఎక్కి కూర్చోగానే, ఆ కారు బాణంలా ఆ ప్రదేశం నుండి దూసుకుని వెళ్ళిపోయింది.

కేవలం ఐదు నిముషాలలో ముగిసిపోయింది ఆ గోల్డ్ రాబరీ.

కొద్ది నిముషాల తరువాత హుటాహుటీగా ఆ ప్రదేశానికి చేరుకున్న సింగపూర్ పోలీసులకు రక్తసిక్తాలయిన తమ సార్జెంట్స్ శవాలు మాత్రం లభ్యమయ్యాయి.

ఇటు తన అనుచరులకూ, అటు సింగపూర్ పోలీసులకూ స్లిప్‌యిచ్చి ఎటో పరారయ్యాడు కుప్పుస్వామి.

కొన్ని కోట్లరూపాయల విలువచేసే ఆ బంగారం కోసం, కుప్పుస్వామి కోసం తీవ్రమైన అన్వేషణ ప్రారంభమయింది. అయితే విచిత్రమైన విషయం ఏమిటంటే, కుప్పుస్వామి కోసం వెతుకుతున్నది కేవలం పోలీసులు

మాత్రమేకాదు. చీకటి ప్రపంచపు అధినేతలైన మాఫియా గాంగ్‌లు కూడా.

ఎవరెంతగా ప్రయత్నించినా కుప్పుస్వామి ఆచూకీని మాత్రం కనిపెట్టలేకపోయారు.

సరిగ్గా సంవత్సరం తరువాత అంటే 1985 లో ఎవరూ ఊహించని విధంగా....చాలా సులువుగా కుప్పుస్వామి పోలీసులకు పట్టుబడ్డాడు, అదీ....ఇండియాలో.

కలకత్తా నుండి మద్రాసు వెళ్తున్న ట్రైన్ భువనేశ్వర్ దాటాక ఘోర ప్రమాదంలో చిక్కుకుంది. ఎందరో ప్రయాణీకులు గాయపడ్డారు. మరికొందరు చనిపోయారు.

గాయాలతో స్పృహతప్పి పడివున్న ఒక ప్రయాణీకుని చూసేసరికి వారిని ట్రీట్ చేస్తున్న డాక్టర్‌కు ఎందుకో అనుమానం వచ్చింది. అతడిని ఎక్కడో చూసినట్లు అనిపించసాగింది అతడికి.

సరిగ్గా అరగంట తరువాత అతడికి గుర్తుకు వచ్చింది ఆ పేషెంట్ ఎవరని....

అతడు....కుప్పుసామి.

కుప్పుస్వామిని పట్టియిచ్చిన వారికి పాతికవేల రూపాయల బహుమానాన్ని ప్రకటిస్తూ.... కుప్పుస్వామి ఫోటోతో సహా ఒక ప్రకటనను అన్ని దినపత్రికలలోనూ ప్రచురణకు యిచ్చింది భారత ప్రభుత్వం.

డాక్టర్ చూసింది ఆ ప్రకటననే. అతడు కాస్త తెలివైన డాక్టరు. కుప్పుస్వామి కొన్ని గంటలవరకూ నిద్ర లేవకుండా వుండడానికి అతడికి మత్తుమందునిచ్చి, ఆ తరువాత పోలీసులకు ఫోన్‌చేశాడతడు.

పాతికవేల రూపాయల బహుమానాన్ని అందుకోబోతున్నందుకుగాక, కుప్పుస్వామి లాంటి అంతర్జాతీయ

నేరస్తుడిని ప్రభుత్వానికి పట్టి యివ్వగలిగినందుకు ఎంతో గర్వంగా ఫీలయ్యాడు ఆ డాక్టర్.

అంతర్జాతీయ నేరస్తులకు సైతం అంతుచిక్కకుండా తప్పించుకోగల్గిన కుప్పుస్వామి, దురదృష్టవశాత్తూ ఆ రైలు ప్రమాదంలో చిక్కుకొని అలా పోలీసులకు పట్టుబడ్డాడు.

మద్రాసులో జరిగిన ఒక బ్యాంకు దోపిడీ నేరంపై కుప్పుస్వామి మీద విచారణ మద్రాసు హైకోర్టులో ప్రారంభమయింది.

కుప్పుస్వామి కేసు విచారణలో ఉండగానే, కుప్పుస్వామిని తమకు అప్పగించమని భారత ప్రభుత్వాన్ని కోరింది. సింగపూర్ ప్రభుత్వం.

సింగపూర్ న్యాయస్థానాలలో అతడికి విధింపబడ్డ శిక్ష ఉరిశిక్ష.

భారతీయ శిక్షాస్మృతి సెక్షను 394 ప్రకారం కుప్పుస్వామికి పది నెలలు కఠిన కారాగార శిక్ష విధించడం జరిగింది. అతడు మద్రాసు సెంట్రల్ జైలుకు తరలింపబడ్డాడు.

ఆ శిక్షాకాలం పూర్తయిన వెంటనే కుప్పుస్వామిని సింగపూర్ ప్రభుత్వానికి అప్పగించడానికి అంగీకరించింది భారతదేశం. సింగపూర్‌లో అడుగుపెట్టిన మరుక్షణం కుప్పుస్వామి ఉరితీయబడతాడు.

అంటే కుప్పుస్వామితోపాటు కొన్ని కోట్ల రూపాయలు విలువచేసే ఆ బంగారం రహస్యం కూడా శాశ్వతంగా భూస్థాపితం అవుతుంది. అలా కాకూడదనుకుంటే కుప్పుస్వామిని జైలునుండి తప్పించాలి.

అందుకోసం ఒక అత్యంత పటిష్టమైన ప్లాన్‌ను వేసింది అతడి ప్రియురాలు జరీనా.

3

అక్టోబరు రెండు....

దేశ ప్రజలకు గుర్తున్నా, లేకున్నా, ఖైదీలూ, జైలు సిబ్బందీ మాత్రం ఖచ్చితంగా గుర్తుంచుకొనే దినం అది.

ఆ రోజు జాతిపిత గాంధీజీ జన్మదినం.

పూజ్య బాపూజీ జన్మదిన సందర్భంగా ఆరోజు దేశమంతటా, కొందరు ఖైదీలు వారి, వారి శిక్షాకాలం తగ్గింపబడి జైళ్లనుండి విడుదల చేయబడతారు.

జైళ్లలోని ఖైదీలకు ఆరోజు మిఠాయిలు పంచబడతాయి. కొన్నిచోట్ల వినోద ప్రదర్శనలను కూడా ఏర్పాటు చేస్తుంటారు. జైలు ఆవరణలో స్వేచ్ఛగా తిరగడానికి ఖైదీలకు అనుమతి యివ్వబడుతుంది.

సంవత్సరానికొక్కమారు మాత్రం వచ్చే ఆ పర్వదినం కోసం యావజ్జీవ కారాగార శిక్షలలాంటి సుదీర్ఘమైన శిక్షలను అనుభవించే ఖైదీలు ఎంతో ఆత్రంగా ఎదురు చూస్తుంటారు.

ఆ రోజుకోసం కుప్పుస్వామి కూడా ఎంతో ఆత్రంగా ఎదురు చూస్తున్నాడు.

సాయంత్రం అయిదూ ముప్పయి.

మద్రాసు సెంట్రల్ జైలు ముందు ఆగిన ఒక ప్రైవేట్ టాక్సీలోనుండి దిగాడు ఒక అరవై ఏళ్ల వృద్ధుడు. ఖద్దరు పంచె, మోకాళ్ళు దాటిన ఖద్దరు జుబ్బా ధరించాడు. చత్వారం కళ్ళజోడు ముక్కుమీదకు జారి ఉంది. ఒత్తయిన తెల్లని గుబురు గెడ్డం అతడి ముఖంలో సగభాగాన్ని కప్పేస్తుంది.

చేతికర్ర ఆసరాతో మెల్లగా నడుచుకుంటూ జైలర్ గదిలోనికి వెళ్ళాడు ఆ వృద్ధుడు. అతడి వెనుకే రెండు పెద్ద మిఠాయిల గంపలను మోసుకుంటూ వచ్చాడు టాక్సీ డ్రైవర్.

శుద్ధ గాంధేయవాదిలా కన్పిస్తున్న ఆ వృద్ధుడిని ఆ స్వీట్స్ గంపలను చూసేసరికి అతడు వచ్చిన పనేమిటో అర్థమయిపోయింది ఆ జైలర్‌కు.

గాంధీ పుట్టినరోజు సందర్భంగా ఇలా స్వీట్స్. పళ్లూ ఖైదీలకు పంచటం అలాంటి గాంధేయవాదులకు అలవాటే. అందులోనూ వాటిని స్వయంగా తమ చేతులతో పంచడం వారికి మరింత ఆనందం.

జైలు ఆవరణలో ఖైదీలంతా వరుసగా నిలబెట్టబడ్డారు. ఆ వృద్ధుడు ఓపికగా వారికిందరకూ స్వీట్స్ పంచిపెట్టాడు.

కేవలం ఖైదీలకు మాత్రమే పంచిపెట్టటంతో తృప్తి చెందలేదతడు. జైలులోని సెంట్రీలు, ఇనస్పెక్టర్లు. ఆఖరికి జైలర్‌కి కూడా ఆ మిఠాయిలు నోట్లో పెట్టుకొనేంత వరకూ ఊరుకోలేదతడు.

ఆ వృద్ధుడి మాటను కొట్టేయలేక వారంతా తలా ఒక స్వీటు తిన్నారు. ఆ జైలు మొత్తం మీద ఆ మిఠాయిలను తిననివాడు కుప్పుస్వామి ఒక్కడే. తన కివ్వబడిన స్వీట్స్‌ను ఎవరూ చూడకుండా పొదల్లో జారవిడిచాడతడు.

ఆ మిఠాయిల్లో మత్తుమందు కలపబడిందని, వాటిని తిన్నవారు పది. పదిహేను నిమిషాలలో తెలివి తప్పి పడి పోతారని అతడికి ముందే తెలుసు.

సరిగ్గా నెలరోజుల క్రితం అతడిని చూడటానికి వచ్చింది అతడి ప్రియురాలు జరీనా. జైలులోని ఖైదీలతో విజటర్స్ మాట్లాడటానికి అనుమతింపబడే ఆ కొద్ది నిము

షాలలోనూ....అతడికి తన ప్లాన్‌ను కూలంకషంగా వివరించింది ఆమె.

ఆ రోజునుండి అతడు అక్టోబరు రెండవతారీఖు కోసం ఆత్రంగా ఎదురుచూస్తున్నాడు.

జైలరు, అతడి సిబ్బంది చూపించిన సహకారానికి కృతజ్ఞతలు చెబుతూ నెమ్మదిగా జైలు బయటకు నడిచాడు ఆ వృద్ధుడు.

ఆ వృద్ధుని వంక చూస్తూ చిన్నగా నవ్వుకున్నాడు కుప్పుస్వామి. అతడు నిజంగా వృద్ధుడు కాదని, వృద్ధునిలా వేషం మార్చుకున్న శ్రీనివాస్ అని కుప్పుస్వామికి బాగా తెలుసు.

తనకు జరీనా అప్పగించిన పనిని నిర్విఘ్నంగా నెరవేర్చాడతడు.

'కొద్ది గంటలలో కోట్లు విలువచేసే బంగారంతోపాటు బంగారు తీగెలాంటి జరీనా కూడా తన స్వంతం కాబోతుంది.'

ఆ ఊహే అతడికి ఎంతో ఆనందాన్నిస్తూంది. టాక్సీ బాక్ సీటులో వెనక్కు జారబడి రిలాక్సింగ్‌గా కన్నులు మూసుకున్నాడతడు. టాక్సీ మెల్లగా కదిలింధి.

4

అయిదూ....ముప్పయి.

తమిళనాడు వ్యవసాయ పరిశోధనా కేంద్రం. నిర్మానుష్యంగా ఉంది. అక్టోబరు రెండు శెలవు దినం కావడం చేత, ఆ కేంద్రంలో పని చేస్తున్నవారెవరూ ఆ రోజు రాలేదు.

ఒక్క గూర్ఖామాత్రం మెయిన్‌గేటు వద్ద బల్లమీద కూర్చుని బీడీ కాల్చుకుంటున్నాడు.

అంతవరకూ దూరంగా ఒక చెట్టుచాటున నిలబడి ఉన్న బాలమురుగన్ మెల్లిగా నడుచుకుంటూ ఆ గూర్ఖాను సమీపించాడు. తనవంక కళ్ళు చిట్లించి చూస్తున్న గూర్ఖాను చూసి చిరునవ్వు నవ్వాడతడు.

"ఒక్కసారి అగ్గిపెట్టె ఉంటే ఇస్తారా?"

ఎంతో నమ్రతతో హిందీలో అడిగాడతడు. గూర్ఖా పాంటు జేబులోనుండి అగ్గిపెట్టె తీయడానికి కాస్త వంగాడు.

కనుకొనలలో నుండి చుట్టూ చూసాడు బాలమురుగన్. మద్రాసు పట్టణానికి దూరంగా విసిరేసినట్లుంటుంది ఆ కేంద్రం. తన నెవరూ గమనించడంలేదని నిశ్చయించు కున్నాడతడు. అరచేతిని కత్తిలా బిగించి బలంగా గూర్ఖా మెడమీద కొట్టాడు.

ఆ దెబ్బకు, దబ్బుమని స్టూలుమీద నుండి నేలమీదకు పడ్డాడు ఆ గూర్ఖా. కనీసం మరో మూడు గంటల వరకూ అతడికి తెలివిరాదని బాలమురుగన్‌కి తెలుసు.

గేటు తెరచుకొని లోపలకు ప్రవేశించాడు. ఎదురుగా ఆ కేంద్రం ఆవరణలో కన్పిస్తున్న హెలికాప్టర్‌ను చూసే సరికి అతడి కళ్ళు ఆనందంతో మెరిశాయి. పొలాలపై క్రిమి సంహారక మందులను చల్లటానికి ఉపయోగించే మినీ హెలికాప్టర్ అది. పైలట్ గాక మరొక్కరు మాత్రం అందులో ప్రయాణం చేయడానికి అవకాశం వుంటుంది.

బాలమురుగన్ ఒకప్పుడు ఇండియన్ ఎయిర్‌లైన్స్‌లో పైలట్‌గా పనిచేసాడు. కేవలం జీతంతో తృప్తిపడే మనిషి కాడతడు. సంపాదనకోసం అడ్డదార్లు త్రొక్కా డతడు. స్మగ్లింగ్ చేస్తూ పట్టుబడటంతో ఉద్యోగం

పోయింది. ఆ తరువాత చీకటి ప్రపంచంలో నేరస్తుడుగానే స్థిరపడ్డాడు.

ఆ ఎసైన్‌మెంట్ కోసమే ఎక్స్‌పైలట్ అయిన బాలమురుగన్‌ను ప్రత్యేకంగా ఎన్నుకుంది జరీనా.

హెలీకాప్టర్‌ను సమీపించాడు బాలమురుగన్. ఫ్యూయెల్, ఇంజన్ చెక్ చేసుకున్నాడు. అన్నీ సరిగ్గా వున్నాయని నిశ్చయించుకున్నాక ఇంజన్‌ను ఆన్ చేసాడు.

సరిగ్గా అక్కడ సెంట్రల్ జైలులో శ్రీనివాస్ మిఠాయిలు పంచడం పూర్తిచేసేసమయానికి, బాలమురుగన్ హెలికాప్టర్‌ను మెల్లగా గాలిలోనికి లేపుతున్నాడు.

వ్యవసాయ పరిశోధనా కేంద్రం నుండి ఎగురుకుంటూ వస్తున్న ఆ హెలికాప్టర్‌ను చూసిన వారికెవరికీ అది కిడ్నాప్ చేయబడిందన్న అనుమానం కూడా వచ్చే ఆస్కారం లేదు.

ఆ హెలికాప్టర్ సూటిగా సెంట్రల్ జైలు వైపు దూసుకుంటూ పోసాగింది.

5

రాజమండ్రి....అయిదూ ముప్పయి....

కస్తూర్బా మహిళామండలి ఆవరణమంతా విద్యుద్దీప కాంతులతో వెలిగిపోతూంది. వేదికమీద ముఖ్య అతిథిగా వచ్చిన డి. ఎస్. పి. ఆసీనులై ఉన్నారు.

స్థానిక ఎం. ఎల్. ఎ. మహిళాభ్యుదయం గురించి మహోద్ధృతంగా ఉపన్యాసం ఇస్తున్నారు. అయితే ఆహుతుల దృష్టి మాత్రం మెరుపు తీగెలా మెరిసిపోతూ వేదిక మీద వయ్యారంగా నిలబడి వున్న జరీనా మీదే వుంది.

సరిగ్గా కుప్పుస్వామిని సెంట్రల్ జైలునుండి తప్పించడానికి ఆపరేషన్ ప్రారంభమయ్యే సమయానికి, ఆ

ప్లాన్‌ను రూపొందించిన ఆమె మాత్రం ఎంతో అమాయకంగా ఏమీ తెలియని దానిలా ఆ ఫంక్షన్‌ను నిర్వహిస్తూంది.

అయితే ఆమె కళ్ళు ఆమెకు తెలియకుండానే మాటి మాటికీ చేతికున్న రిస్టువాచ్ వంక చూస్తున్నాయి. ఎంత అణచుకుంటూన్నా ఆమెలో ఏదో తెలియని టెన్షన్ క్షణక్షణానికీ పెరిగిపోతూంది.

అందరూ....మత్తెక్కించే ఆమె అందాన్ని చూస్తుంటే, ఒక్క డి. ఎస్. పి. మాత్రం ఆమె ముఖంలోని అసహనాన్ని గుర్తించాడు. పోలీసు శాఖలో....బాధ్యతాయుతమైన ఆ పదవిలో ఎన్నో ఏళ్ళు....అనుభవం ఉన్న మనిషతడు.

ఆమెలోని అసహనం ఎందుకో అతడిలో అనుమానాన్ని రేపింది. కాని అతడు ఆ అనుమానాన్ని అంత సీరియస్‌గా తీసుకొనలేదు.

పోలీసు అధికారులలోని ఆ చిన్న నిర్లక్ష్యమే ఒక్కొక్కసారి నేరస్తులకు ఎంతగానో ఉపయోగపడుతుంది.

అతడు తన అనుమానాన్ని నివృత్తి చేసుకోవడానికి ప్రయత్నించి వుంటే....ఆమె మీద నిఘా ఏర్పాటుచేసి ఉండి వుంటే....కుప్పస్వామిని విడిపించటం కోసం ఆమె పన్నిన అద్భుతమైన వ్యూహం గురించి తెలుసుకుని వుండేవాడు.

6

ఆరు గంటలు.

మసక చీకట్లు మెల్లగా క్రమ్ముకుంటున్నాయి. సెంట్రల్ జైలులోని ఖైదీలు, సెంట్రీలు....జైలర్‌తో సహా అంతా మత్తుగా పడుకుని వున్నారు.

ఎక్స్‌టర్నల్ సెక్యూరిటీ గార్డ్సు మాత్రం ఎలర్ట్‌గానే వున్నారు. వారికి మత్తుమందు కలిపిన స్వీట్స్ పంచబడ లేదు. జైలు ప్రహరీ గోడ బయట కాపలాకాసే సెంట్రీలు వారు.

జైలు లోపల తమతోటి సెంట్రీలంతా మత్తుతో మొద్దుల్లా పడి వున్నారని వారికి తెలియదు. కొద్దిక్షణాలలో అంతర్జాతీయ నేరస్థుడైన కుప్పుస్వామి ఆ జైలునుండి తప్పించుకోబోతున్నాడని గాని....పన్నెండడుగుల ఎత్తయిన ఆ జైలుగోడలు, దానిమీద రెండడుగుల ఎత్తున్న ఎలక్ట్రికల్ వైర్ ఫెన్సింగ్. బలమైన ఇనుప తలుపులు, పెద్ద ఏనుగు తలకాయలాంటి తాళంకప్ప....అంత కట్టుదిట్టమైన కాపలా....ఇవేవీ అతడిని తప్పించుకోకుండా అడ్డగించలేవనిగాని....పాపం వారికి తెలియనే తెలియదు.

సిన్సియర్‌గా పహారా కాస్తున్నారు వారు.

జైలు లోపల....

శవాల్లా పడివున్న తోటి ఖైదీల మధ్య అసహనంగా పచార్లు చేస్తున్నాడు కుప్పుస్వామి. క్షణ క్షణానికీ ఆత్రంగా ఆకాశం వంక చూస్తున్నాడతడు.

విశాలమైన మైదానంలా వుంది అతడు నిలుచున్న ప్రదేశం, ఖైదీలకు ఎటెండన్స్ వేయడానికి. అప్పుడప్పుడు ఏదైనా సమావేశాలకూ ఉపయోగిస్తుంటారు ఆ స్థలాన్ని. హెలికాప్టర్ కాస్త అయినా క్రిందకు దిగాలంటే చెట్లూ చేమలూ అడ్డంకిలేని అలాంటి సమతల ప్రదేశం ఎంతయినా అవసరం. అందుకే అతడు అక్కడ నిలుచుని ఉన్నాడు.

ముందుగా చెవులు గింగురు మనిపించేటంత శబ్దం

వినిపించింది అతడికి. రెక్కలు చాచుకున్న పెద్ద రాకాసి పక్షిలా, సెంట్రల్ జైలు గోడ మీదగుండా ఏటవాలుగా లోపలకు దిగుతున్న హెలికాప్టర్‌ను చూసేసరికి ఆనందంతో అతడి ముఖం వెలిగిపోయింది.

జైలుగోడ దాటిన వెంటనే పెద్ద త్రాటినిచ్చెనను క్రిందకు జారవిడిచాడు బాలమురుగన్. హెలికాప్టర్ క్రిందనుండి వేగంగా పరుగెత్తుతూ ఆ త్రాడును అందుకున్నాడు, కుప్పుస్వామి. త్రాటి నిచ్చెనను పట్టుకొని పైకి ఎగబ్రాకసాగాడు. పైకి దూసుకుంటూ పోతున్న హెలికాప్టర్ వేగానికి ఆ త్రాటినిచ్చెన గాలిలో వైడ్‌గా ఊగసాగింది.

ఆకాశంలో చక్కర్లు కొడుతూ, నేలమీద ఎర కనిపించగానే సూటిగా దూసుకొని వచ్చి ఎరను తన్నుకొనిపోతుంది డేగ.

అదేవిధంగా గాలిలో....అర్ధచంద్రాకారంగా నేలకు పది, పదిహేను అడుగుల ఎత్తువరకూ వచ్చి....మళ్ళీ సూటిగా గాలిలోకి దూసుకుపోయింది ఆ హెలికాప్టర్. ఆ కాస్త వ్యవధిలోనూ కుప్పుస్వామి ఆ త్రాటి నిచ్చెనను కాచ్ చేయగలిగాడంటే ఆ ప్రొఫెషన్‌లో అతడికిలాంటివి అలవాటే కాబట్టి.

యిక హెలికాప్టర్‌తో అలాంటి క్లిష్టతరమైన స్నేచింగ్ ఫీట్‌ను చేయడానికి బాలమురుగన్ లాంటి ఏ కొద్దిమందో రిస్క్ తీసుకుంటారు.

కుప్పుస్వామి నిచ్చెనద్వారా పూర్తిగా పైకి ఎక్కి కేబిన్‌లోనికి ప్రవేశించాక, హెలికాప్టర్ వేగం పెంచాడు బాలమురుగన్.

గాలిలోనే షార్ప్‌గా టర్న్ చేసి సూటిగా ఉత్తర

దిక్కువైపు పోనిచ్చాడతడు.

హెలికాప్టర్ అలా తమ సెంట్రల్ జైలుమీదగుండా దూసుకుపోవడం తమాషాగా అనిపించింది బయటనున్న సెంట్రీలకు. వారికి అందులో నుండి వ్రేలాడుతున్న త్రాటి నిచ్చెన మాత్రమే కనిపించింది. త్రాటి నిచ్చెన పట్టుకుని పైకి ఎగబ్రాకుతున్న కుప్పుస్వామిని హెలికాప్టర్ బాడీ అడ్డేయటంతో వారి కతడు కనిపించలేదు.

కేవలం ఒకే ఒక్క నిముషంలో ముగిసింది ఆ స్నేచింగ్ ఫీట్.

హెలికాప్టర్ కనుమరుగయ్యేంతవరకూ చూసారు వారు. జస్ట్....మనుషులలో వుండే నేచురల్ ఇన్‌స్టింక్ట్‌చేత మాత్రమే వారలా చూశారు. ఆ తరువాత వారా హెలికాప్టర్ గురించి పూర్తిగా మరచిపోయారు.

దేన్నీ పట్టించుకోకపోవట మన్నదే పోలీసులలోని ప్రత్యేకత.

7

ఆరూ నలభై అయిదు.

విజయవాడ టౌన్‌కు దూరంగా వున్న ఒక పచ్చిక మైదానం మధ్య ఒంటరిగా నిలబడి వున్నాడు మీర్ కాశిం. అతడి ముందు ఎండు చితుకులు పెద్దకుప్పగా పేర్చబడి వున్నాయి. అతనికి కొద్ది దూరంలో రోడ్డు వారగా ఒక నల్లని అంబాసిడర్ కారు ఆగి వుంది.

ఒకసారి చేతికున్న రిస్టువాచ్ వంక చూశాడు అతడు. ఒక్క నిముషంపాటు వెయిట్‌చేసి, తారువాత అగ్గిపుల్ల గీచి ఆ చితుకుల కుప్పను అంటించాడు. అంతకు ముందే ఆ చితుకుల మీద పెట్రోలు పోసి వుండటంచేత వెంటనే అంటుకుని భగ, భగమంటూ మండసాగింది ఆ కుప్ప.

సరిగ్గా అప్పుడు వినిపించింది అతనికి హెలికాప్టర్ శబ్దం. చిరునవ్వుతో అతడి పెదవులు విచ్చుకున్నాయి.

హెలికాప్టర్‌ను నడుపుతున్న బాలమురుగన్ క్రింద నున్న పచ్చిక బయలులో ఎర్రని మంటను, దాని ప్రక్కనే అస్పష్టంగా కనిపిస్తున్న మానవాకారాన్ని చూశాడు. అదే సమయంలో మీర్‌కాశిం తన చేతిలోని పవర్‌ఫుల్ టార్చిలైటును అక్కడ నిలబెట్టబడి వున్న తన కారువైపు ఫోకస్ చేస్తూ టార్చిని మూడుసార్లు వెలిగించి ఆర్పాడు.

అది జరీనా వారికి చెప్పిన సంకేతం.

ఆ వెలుగులో కారును చూసిన బాలమురుగన్ సంతృప్తిగా తలాడించాడు. మరుక్షణం ఆ పచ్చిక బయలుపై ఆకాశంలో ఒక రౌండ్‌కొట్టి మెల్లగా హెలికాప్టర్‌ను క్రిందకు దింపాడు. హెలికాప్టర్ ఆగిన వెంటనే కుప్పుస్వామి, బాలమురుగన్ క్రిందకు దుమికారు.

వారికెదురుగా నడిచాడు మీర్‌కాశిం. అతడిని చూసి చిరునవ్వుతో చేయి ముందుకు చాచాడు బాలమురుగన్. మీర్‌కాశిం కుడిచేయి జేబులో వుంది. పాంటు జేబులో నుండి చెయ్యిని పైకి తీశాడతడు.

అతడి చేతిలో నల్లగా నిగనిగలాడుతూ మెరుస్తూంది పాయింటు థర్టీటూ కాలిబర్ రివాల్వరు. అది సూటిగా బాలమురుగన్ గుండెలకు గురిపెట్టబడి వుంది.

ఈ హఠాత్ పరిణామానికి కొయ్యబారిపోయాడతడు.

తను తీసుకున్న రిస్కుకు, తన శ్రమకు ఫలితం.... తన చావు అని వూహించలేకపోయాడతడు.

అతడు నోరు తెరచి ఏదో చెప్పబోయేంతలోనే మీర్‌కాశిం చేతిలోని రివాల్వర్ నిప్పులు కక్కింది.

రివాల్వర్ గుళ్లు గుండెలను ఛిద్రం చేస్తూ, దూసుకు పోతుంటే....కెవ్వుమని ఆర్తనాదం చేస్తూ నిర్జీవంగా నేల మీదకు వాలిపోయాడు బాలమురుగన్.

ఆశ్చర్యంగా చూస్తున్న కుప్పుస్వామిని చేయి పట్టు కుని కారు వైపు పరుగెత్తాడు మీర్‌కాశిం.

మనుషుల ప్రాణాలు తీయడం మంచినీళ్ళప్రాయం అతడికి. అందుకే ఆ ఎసైన్‌మెంట్ కోసం మీర్‌కాశింనే ఎన్నుకుంది ఒరీనా.

తన ప్లాన్‌కు సంబంధించిన ఏ చిన్న ఆధారమూ పోలీ సులకు లభ్యం కావడం ఆమెకు ఇష్టం లేదు. అందు కోసం ఎందరి ప్రాణాలను బలిపెట్టడానికయినా ఆమె సిద్ధమే.

కారును సమీపించారు వారిద్దరూ. డాష్‌బోర్డులోనుంచి ఒక కాగితపు పేకట్‌ను తీసి కుప్పుస్వామికి అందిం చాడు అతడు.

"ఆ జైలు బట్టలు విడచి వీటిని వేసుకోండి కుప్పు స్వామి."

కుప్పుస్వామి విడిచిన జైలు యూనిఫారంను అగ్గిపుల్ల గీచి అంటించాడు. తను తెచ్చిన క్రొత్తబట్టలు కుప్పు స్వామి ధరించిన తరువాత అతడిని వెనుక సీటులో కూర్చోమని చెప్పి, కారును స్టార్ట్ చేశాడు మీర్‌కాశిం.

అతడి సారథ్యంలో కారు శరవేగంగా రాజమండ్రి వైపు ప్రయాణించసాగింది. మళ్ళీ రాజమండ్రి చేరేటంత వరకూ వారిద్దరూ ఏం మాట్లాడుకోలేదు.

8

ఏడు గంటలు.

మద్రాసు నుండి బెంగుళూరు వెళుతున్న డీలక్స్

ఎక్స్ప్రెస్‌లోని ఫస్టుక్లాసు కంపార్టుమెంటులో రిలాక్స్‌డ్‌గా కూర్చుని వున్నాడు శ్రీనివాస్. ఇప్పుడతను వృద్ధుడి వేషంలో లేడు.

అతడి పని పూర్తయిన వెంటనే అతనిని బెంగుళూరు వెళ్ళమంది జరీనా.

అదే ఎందుకని అతడికి అర్థం కావటంలేదు. 'కుప్పుస్వామిని తీసుకొని జరీనా కూడా బెంగుళూరు వస్తుందా? ఏమో! జరీనా తనకు వివరాలేం చెప్పలేదు.'

కన్నులు మూసుకుని ఆలోచనల్లో మునిగి ఉన్న అతడు డోర్ తెరిచిన శబ్దం అయ్యేసరికి ఉలిక్కిపడి లేచాడు. ఎదురుగా ఇద్దరు ఆగంతకులు నిలబడి ఉన్నారు. కదులుతున్న ట్రయిన్‌లో అకస్మాత్తుగా ఆ కంపార్టుమెంట్‌లో ప్రవేశించిన వారిపై సదభిప్రాయం కలుగలేదు అతడికి. వారు మరో రెండడుగులు ముందుకు వేసారు.

మాటా, మంతీ లేకుండా తనను సమీపిస్తున్న వారిని చూసేసరికి అతడిలో అనుమానం ప్రవేశించింది. అప్పుడు చూశాడు వారి చేతికున్న గ్లౌవ్స్‌ను. వారెందుకు వచ్చారో అతడికి అర్థమయిపోయింది.

కాని.... ఇటీజ్ టూ లేట్.

వారు గండు చిరుతల్లా అతడిమీదకు లంఘించారు. పెనుగులాడుతున్న అతడిని ఒకడు గట్టిగా పట్టుకున్నాడు. కాలనాగుల్లా తన మెడను చుట్టుకుంటున్న రెండవవాని చేతులను చూసేసరికే సగం ప్రాణాలను కోల్పోయాడు శ్రీనివాస్.

కేవలం రెండు నిముషాలలో అతడు నిర్జీవంగా తల వాల్చేసాడు. అతడి శవాన్ని అలా ఆ సీటులో పడుకో బెట్టి ఆ కంపార్ట్‌మెంట్‌లో నుండి బయటపడ్డారు ఆ

ఆగంతకులు.

ఎందుకూ, ఏమిటీ అని అడక్కుండా డబ్బుకోసం ఎవరినైనా చంపగల హంతకులు వారు. శ్రీనివాస్‌ను చంపడానికి ఆ కిరాయి హంతకులను నియమించినది.... జరీనా.

మత్తుమందు కలిపిన మిఠాయిలను పంచిన వృద్ధుని కోసం పోలీసులు జీవితాంతం వెతుకుతూనే ఉంటారు. మద్రాసులో తప్పించుకున్న కుప్పుస్వామికి, బెంగుళూర్ ట్రయిన్‌లో, విజయవాడలో జరిగిన హత్యలకూ మధ్య సంబంధం ఉందని ఎవ్వరూ ఊహించలేరు.

అదే జరీనా వేసిన మాస్టర్ ప్లాన్‌లోని గొప్పతనం.

9

ఫంక్షన్ పూర్తయ్యేటప్పటికి రాత్రి తొమ్మిది దాటింది. అతిథుల్ని అందరినీ సాగనంపాక తన కారు వద్దకు నడిచింది ప్రముఖ సంఘసేవిక జరీనా.

డ్రయివర్ రామారావు వినయంగా డోర్ తెరిచాడు. జరీనా కూర్చునాక కారును స్టార్ట్ చేశాడు.

"ఓవర్ బ్రిడ్జివైపు పోనీ...." సీటులో విలాసంగా వెనక్కువాలుతూ అంది జరీనా. మౌనంగా తలూపాడు రామారావు.

అతడిలో ఆ గుణమే ఆమెకు బాగా నచ్చుతుంది. సుమారు సంవత్సరం నుండీ ఆమె దగ్గర నమ్మకంగా పని చేస్తున్నాడతడు—'తను చెప్పిన పని తూ.చా. తప్పకుండా చేయటం తప్పించి దానిని గురించి ఆరాలు తీయని మనిషి అతడు.'

ఎవరినీ నమ్మని జరీనా అతడిమీద ఆ నమ్మకంతోనే ఆ సమయంలో కూడా అతడిని తనతో కూడా ఉండ

నిచ్చింది.

అయితే ఈ సంవత్సర కాలంలో అతడు ఆమెకు కేవలం డ్రయివర్‌గానే కాదు. చాలా స్మగ్లింగ్ వ్యవహారాలలో అనుచరుడుగా కూడా వ్యవహరించాడు. అతడి పట్ల జరీనా కంత నమ్మకం ఏర్పడింది అందువలననే.

ఓవర్ బ్రిడ్జి దాటాక కారును ఆపమంది జరీనా. డ్రయివర్‌ను అక్కడే ఉండమని చెప్పి తనుమాత్రం సుమారు ఫర్లాంగు దూరం ముందుకు నడిచింది ఆమె. పెద్ద మామిడి చెట్టుక్రింద ఆగింది ఆమె.

సరిగ్గా పది నిముషాల తరువాత ఆమె నిరీక్షణ ఫలించింది. అయిదడుగుల దూరంలో వచ్చి ఆగిన నల్లని అంబాసిడర్ కారును, అందులోనుండి దిగుతున్న కుప్పుస్వామిని చూసేసరికి ఆమె ఆనందంతో పొంగిపోయింది.

పరుగున వెళ్ళి అతడి కౌగిలిలోకి వాలిపోయింది ఆమె. వారివంక చూస్తూ చిన్నగా నవ్వుకుంటూ కారు దిగాడు మీర్‌కాశిం.

"ఇంకెన్నాళ్ళు....రేపీపాటికి బంగారంతోపాటు నా వడిలో ఉంటావు జరీనా."

అనుకున్నాడతడు పెదవులు కొరుక్కుంటూ.

అయితే ఆ చీకటిలో జరీనా ఒక పేకట్ లాంటిది కుప్పుస్వామి చేతిలో పెట్టడం అతడు గమనించలేదు. అది టైం బాంబు.

కుప్పుస్వామి కౌగిలిని విడిపించుకుని, మీర్‌కాశింవద్దకు నడిచింది ఆమె. అతడి చేయి పట్టుకొని చెట్టుచాటుకు తీసుకుని వెళ్ళింది.

"మీర్" ముద్దుగా....మత్తుగా పలికింది ఆమె గొంతు. తన్మయత్వంతో ఆమె కళ్ళల్లోనికి చూశాడతడు. ఆమె

మె త్తని శరీరం అతడికి వత్తుకుంటూ గిలిగింతలు పెడు తుంది.

"మీర్ ....నీవు వెంటనే విజయవాడ వెళ్ళిపో. రేపు ఉదయం బయలుదేరి భద్రాచలం వచ్చేయి. మేం రాజ మండ్రి నుండి గోదావరిమీద బోటులో వస్తాం."

అతడి బుగ్గమీద సున్నితంగా ముద్దుపెట్టిందామె. అంతే? ఆ చిన్న ముద్దుకే అతడి శరీరం దూదిపింజలా గాలిలో తేలిపోసాగింది మంత్రముగ్ధుడిలా ఆమె చెప్పిన దానికి తలాడించాడతడు.

అయితే తను విజయవాడ వరకూ వెళ్ళలేడని జరీనా యిచ్చిన టైంబాంబును, తామిద్దరూ మాట్లాడుకున్న ఈ కాస్త వ్యవధిలోనూ కుప్పుస్వామి కారులో బిగించాడని.... అతడికి తెలియదు.

మృత్యుగహ్వారంలోనికి అడుగుపెడుతున్నట్లుగా కారు వంక నడిచాడు అతడు.

మీర్ కాశింను కావాలంటే అక్కడే ఆ క్షణంలోనే చంపేయవచ్చు. కాని, తమ చేతులకు మట్టి అంటుకో కుండా అతడిని హత్యచేయాలి. అదీగాక తను ఉంటున్న రాజమండ్రిలో హత్య జరగడం ఆమెకు యిష్టంలేదు. ఈ ఎసైన్‌మెంట్‌లో అతి చిన్న రిస్కును కూడా ఆమె తీసుకో లేదు.

కారును రివర్స్‌చేసి విజయవాడ వైపు పోనిచ్చాడు మీర్ కాశిం. వెళ్ళిపోతున్న ఆ కారువంక చూస్తూ క్రూరంగా నవ్వుకున్నారు వారు.

"మళ్ళీ ఎన్నాళ్ళకిలా స్వేచ్ఛగా తిరగగల్గుతున్నాను" జరీనా చేయి పట్టుకొని నడుస్తూ అనుకున్నాడు కుప్పుస్వామి.

అతడికిదంతా థ్రిల్లింగ్‌గా, నమ్మశక్యం కానట్లుగా

ఉంది. "రియల్లీ ఇట్స్ ఏ గ్రేట్ ఎస్కేప్."

వారు నడుచుకుంటూ ఓపర్ బ్రిడ్జి దగ్గరున్న కారును సమీపించారు. కారు దగ్గర నిలుచుని వున్న రామారావు వంక సంశయంగా చూశాడు కుప్పుస్వామి.

"ఫర్వాలేదు. మనవాడే. చాలా నమ్మకస్తుడు." కుప్పుస్వామివంక నవ్వుతూ చూస్తూ అంది జరీనా.

వారిద్దరూ కారులో కూర్చున్నాక కారును స్టార్ట్ చేశాడు డ్రయివర్.

10

ఆ రోజు రాత్రి....

రసకేళిలో అలసి, సొలసి తన గుండెలమీద వ్రాలిన కుప్పుస్వామి ముంగురులును గోముగా సవరించింది జరీనా.

"స్వామీ....డార్లింగ్! ఆ బంగారాన్ని తీసుకొని మనం ఏ స్విట్జర్లాండో, కెనడాయో వెళ్ళిపోదాం! నీవు తప్పించుకున్న విషయం మిగిలిన దేశాలకూ, మాఫియా గాంగ్ మనుషులకూ స్ప్రెడ్ కాకముందే మనం ఈ దేశాన్ని విడిచి వెళ్ళిపోవటం మంచిది."

ఆమె మాటలకు సంతృప్తిగా తలాడించాడు అతడు. ఒక్కసారి మీదకు జరిగి ఆమె పెదవులపై గాఢంగా ముద్దు పెట్టుకున్నాడు.

ఆ తరువాత మెల్లగా....యిన్నాళ్ళూ తన ప్రాణం కన్నా మిన్నగా దాచిన ఆ బంగారం రహస్యాన్ని ఆమెకు చెప్పాడు. అది కేవలం ప్రేమవలన కాదు.

ఇన్ని రిస్కులు తీసుకొని, సెంట్రల్ జైలులో మ్రగ్గుతున్న తనను....ఆమె విడిపించిందన్న ఏదో అనిర్వచించలేని తీయని భావం—అతడి గుండెలనిండా నిండిఉండటం చేత.

ఆమె ఆనందంతో అతడి ముఖాన్ని ముద్దులతో ముంచెత్తేసింది.

అయితే....వారిద్దరూ మాట్లాడుకున్న ప్రతి చిన్న మాట కూడా రికార్డు చేయబడిందవి వారికి తెలియదు. వారు పడుకొని ఉన్న మంచానికి హియరింగ్ బగ్స్ తగిలించి, వారి మాటలను రికార్డ్ చేసిన వ్యక్తి, పరాయివాడు కాడు. జరీనాను అంతగా నమ్మించ గలిగిన డ్రయివర్ రామారావు.

బీప్....బీప్....మంటూ పోలీసువాన్ సైరన్ వినిపించేసరికి ఉలిక్కిపడి లేచారు కుప్పుస్వామి, జరీనా. కిటికీ కర్టెన్‌ను ప్రక్కకు తొలగించి బయటకు చూశారు వారు.

చేతులలో రైఫిల్స్ పట్టుకుని బిల, బిలమంటూ వాన్ దిగుతున్న పోలీసులను చూసేసరికి వారి ముఖాలు తెల్లగా పాలిపోయాయి.

అదే సమయంలో ఆ గది తలుపులను తెరచుకుంటూ లోపలకు ప్రవేశించాడు రామారావు. అతడి ఎడమచేతిలో టేప్‌రికార్డర్ ఉంది. కుడిచేతిలోని రివాల్వర్ సూటిగా వారికే గురిపెట్టబడి ఉంది.

"యూ బోత్ ఆర్ అండర్ అరెస్ట్. తప్పించుకోడానికి ప్రయత్నిస్తే నిర్దాక్షిణ్యంగా కాల్చి పారేస్తాను...."

కటువుగా పలికింది రామారావు గొంతు.

"నీవు....నీవు...."

నమ్మలేనట్లు అతడివైపు చూసింది జరీనా.

"సారీ మేడమ్! కుప్పుస్వామి ఆచూకీ కోసం, అతడు దొంగలించిన బంగారం రహస్యం పరిశోధించడం కోసం ప్రత్యేకంగా నియమింపబడ్డ సి.ఐ.డి. ఇన్‌స్పెక్టర్‌ను నేను.

కుప్పుస్వామి ప్రాణంకన్నా మిన్నగా ఆరాధించే అతడి ప్రియురాలైన మీ వలన ఆ రహస్యం ఎప్పటికయినా బయటపడాలి. అందుకే మీ దగ్గర డ్రయివర్‌గా చేరాను. కుప్పుస్వామి జైలులో పెట్టబడ్డా, ఆ బంగారం రహస్యం తెలుసుకోవడానికి మీరు తప్ప నాకు మరో మార్గం కనిపించలేదు! అందుకే ఆ రహస్యం తెలుసుకొనేంతవరకూ మీ దగ్గరే డ్రయివర్‌గా కంటిన్యూ అయ్యాను. యూ ఆర్ ద లాస్ట్ గోల్ టు కుప్పుస్వామి.

కుప్పుస్వామీ....ఇట్స్ రియల్లీ ఎ గ్రేట్ ఎస్కేప్. అద్భుతమైన ప్లాన్‌తో తప్పించుకున్న నీవు....ఈ చివరి మజిలీలో మళ్ళీ పోలీసులకు చిక్కడం నిజంగా నీ దురదృష్టం."

అతడివంక పిచ్చివారిలా చూశారు జరీనా,కుప్పుస్వామి. అప్పుడే బేడీలతో ఆ గదిలో అడుగుపెట్టారు యిద్దరు పోలీసు ఇన్‌స్పెక్టర్లు. □

భర్త కనిపించుటలేదు!

మీ ఆయన పది రోజుల్నుంచి కనిపించట్లేదని రిపోర్టిచ్చావుగా.... లాడ్జిలో దొరికాడమ్మా.



సీరియల్

(గత సంచిక తరువాయి)

"నీముందు నేనోడిపోయాను. నీవంటి వారిని శాస్త్ర విజ్ఞానంలోకూడా సాధించలేమని ఈ రోజే అర్థమయింది నాకు. భగవంతుడు నీకు సాయపడాలనుకుంటే—నేను ఎదురు నిలవలేను గదా!" అన్నాడు జయరాజ్.

"నువ్వు నాకు వ్యతిరేకంగా పనిచేస్తున్నావని నే నెప్పుడూ అనుమానించలేదు. లేకుంటే వ్యవహారాన్నింత వరకూ రానిచ్చేవాడిని కాదు...." అన్నాడు జగపతిరావు.

జయరాజ్ గొంతు దుఃఖంతో పూడుకుపోయింది—

"ఎన్నో ఏళ్ళ నా కృషిని వ్యర్థం చేశావు. ఏమిటి నీ బలం? ఎక్కడుంది నీ శక్తి?"

జగపతిరావు పకపక నవ్వాడు.

"మనోబలం నా శక్తి. దృఢ సంకల్పం నా బలం. తెలివైన వాళ్ళను కూడగట్టుకోవడంలో నా తెలివుంది"

"అన్నిటికీ మించి దైవసహకారం కూడా వుంది...."

"ఆ విషయం ముందే గ్రహించి ఉంటే నువ్వింకా చాలాకాలం బ్రతికుండేవాడివి. దుర్మార్గుల్ని దేవుడే శిక్షిస్తాడని నీకు తెలియదా? నేను దుర్మార్గుడినే అయితే నన్ను శిక్షించే బాధ్యత భగవంతుడికి వదిలిపెట్టకుండా తామే భగవంతుడి అనుచరులనుకున్నవారంతా నీకులాగే నాశనమయ్యారు. వారిలో ప్రప్రథముడు ధనుంజయ్. ఆయన శిష్యుడివైన నీతో ఇలాంటి ప్రయత్నాలు అంత మవుతాయనుకుంటున్నాను...."

"ప్రొఫెసర్ ధనుంజయ్ నీకేమపకారం చేశాడు?"

"ఆయన నాకు చేసిన అపకారమింతా అంతా కాదు" అన్నాడు జగపతిరావు. తర్వాత ఆయన చుట్టూ వున్న అనుచరులకు కనుసైగ చేశాడు. వారు జయరాజ్‌నికూడా చేతులు వెనక్కు విరిచి కట్టారు. నిద్రపోతున్న నర సింహాన్ని ఇనుపగొలుసులతో బంధించారు.

"మీరిక వెళ్ళండి...." అన్నాడు జగపతిరావు.

అందరూ హాల్లోంచి వెళ్ళిపోయారు.

అప్పుడక్కడ జగపతిరావు, బంధించబడిన జయరాజ్,

ప్రకాష్, నరసింహం మిగిలారు.

"నా అనుచరులెందుకు వెళ్ళారో తెలుసా?"

జయరాజ్ తల అడ్డంగా ఊపాడు.

"ఈ రోజు రెడ్ పెల్‌లో కనీ వినీ ఎరుగని హింసను చూస్తాను. అనుభవం నీదీ, నీ అసిస్టెంటు ప్రకాష్‌దీను. ఆ ఏర్పాట్లు చేయడానికే వారు వెళ్లారు...."

"ఏమిటా హింస?" అన్నాడు జయరాజ్.

"ఏమిటో ఇప్పుడెందుకులే....వాళ్ళు మాత్రం చాలా ప్రిపేరవ్వాలి. కత్తులు నూరాలి. నూనెమరిగించాలి ఇంకా...."

ప్రకాష్ భయంతో ఒకసారి కళ్ళుమూసి తెరిచాడు.

"భగవంతుడు నిన్ను క్షమించడు...." అన్నాడు జయరాజ్.

"క్షమించేదాకా నేను తప్పులు చేస్తూనే వుంటాను" అన్నాడు జగపతిరావు.

"చేసేవి తప్పులని గ్రహించావు...."

"తప్పులు గ్రహించడమే కాదు. నీ ముందు చెప్పు కుంటాను కూడా—నా అనుచరు లిక్కడ్ణించీ పంపేయ డానికని రెండో కారణం...." అన్నాడు జగపతిరావు.

"అంటే?"

"చచ్చే ముందు నిన్ను బాధించే సందేహాలు తీర్చడం నా కర్తవ్యం. ఏమైనా ఉంటే అడుగు?" అన్నాడు జగపతి రావు.

జయరాజ్ కుత్సాహం వచ్చింది. అదృష్టవశాత్తూ ఏ దేవత తనను కాపాడితే ఇప్పుడు తెలుసుకున్న రహస్యా లుపయోగిస్తాయి.

"అడుగుతాను...." అన్నాడు జయరాజ్.

"నీ మొదటి సందేహం నాకు తెలుసు. నీ నరసింహాన్ని నేనెలా లొంగదీశానూ అని!" అన్నాడు జగపతిరావు. ఆయన చెప్పడం ప్రారంభించాడు.

మొట్టమొదట నరసింహాన్ని నందనరావు చూశాడు. నందనరావు నాయన అనుమానించి రెడ్ సెల్‌కి పంపాడు. నందనరావుకి రెడ్ సెల్‌లో హింసలకు బదులు నకిలీ పోలీసుల అవకాశమిచ్చాడు. నందనరావు నమ్మకస్థుడని ఋజువైంది.

ఆ వెను వెంటనే నరసింహం ఫోటో కొందరు అనుచరుల్ని చేరింది. అతణ్ణి వేటాడపలసిందిగా ఆర్డర్లు జారీచేయబడ్డాయి. అయితే నరసింహం శక్తి అపారమని తెలియడానికి వారికెంతోసేపు పట్టలేదు. అతడెవరికీ చిక్కలేదు. ఆ తర్వాత నరసింహం మూవ్‌మెంట్సుని జగపతిరావు అనుచరులు శ్రద్ధగా ఫాలో కావడం మొదలుపెట్టారు. ప్రకాష్ రంగంలోకి దిగగానే నరసింహం వెనుక ఎవరో ఉన్నారని అర్థమైంది.

నరసింహం జబర్దస్తీ చేసి శల్యారాజున్న గదిలో ప్రకాష్‌ని ప్రవేశపెట్టగలిగాడు. అప్పుడు జగపతిరావు కలపరపడ్డ మాట నిజం. ఆయన శల్యారాజు పక్కగదిలోనే వుండి క్లోజ్ సర్క్యూట్ టీవీద్వారా గదిలో జరుగుతున్నదంతా గమనించి సమయం చూసి వారికి స్పృహ తప్పించి వశం చేసుకున్నాడు.

నరసింహాన్ని ప్రకాష్ ఎలా అదుపుచేస్తున్నదీ దూరాన్నించి బైనాక్యులర్స్‌లో జగపతిరావు అనుచరులు గమనించారు. ఆ వివరాలన్నీ జగపతిరావు ఉపయోగించుకున్నాడు.

"నిన్ను చాలా తక్కువ అంచనా వేశాను. అనుభవిస్తున్నాను" అన్నాడు ప్రకాష్.

"అది నీ తప్పుకాదు. నన్ను అంచనా వేయడం నన్ను సృష్టించిన భగవంతుడికే చేతకావడం లేదు. అర్భకుడివి. నీవల్ల నవుతుందా?" అన్నాడు జగపతిరావు.

"నీ బలమంతా నీ అనుచరుల్లో ఉంది. వారినంత విశ్వాసపాత్రులుగా ఎలా మలుచుకున్నావు?" అన్నాడు జయరాజ్.

"అక్కడే సైన్సు పనిచేస్తుంది" అన్నాడు జగపతిరావు.

సైన్సు మనిషిని నవ్వించగలదు. సుఖపెట్టగలదు. కష్టపెట్టగలదు. మనిషి మెదడులో కలిగే ప్రతిభావ సంచలనానికీ ఓ రసాయనం ఆధారం. జగపతిరావు అనుచరులు అతడికి విశ్వాసపాత్రులుగా ఉండటానికి ధనుంజయ్ ఓ మందు కనిపెట్టాడు. కొన్ని ప్రత్యేకమైన పరిస్థితులలో మాటలతో ప్రభావితుణ్ని చేసి ఏమ పిక్కైగా ఆయన స్వయంగా ఆ మందు నిస్తే ఆ మనిషి ఆయనకు విశ్వాసపాత్రుడవుతాడు. ఆ మందుకు ప్రొఫెసర్ ధనుంజయ్— "T BLET FAITH" అని పేరు పెట్టాడు. అందుకు జగపతిరావాయనకు మంచి ప్రతిఫలం ఇచ్చాడు. ఒక సంవత్సరంపాటు ఆ మందు ప్రభావం పరీక్షించాక అప్పుడు ఫార్ములా ఆయనకు చెబుతానని ధనుంజయ్ అన్నాడు.

"TABLET FAITH" ను జగపతిరావు ద్వారా పరీక్షించాక దేశ ప్రయోజనాల కుపయోగించాలని ధనుంజయ్ సంకల్పం. దేశాన్నేలే మంత్రులకు, అధికారంలో కీలక స్థానాల్లో ఉన్న వారికి ఈ మందు నివ్వడం దేశానికే గొప్ప

ప్రయోజనకారి కాగలదని ఆయన ఆశించాడు. అయితే జగపతిరావిది పూర్తిగా స్వార్థానికే ఉపయోగించుకుంటున్నాడని తెలిసి ఆయన చాలా బాధపడ్డాడు. జగపతిరావును మాటలతో మార్చాలని ప్రయత్నించి విఫలుడయ్యాడు. అప్పుడాయన చాలా తెలివిగా వ్యవహరించాడు.

జగపతిరావుతో మంచిగా ఉంటున్నట్లు నటిస్తూనే ఆయన మరో రసాయన ప్రయోగం చేశాడు. ఫలితంగా "TABLET HATE" తయారైంది. నరసింహంమీద ఆయన ఆ మందును ప్రయోగించి అతణ్ని జగపతిరావుకు వ్యతిరేకంగా తయారు చేశాడు. ఈ విషయం ఆయనే జగపతిరావుకు చెప్పి—"నా "TABLET HATE" రహస్యం—నా ముఖ్య శిష్యుడి కంఠజేశాను. నువ్విప్పుడు నన్నేమీ చేయలేవు. నీ పద్ధతులు మార్చుకుని దేశానికుపయోగపడావంటే సరేసరి. లేదా—నీ అనుచరులనే నీకు వ్యతిరేకంగా తయారు చేయగలను" అని చెప్పాడు.

జగపతిరావు హడలిపోయాడు. ఆయన నరసింహాన్ని ఓ కంట కనిపెడుతూనే ఉన్నాడు. పురుషోత్తమరావింటికి చేరిన బ్రీఫ్‌కేసు గురించీ ఆయనకు తెలిసింది. అందులోని ఉత్తరాన్నలాగే వదిలి—డైరీల నాయన తీసుకున్నాడు.

ఆ డైరీల్లోని భాష జగపతిరావుకి అర్థంకాలేదు. అవన్నీ సైంటిఫిక్ ఫార్ములాలయుంటాయని ఆయన అనుకున్నాడు. అందులో TABLET FAITH. TABLET HATE గురించిన పూర్తి వివరాలున్నాయి. తన సైంటిస్టులచేత ఆ సమాచారాన్నుపయోగింపజేయాలని ఆయన అనుకున్నాడు.

ప్రొఫెసర్ ధనుంజయ్ తనకింక ప్రమాదకారి అని

ఆయనకు విషప్రయోగం చేశాడు జగపతిరావు. చెప్పుకో తగ్గ పబ్లిక్ ఫిగర్ కావడంవల్ల అంతకుమించి ఆయన నేమీ చేయలేకపోయాడు. ప్రొఫెసరు చావు గురించి ఎట్టి ఆరాలూ ఉండరాదని ఆయన కొడుకులను హెచ్చరించాడు.

"ఆ డైరీ లేమయ్యాయి?"

"నా వద్దనే భద్రంగా వున్నాయి...."

"అంటే నువ్విప్పుడు రెండు మందుల్నీ విచ్చలవిడిగా తయారుచేస్తున్నావన్న మాట?" అన్నాడు జయరాజ్.

"లేదు...." అన్నాడు జగపతిరావు.

"ఎందుకని?"

"ప్రొఫెసర్ ధనుంజయ్ చాలా తెలివైనవాడు. డైరీల్లో ఉన్న ఫార్ములాలు నీకు తప్ప యింకెవరికీ అందడం ఆయన కిష్టంలేదు. అందుకని ఆయన ఒక ప్రత్యేకమైన సిరా వాడాడు. నాకు చేరిన రెండు వారాల్లో ఆ ఫార్ములాలు మాయమయ్యాయి. కాళీ డైరీలు మిగిలాయి. డైరీల్లో మొదట కోడ్ భాషలో నీకేదో సూచించాడు. ఈ సిరా గురించి అందులో వివరించాడేమో నాకు తెలియదు. అపురూపమైన ఆ ఫార్ములాలు చేజేతులా పోగొట్టుకున్నాను...."

"మరి నీవద్ద యింకా "TABLET FAITH" ఉందా?"

"ఉంది. కానీ లిమిటెడ్ స్టాక్....అందుకే అది జాగ్రత్తగా వాడుకుంటూంటాను. నాకు బాగా దగ్గర అనుచరులకే ఆ మందిస్తూంటాను. ఇటీవల చంద్రశేఖరం అనే పోలీసాఫీసరు నాకు కొరకరానికొయ్యగా తయారైతే చివరకు తెలివిగా బుట్టలో వేసి TABLET FAITH

తినిపించాను. అదే నా లేటెస్టు విజయం....” అన్నాడు జగపతిరావు.

జయరాజ్ నిట్టూర్చాడు. ప్రొఫెసర్ ధనుంజయ్ పరిశోధన అద్భుతమైనది. అదంతా వృధాగా పోయింది.

“శాంపిల్ ఉంటే దాన్ని ఎనలైజ్‌చేసి తిరిగి ఎంతైనా తయారుచేయవచ్చుగా—” అన్నాడతడు.

“అదీ ప్రయత్నించాం. TABLET F ITH శాంపిల్స్ ఎనలైజ్ చేయడం జరిగింది. దాని కాంపోజిషన్ తెలిసింది. కానీ ఎంత ప్రయత్నించినా నా సైంటిస్టు లది సాధించలేకపోయారు. ధనుంజయ్ కూడా కావాలని ఇది తయారు చేయలేదు. దిసీజ్ ఏనాక్సిడెంటల్ డిస్కవరీ—” అన్నాడు జగపతిరావు.

చూసిన ప్రతి శాంపుల్ని తయారుచేయడమంత సులభమైతే—మనిషి ఫలాలకు చెట్లమీద ఆధారపడ నవసరం లేదు.

“నా కింకే సందేహాలూ లేవు. నువ్వు నీ కార్యక్రమం ప్రారంభించు....” అన్నాడు జయరాజ్.

“నీ శిష్యుడు బెదిరిపోయినట్లున్నాడు. బొత్తిగా నోరు విప్పడం లేదు—” అన్నాడు జగపతిరావు నవ్వుతూ.

ప్రకాష్ నవ్వి—“నేనంటే నీకే బెదురు. అందుకే నా చేతులు కట్టేశావు—” అన్నాడు.

“ఆత్మసంతృప్తి మంచిదే. ఆత్మవంచన ప్రమాదం—” అంటూ జగపతిరావు—“కమాన్ బాయిస్” అని గట్టిగా అరిచాడు.

వెంటనే హాల్లో చుట్టూ రివాల్వర్ మనుషులు ప్రత్యక్షమయ్యారు.

“గేముకు సిద్ధం చేయండి—” అన్నాడు జగపతి

అపరాధ పరిశోధన పోటీ-216

ఈ క్రింద కొన్ని ప్రశ్నలు, వాటి పక్కనే జవాబులు కూడా ఉన్నవి. మీరు సరియైనదని వూహించిన జవాబును, నెంబరు వారీగా ఒక (పోస్టుకార్డు సైజు) తెల్ల కాగితం పై వ్రాసి, దానితో రూ 1.00 విలువగల పోస్టలు స్టాంపులు జతపరచి పంపండి. ఆల్ కరక్టుగా పంపిన వారికి ఒక్కొక్కరికి ఒక ఏడాదిపాటు పత్రిక లేదా సప్లిమెంట్ ఉచితంగా పంపుతాము.

దీనిలో ఎవరైనను పాల్గొనవచ్చును. ఒక్కొక్కరు మూడు కూపన్లకు మించి పంపరాదు. ప్రతి కూపనుకీ రు. 1-00 పోస్టలు స్టాంపులు జతపరచాలి. స్టాంపులు వేటికి అతికించకూడదు. ప్రతి కూపను వెనుక మీ పూర్తి చిరునామా, హోం. డె. సభ్యులైతే వారి నెంబరు కూడా స్పష్టంగా వ్రాయాలి.

మీ జవాబులు 7-7-'86 తేదీలోగా మాకు చేరాలి. ఫలితాలు సెప్టెంబరు'86 నెల సంచికలో ప్రచురిస్తాము. *

1. ఇటీవల పొరుగు దేశాలపై దాడిచేసిన మరో దేశం—? (అమెరికా, దక్షిణాఫ్రికా)
2. మనిషికి తరచుగా వచ్చే జబ్బు—? (జలుబు, తలనొప్పి)
3. కొందరు రాజకీయ నాయకులను వీటితో పోలుస్తారు—? (గోడమీది పిల్లులు, గొర్రెదాటు)
4. స్త్రీల కివంటె ఎంతో ఇష్టం—? (పిల్లల కేరింతలు, పువ్వుల పరిమళాలు)
5. ఇది లేకుంటే కొందరికి నిద్రం రావదు—? (కరెంటు, టెలిఫోన్)

రావు.

రివాల్వర్ మనుషుల్లో ఒకడు మూడు దోమతెర గుడ్డల్లాంటివి తెచ్చాడు. ఒకటి జగపతిరావు కిచ్చాడు. మిగతా రెండింటినీ, జయరాజ్ - ప్రకాష్‌లమీద కప్పాడు. తను మళ్ళీ యథాస్థానంలోకి వెళ్ళాడు.

"నేను వేసుకున్నది బులెట్ ప్రూఫ్ గుడ్డ. ఇది మీద కప్పుకుంటే మెషీన్ గన్ కు ఎదురునిలిచినా ఏమీకాదు. మీ యిద్దరిలో ఒకరిది బులెట్ ప్రూఫ్ గుడ్డ రెండోది మామూలుది. ఎవరేది కప్పుకున్నారో అది మీ అదృష్టాన్నిబట్టి ఆధారపడి ఉంటుంది. ఇప్పుడు చుట్టూ ఉన్నవాళ్ళు మన మీద ఆగకుండా కాల్పులు జరుపుతారు. మీ యిద్దరిలో యెవరు మిగుల్తారో చూద్దాం—మిగిలిన వాడికింకా ఆసక్తికరమైన గేమ్సుంటాయి—" అన్నాడు జగపతిరావు.

తన మాటలు పూర్తిచేసి జగపతిరావు నేలమీద కూర్చున్నాడు. ఇప్పుడాయన పూర్తిగా దోమతెర ముసుగులో ఉన్నాడు. ఆయన్ను చూసి జయరాజ్, ప్రకాష్‌లు కూడా అలాగే చేశారు.

"మూడంకెలు లెక్కపెడతాను. రెడీ...." అన్నాడు జగపతిరావు.

అప్పుడు ప్రకాష్‌కి ప్రాణభయం కలిగింది.

"క్షమించండి సార్! నా అజాగ్రత్తలో నా ప్రాణాల్నే కాక మీ ప్రాణాలనూ బలి చేస్తున్నాను—" అన్నాడతడు.

"నువ్వు చేసింది పొరపాటు కాదు. సాహసం. విచారించకు. సాహసం ఊరికేపోదు...." అన్నాడు జయరాజ్ నిశ్చలంగా.

"వన్...." అన్నాడు జగపతిరావు.

ప్రకాష్ కళ్ళు మూసుకున్నాడు.

పుస్తకాలు అనేక రకాలు!

ముఖ్యంగా రెండువిధాలుగా విభజిస్తారు!

1. BOOKS OF THE HOUR
2. BOOKS FOR EVER

సస్పెన్స్ థ్రిల్లర్స్ "బుక్స్ ఆఫ్ ది అవర్" గా పరిగణించబడతాయి!

ఎందుకంటే....సస్పెన్స్ ఏమిటో తెలిసిపోయాక వాటిని రెండోసారి చదవలేం కదా!

సెంటిమెంట్, లవ్ థీమ్స్ని "బుక్స్ ఫర్ ఎవర్" గా పరిగణిస్తారు!

ఎందుకంటే....వాటిని వీలున్నప్పుడల్లా మళ్ళీ మళ్ళీ చదువుకోవచ్చు కనుక!

తెలివైన పాఠకులు 'బుక్స్ ఫర్ ఎవర్' ని కొనుక్కుంటారు!

'బుక్స్ ఆఫ్ ది అవర్' ని అద్దెకు తెచ్చుకుని చదివి యిచ్చేస్తారు!

శ్రీమతి యద్దనపూడి సులోచనారాణి డైరెక్ట్ నవల

వెన్నెల్లో గోదారి వెల రూ. 20/-

బుక్స్ ఫర్ ఎవర్ category లోకి వస్తుంది కాబట్టి వెంటనే కొని చదవండి! మళ్ళీ మళ్ళీ చదువుకోండి! పోస్టులో తెప్పించుకోదలిస్తే రూ. 10/- ఎం.ఓ. చేయండి! మిగతా రూ.10 లకి వి.పి.పెట్టి పంపిస్తాము.

ఆంధ్రప్రదేశ్ బుక్ డిస్ట్రిబ్యూటర్స్,

3237, రాష్ట్రపతి రోడ్, సికింద్రాబాద్ - 500 003.

"టూ...." అన్నాడు జగపతిరావు.

"భగవంతుడా—నువ్వంటూ ఉంటే నేను. జయరాజ్ గారు బ్రతికే ఉండాలి. మా యిద్దరికీ ఎమీ కాకూడదు...." అనుకున్నాడు ప్రకాష్.

"త్రీ...." అన్న జగపతిరావు గొంతు వింటూనే రివాల్వర్ మనుషులు గురిచూసి పేల్చడం మొదలు పెట్టారు.

గదంతా యుద్ధరంగంలా శబ్దాలతో మ్రోగిపోతోంది.

ప్రకాష్‌కు వంటినిండా ఏమేమో తగుల్తున్నట్లే ఉంది కానీ వంటికి గాయాలు కావడంలేదు.

కాసేపటికి ప్రేలుడు శబ్దం ఆగింది. ఆ వెనువెంటనే జగపతిరావు వికటాట్టహాసం వినబడింది.

ప్రకాష్ కళ్ళు మూసుకునే ఉన్నాడంతసేపూ! అతడు నెమ్మదిగా కళ్ళు విప్పాడు. అప్పుడే లేచి నిలబడి ఎడ తెరిపిలేకుండా వికటాట్టహాసం చేస్తున్న జగపతిరావు ముందుగా అతడికి కనిపించాడు.

ప్రకాష్ తల పక్కకుతిప్పి ఉలిక్కిపడ్డాడు.

7

"జగపతిరావుగారు కష్టాల్లోపడ్డారు—" అంది చంప అప్పుడే యింట్లో అడుగుపెట్టిన భర్తతో.

"అలాంటిదేం లేదే!" అన్నాడు నందనరావు.

"లేకేం? నరసింహం ఆయన మీదకు దాడి వెళ్ళాడు...."

నందనరావు నవ్వి—"ఆ విషయం నాకు తెలుసు. కానీ నీకు తెలియని విశేష మొకటుంది—" అన్నాడు.

"ఏమిటది?"

"ఆయన నరసింహాన్ని లొంగదీసి రెడ్ సెల్‌కు

"హోమ్ డెలివరీ"

1. 'హోమ్ డెలివరీ' లో పాఠకులు ఎవరైనను చేరవచ్చును. దీనికి మీరు చేయవలసిందల్లా సభ్యత్వ రుసుము రు. 10/-లు పంపటమే. సొమ్ము చేరగానే మీకు సభ్యత్వము ఇవ్వబడుతుంది.

2. సభ్యులకు "అపరాధ పరిశోధన" పత్రికలు వాటి అసలు ధరకే లభిస్తాయి. అంతేకాదు—వారికి పత్రికలన్నీ 'రిజిష్టరు పోస్టు' లో అందజేస్తాము. ప్రతి 6 నెలలకు ఒకసారి అంటే- జనవరి మరియు జూలై నెలల పత్రికలు మాత్రం వి.పి. ద్వారా పంపబడతాయి. వి.పి. వచ్చినప్పుడు మీరు పోస్టుమాన్‌కు అర్థ సంవత్సర చందా చెల్లించవలసి వుంటుంది. పోస్టు ఖర్చులన్నీ (ఏడాదికి రు. 48/-లు) మేమే భరిస్తాము. పత్రికల ఖరీదు కుంచి మీరు పైసా చెల్లించనవసరం లేదు.

3. 'అపరాధ పరిశోధన' మాసపత్రిక మరియు సప్లిమెంట్‌కు కలిపి అర్థసంవత్సర చందా రు. 84/-లు మాత్రమే. మధ్యలో సభ్యులుగా చేరినవారికి మాత్రం తర్వాత నెలలకు లెక్కవేసి మొదటి వి.పి. పంపబడుతుంది.

4. ఏ కారణం చేతనైనా మీకు పంపిన వి.పి. తిరిగొస్తే, ఆ వి.పి. సెకము మీరు వెంటనే M O. చేయాలి. లేనిచో, మీ సభ్యత్వము అంతటితో రద్దవుతుంది. మీ చిరునామా మారినప్పుడు వెంటనే మాకు తెలియజేయాలి. ఆ సమయంలో మీ సభ్యత్వము నెంబరు మారే అవకాశం వుంది. కావున మీకు ప్రతి నెలా వచ్చే ప్యాకెట్ పై-మీ పేరుకు ముందు వుండే నెంబరును మాత్రమే ఉత్తర ప్రత్యుత్తరాలలో వ్రాయగోర్తాము.

5. సభ్యులకు ప్రతి నెలా V.P. ద్వారా పత్రికలు తెప్పించుకునే సౌకర్యంకూడా వుంది. అయితే వి.పి. ఖర్చులుకూడా వారే భరించవలసి వుంటుంది. ఈ పద్ధతిలో పత్రికలను ఏ నెలకానెల రు. 17-60 లు చెల్లించి పొందవచ్చును. యీ సౌకర్యం కావలసిన వారు మాకు ప్రత్యేకంగా తెలియజేయాలి.

హోమ్ డెలివరీ!—పత్రికలకు గ్యారంటీ!!

తీసుకుని వెళ్ళాడు. ఆ విషయం రంజన్ నాకు చెప్పాడు....''

చంప ముఖం పాలిపోయింది. అలా జరక్కుండా వుండివుంటే బాగుండునని ఆమె కోరుకుంది. అయితే ఆమె బుర్ర చురుగ్గా పని చేసింది. భర్త మాటలు వింటూనే ఆమె—"అయితే భగవంతుడు నా ప్రార్థనలు విన్నాడన్న మాట?'' అంది.

"ప్రార్థనేమిటి?'' అన్నాడు నందనరావు.

నరసింహం జగపతిరావుమీదకు దాడి వెడలినట్లు తెలిసింది చంపకు. వెంటనే జగపతిరావుకు హాని జరక్కుండా కాపాడమని ఆమె దేవుణ్ణి ప్రార్థించింది. ఆయన పాపాలు క్షమించమనడానికి—ఆయనేం పాపాలు చేశాడో ఆమెకు తెలియదు. ఆమెకు తెలిసిన పాపం—శోభ కిడ్నాపింగ్! అదే చెప్పి దేవుణ్ని ప్రార్థించిందామె.

"దేవుడి ముందు పాపం చెప్పడమెందుకు?''

"చేసిన పాపం చెబితే పోతుందని మీకు తెలియదా!''

ఆమె మాటలు వింటూనే నందనరావు పకపకా నవ్వసాగాడు.

"నవ్వుతారేం?''

"నీ ప్రార్థన వృథా....''

"ఎందుకని?''

"శోభ కిడ్నాపింగ్ జగపతిరావుగారు చేయలేదు. అది సైంటిస్ట్ జయరాజ్ ప్లాను....''

"ఎలా తెలిసింది!''

"జయరాజ్ అసిస్టెంటు ప్రకాష్ స్వయంగా శోభకు చెబుతూంటే విన్నవాళ్ళు జగపతిరావుగారికి చెప్పేశారు''



మా వద్ద సాంఘిక నవలలు, డిటెక్టివ్‌లు, బాల సాహిత్యం, నాటకములు. వైద్య, విద్య మరియు స్కూలు, కాలేజి విద్యార్థులకు అచ్చుపుస్తకములు, ఎక్సర్‌సైజు పుస్తకములు, స్టేషనరీ మొదలగునవి లభించును.

శ్రీ గణేశ్ బుక్ హౌస్

(బుక్ డిస్ట్రిబ్యూటర్స్ & స్టేషనరీ)

టౌన్‌హాల్ రోడ్డు—రాజమండ్రి - 1.

అంటూ అతడు శోభ కిడ్నాపింగ్‌లో ఉన్న రహస్య గాథ నామెకు చెప్పి—"ఇదీ నాకు రంజన్ చెప్పాడు...." అన్నాడు.

"చాలా ఆశ్చర్యంగా వుంది...." అంది చంప.

"జగపతిరావుగారు చేయని పాపం చెప్పావు. అందువల్ల నీ భగవంతుడి కాయన్ను రక్షించే అవకాశం లేదు. అయితే అదే మంచిదిలే—జగపతిరావంతటివాడు తన తెలివితో సాధించినదాన్ని—నువ్వు భగంతుడి కంటగట్టేదానివి...."

తన పథకం బెడిసికొట్టినందుకు చంప కాస్త దెబ్బ తిన్నప్పటికీ—మనసు చిక్కబట్టుకుంది. ఆమె వెంటనే- "అయ్యో! నేను దేవుడికి జయరాజ్ చేసిన పాపం చెప్పుకున్నానన్న మాట. అంటే ఆయన పాపమే పోయింది. దేవుడు జయరాజ్‌కే సాయపడతాడు. దేవుడికి జగపతిరావుకు సాయపడే ఉద్దేశ్యం లేక నాచేత అలా చేయించాడు. పాపం—జగపతిరావుగారి నెవరు కాపాడుతారో ఏమో!" అంది.

"నువ్వాయన గురించి వర్రీకావడం మాని నా సంగతేమైనా చూస్తావా?" తీవ్రంగా అన్నాడు నందనరావు.

ఇంక భర్తకు కోపం వస్తున్నదని గ్రహించి చంప సంభాషణ ఆపివేసింది.

28

జయరాజ్ కళ్ళు తెరిచాడు. రివాల్వర్ గుళ్ళకు తను బలికాలేదన్న మాట! అతడు ప్రకాష్‌వైపు చూసేలోగా జగపతిరావు స్వరం ఖంగుమంది.

"డియర్ ఫ్రెండ్స్! తప్పించుకున్నామనుకుని సంతోషపడకండి. ఇప్పుడు పేల్చబడిన తూటాలు డమ్మీవి. మీ

ముఖచిత్ర వ్యాఖ్యల పోటీ

ఈ నెల "అపరాధ పరిశోధన" ముఖచిత్రాలను పరిశీలించండి. రెండు ముఖచిత్రాలకు (1. అట్టమీద బొమ్మ, 2. అట్ట చివరి బొమ్మ) సంబంధం వుండేట్లుగా చక్కని వ్యాఖ్యలను ఒక్క మాటలోగాని, చిన్న వాక్యంలోగాని వ్రాసి పంపండి.

ఒక్కొక్కరు ఎన్ని వ్యాఖ్యలైనా పంపవచ్చును. మీ వ్యాఖ్యలు పోస్టు కార్డుపైన మాత్రమే వ్రాయాలి. సప్లిమెంట్‌కు వ్యాఖ్యలను పంపేవారు విడిగా వేరొక కార్డుపై వ్రాసి పంపాలి. 'హోమ్ డెలివరీ' సభ్యులు అయితే తమ నెంబరును విధిగా వ్రాయాలి.

అత్యుత్తమమైన వ్యాఖ్యలు పంపిన ఇద్దరు పాఠకులకు ఏడాదిపాటు పత్రికను (లేదా 6 నెలలపాటు పత్రిక మరియు సప్లిమెంట్‌ను) బహుమతిగా పంపుతాము. మీ వ్యాఖ్యలు 7-7-'88 తేదీ లోపల మాకు చేరాలి. ఫలితాలు సెప్టెంబరు '88 నెల సంచికలో ప్రకటిస్తాము.

మే '86 పోటీ ఫలితాలు

(1) మే '88 నెల "అపరాధ పరిశోధన" ముఖచిత్రాలకు బహుమతి పొందిన వ్యాఖ్య:

పరువమా పరుగు లెత్తకు!

పగవాడి ప్రాణం తీయకు!!

పంపినవారు: శ్రీమతి జి.కె. శకుంతల, బి.ఏ., అగ్గి మర్రి చెట్టి వీధి, అనకాపల్లి—531 002 (విశాఖ జిల్లా.)

(2) "సప్లిమెంట్"కు బహుమతి పొందిన వ్యాఖ్య:

కందిరీగల రొద!

కదనరంగానికి పద!!

పంపినవారు: శ్రీ ఆర్. పట్టాభిరామరాజు, అడ్వొకేట్, 14, ఎన్.టి.ఆర్. బిల్డింగ్స్, గిరిపురం, తిరుపతి—517 501.

మానసిక బలాన్ని పెంచడానికి చేసిన ఏర్పాటిది. ఒకసారి తప్పించుకున్నాకనే కదా — యెవరికైనా ప్రాణాలపై విలువ పెరుగుతుంది. మళ్ళీ నేను మూడంకెలు లెక్కపెడతాను. ఈసారి నిజం తూటాలు వస్తాయి. మీ యిద్దరిలో యెవరు అదృష్టవంతులో తేలిపోతుంది....” అంటూ “వన్....” అన్నాడు.

జయరాజ్ వెంటనే కళ్ళు మూసుకున్నాడు.

ప్రకాష్ మాత్రం కళ్ళు మూసుకోలేదు. చెప్పాలంటే ఆశ్చర్యంతో అతడి కళ్ళు మరికాస్త పెద్దవయ్యాయి. నేల మీద పడుకునివున్న నరసింహం—రివాల్వర్ మోతకు కాబోలు మెలకువ వచ్చి కళ్ళు విప్పాడు. అతడు చుట్టూ చూస్తున్నాడు. జగపతిరావతణ్ని గమనించినట్లు లేదు.

జగపతిరావు వన్ అనేసరికి నరసింహం ఒక్క ఎగురు ఎగిరి లేచి నిలబడ్డాడు.

అప్పుడు జగపతిరావు నరసింహాన్ని చూశాడు. చటుక్కున ఆయన—మీద కప్పుకున్న బుల్లెట్ ప్రూఫ్ గుడ్డను తీసివేశాడు.

నరసింహం ఒక్కసారి వళ్ళు విరుచుకున్నాడు. ఇనుప గొలుసులు ఫెళఫెళ విరిగాయి.

జగపతిరావు జేబులో నుంచీ రిమోట్ కంట్రోల్ తీశాడు.

నరసింహం మెరుపు వేగంతో అతడి చేతిలోని రిమోట్ కంట్రోల్ లాక్కున్నాడు. చేత్తో నలిపి పిండి పిండి చేశాడు.

జరిగిందానికి జగపతిరావు తెల్లబోయాడు.

నిద్రపోతున్న నరసింహానికి మెలకువ ఎలా వచ్చింది? రిమోట్ కంట్రోల్ లేనిదే యిప్పుడతణ్ని అదుపుచేయడం

శ్రీ మహాలక్ష్మి వారు ప్రచురించిన

'అపన' సీరియల్స్!

1. పారిపోయిన ఖైదీలు	ఇల్లాం వెంకటకృష్ణమూర్తి	12.00
2. బలికోరిన వజ్రాలు	,,	12.00
3. కాంచన శిఖరం	వాణిశ్రీ & ఏ.వి. మోహన్‌రావ్	20.00
4. కైలాస నగరం	శ్యాంబాబు	15.00
5. ఖైదీ	ఏ. వి. మోహన్‌రావ్	20.00
6. అతీంద్రియ శక్తులు	రమణశ్రీ	18.00
7. కాంచన గ్రహం	వాణిశ్రీ	17.00
8. నరాంతకులు	వసుంధర	13.00
9. అమానుషం	,,	15.00
10. మల్లెలు మందారాలు	,,	17.00
11. నిను వీడని నీడను నేనే!	,,	16.00
12. శాన్యోరా	ముద్దా సురేష్	20.00
13. సాగరలోయ	బొమ్మికి అచ్యుతరావు	17.00
14. కళ్యాణ దుర్గం	,,	20.00
15. విష సర్పాలు	సికిందర్	18.00

అడ్వాన్సుతోపాటు నేడే మీ ఆర్డరు పంపండి.

ఫోన్ నెం : 63322

శ్రీ మహాలక్ష్మి బుక్ ఎంటర్‌ప్రైజెస్

గవర్నరు పేట : : విజయవాడ - 2.

ఎలా?

ఆయన అంకెలు లెక్కపెట్టాలన్న విషయం మరిచి పోయాడు.

నరసింహం జగపతిరావును ఓ చేత్తో పట్టుకుని గాలి లోకి ఎత్తాడు.

"ఒరేయ్—జగపతీ: నేను వచ్చాన్రా....ప్రతీకారం తీర్చుకోవాలని వచ్చాను...." అన్నాడతడు.

చుట్టూ వున్న రివాల్వర్ మనుషులు ఏంచేయాలో తెలి యక విడ్డూరం చూస్తున్నారు.

నరసింహం కళ్ళు కోపంతో జ్వలిస్తున్నాయి. అతడు జగపతిరావును క్రిందకు దింపి "ఈ క్షణం నుంచీ నేను రింగ్ లీడర్ని—ఒప్పుకుంటావా?" అన్నాడు.

జగపతిరావు గుడ్లు తేలేసి నరసింహంవంకే చూస్తు న్నాడు.

"ముందు నీ అనుచరుల్ని యిక్కణ్నించి పొమ్మను" అన్నాడు నరసింహం మళ్ళీ. జగపతిరావు వెంటనే అతడి ఆజ్ఞను పాలించాడు. రివాల్వర్ మనుషులు వెళ్ళి పోయారు.

గదిలో నరసింహం, జగపతిరావు, జయరాజ్, ప్రకాష్!

"దేవుడున్నాడు!" అనుకుంటున్నాడు ప్రకాష్.

"జగపతిరావు అంతం సమీపించింది—" అను కున్నాడు జయరాజ్.

(ఇంకా వుంది)

Edited and Published by S. DAMODAR REDDY
3-4-554 Narayanaguda. Hyderabad-500 0:9,
and Printed at Kranti Press, Madras-600001.

Blank Page

Regd.no: H/HD-48
PRABHAKAR